గోపాలకృష్ణయ్య్య, పిల్లలమఱ్ఱి.

ముక్తాంబ

బెజవాడ, 1919

Record no. 606

Gōpālakṛṣṇayya, Pillalamaṟṟi

Muktāmba

Bejavāḍa, 1919

Record no. 606

SUNDARAYYA VIGNANA KENDRAM

1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

గోపాలకృష్ణయ్య, పిల్లలమఱ్ఱి.
ముక్తాంబ : ఆంధ్రదేశ చరిత్ర విషయిక నవల / పిల్లలమఱ్ఱి గోపాలకృష్ణయ్య.- బెజవాడ : వాణీ ముద్రాక్షరశాల, 1919.
(1), 112 p. ;17 cm.
Record no. 606

Gōpālakṛṣṇayya, Pillalamaṟṟi.
Muktāmba : Āṃdhradēśa caritra viṣayika navala / Pillalamaṟṟi Gōpālakṛṣṇayya.- Bejavāḍa : Vāṇī Mudrākṣaraśāla, 1919.
(1), 112 p. ;17 cm.
Record no. 606

35 mm microfilm

Image placement: IA IIA IB IIB

Date filming began:

9715

9715

ంథ సంఖ్య 9715 [illegible] మంత్రాంబు

ంచుక్రింద కడపటి దినమయున్నతేదీ

తలనీగ్రంథమును వాపసు చేయవ

లెను

5.7.51	16.6.63	
.9.51		
3-9-51		
4.11.51		
7-6-52		
5-7-52		
5-54		
0-54		
2-5-5		
2-56		
.4.56		
.3.61		
8 62		

స్వతీనిలయప్రచురములు 3.

ముక్తాంబ

(ఆంధ్రదేశచరిత్రవిషయికనవల).

పిల్లలమఱ్ఱి గోపాలకృష్ణయ్య.

బెజవాడ వాణీముద్రాక్షరశాలయందు
బి. కే. స్వామిచే
ముద్రింపఁబడియె.

 1919. [వెల రు ౦-౮-౦.

ప్రకరణముల సంఖ్య.

ప్రకరణములు:— పుట.

పీఠిక

తెనాలితాలూకా కూచిపూడిలో ౧౯౧౮ సం. లో నెలకొల్పఁబడి పెద్దలయాశీర్వాదముచే దినదినాభివృద్ధి గాంచుచున్న సరస్వతీనిలయమును దమరెఱింగియే యుండవచ్చును. ఈసరస్వతి నాలుగు సం. లనుండి యొకరాత్రి పాఠశాలను, అయిదు సం. లనుండి బహుమతి పరీక్షలను, మూడు సం. లనుండి బాలురవిద్యాభివర్ధనీ సంఘమును పోషించుచున్నది. ఈయంబ రెండు సం. లనుండి మనదేశమును బీడించుచున్న విషజ్వర నిగ్రహప్రయత్నములో సంఘసేవఁ జేసినది. ఇంకను జేయఁ గంకణముఁదాల్చినది. క్రిందటివత్సరమున తెనాలి తాలూకా హిందూఎలిమెంటరీబాలురకువ్యాయమోద్యమము నెలకొల్పినది.

ఇదిగాక గ్రంథరూపమునఁ బ్రజలకు సేవసేయు తలఁపుతోఁ గొన్నిప్రచురములను దేశమునకు సమర్పించుప్రయత్నములు సేయుచున్నది. ఈప్రచురములలోఁ జరిత్రాత్మకమైన నవలలును, సాంఘికనవలలును, విద్యావిషయములును, ప్రస్తుతకాలమున కుపయోగించు నితరగ్రంథములుండును.

మొదటిప్రచురము మాగ్రంథాలయచరిత్ర. రెండవది విద్యావిషయికోపన్యాసము. "ముక్తాంబ" యను నీతృతీయ ప్రచురము చరిత్రాత్మకమైన చక్కని నవల. గ్రంథకర్త

బాలుఁడు. వింశద్వర్షప్రాయుఁడు. అయినను నవలయొక్క ప్రాశస్త్యము మేమువర్ణించుటంకంటె దుదివఱకుఁ బరిశీలించిన వారికే తెలియఁగలదు.

నవలయందుఁ బ్రమాదములుండిన నుండవచ్చును. బాలునిపలుకులగుట నవ్వాని లెక్కసేయక మాకుఁదెల్పిన రెండవకూర్పులో సవరింపించెదము. భాషాభిమానులును, గ్రంథాలయాధిపతులును, దేశాభిమానులును మాయుద్యమమునకుఁ జేనయినంతవఱకుఁ జేయూఁత నొసఁగెదరుగాక యనిప్రార్థించుచున్నాము.

శ్రీసరస్వతీనిలయము,
కూచిపూడి, తెనాలితాలూకా.
19–11–1919.

విధేయుఁడు,
అక్కపెద్ది రామకోటి
శాస్త్రి-కార్యదర్శి.

శ్రీ

ముక్తాంబ

మొదటి ప్రకరణము.

చెంచుదండు.

అస్తాద్రి వెనుక సూర్యుఁడస్తమించుచున్న సమయమున నిరువురు రౌతులు పడమటినైపుననున్న బాటమీఁద నెల్లూరు పురాభిముఖులై స్వారిచేయుచుండిరి. దారి నిర్మానుష్యమై యుండెను. వారి సుందరాశ్వముల డెక్కల టకటక మను ధ్వనితక్క నితరశబ్దము లేశము నచటిప్రశాంత భంగ మొనర్చుటలేదు. గాలి మందముగా వీచుచుండెను. బాటకిరు ప్రక్కలనున్న మహోన్నతవృక్షము లామందమలయానిలునికి గౌరవ పూర్వకముగ స్వాగతమిచ్చుచున్నట్లు తమపెద్ద తలల మెల్లన నాడించుచుండెను.

బాటసారు లిరువురు నలసియున్నట్లు కన్పట్టుచుండిరి. వారిముఖములఁ బెద్దపెద్దస్వేదబిందువులు గానవచ్చుచుండెను. విలువగలిగి, తమ్ముధరించిన పురుషులు శ్రీమంతులని చెప్పక చెప్పుచున్న వారిదుస్తులు చెమటచే దడిసి యంగముల కంటుకొనిపోయెను. వారి పట్టుపాగాకుచ్చులు స్వారిలో వెనుక

నెగిరిపడుచుండెను. ఆభద్రజాతిహయములు సహితము మిగుల డస్సి మిక్కుటముగ వగర్చుచుండెను. వాని శరీరములనుండి స్వేదకణములును, నోటినుండి నురుగు తుంపురులు నామార్గమందుఁ బొడుగునను బడుచుండెను. అయిన నాయాశ్వికులు గమనవేగముఁ దగ్గించు యత్నముసలుపలేదు.

ఆపురుషు లుభయులును సమాన వయస్కులుగఁ దోఁచుచుండిరి. వారి శరీరసౌష్ఠవమును, ముఖముతీరును గమనించిన, వారు నడివయసులో నున్నారనియు, నొక్కొక్కనికి నలువది వర్షము లుండుననియు సులభముగాఁ దెలిసికొనవచ్చును. ఒకఁడు ధవళాశ్వము నారోహించియుండెను ఆతనికిఁ దన సహచరునివలెఁగాక నల్లని జీడిగింజలవంటి మీసములు పైపెదవిపైఁ గొనలు తేలియుండెను. ఆతని వదనమతి గంభీరమై మహాధికారి లక్షణములఁ జాటుచుండెను. నిజానుచరునికంటె విలువగల దుస్తులను ధరించి యాతఁడు గుఱ్ఱముపై నిర్లక్ష్యముగా నాసీనుఁడై ముందునకు దృష్టిసారించి, పిననాటఁగోలె నాశ్వికుఁడయియున్న ట్లొయ్యారముగా స్వారిచేయుచుండెను.

హయారూఢులందు ద్వితీయుఁడుగూడ వర్ణనాపాత్రమైన యాకృతిగలిగి రత్నాకర గంభీరుఁడై, తేజోవంతమైన సుందర వదనముతో విరాజిల్లుచుండెను. ఆతనికి శ్మశ్రువులు లేవని చెప్పియుంటిమి. తడిసి దేహమున కంటుకొనియున్న యాతని యంగరకాలోనుండి కమ్మెచ్చు దీసినట్లున్న దీర్ఘబాహువులును, విశాలవక్షస్థలమును ప్రస్ఫుటముగఁ గన్పట్టుచుండెను. శౌర్యరస మాతని యంగములనిండి నేత్రములనుండి యొలుకుచున్నట్లాతని చూడ్కులు ప్రకాశవంతములై, గంభీరములై, యున్నతోద్యోగ సూచకములై, దూరాలోచనా సమన్వితములై రాణించుచుండెను.

వామపార్శ్వంబుల నొఱలందు వ్రేలుచున్న ఖడ్గములఁ బట్టి వారిరువురును వీరపురుషులనియు, సమరపరిచితులనియుఁ గనుఁగొనవచ్చును. తెల్లహుమాయినెక్కిన శూరుఁడు చామనచాయ మేనివాఁడు. నీలాశ్వము నారోహించిన ద్వితీయుఁడుదబ్బపండువంటి పచ్చనిచాయగలవాఁడు. వారుమౌనముద్రవహించి ప్రయాణ మొనర్చుచుండిరి.

భానుబింబమునాఁటికి దృష్టిపథముదాఁటెను. సంజకెంజాయలు జేగురుపూసినట్లు పశ్చిమదిశఁబర్వెను. శకుంతసంతానములు కలకలనాద మొప్ప తమతమగూండ్లుచేరఁజొచ్చెను. బాటహద్దులలోనున్న వృక్షరాజములపై విహంగకూజితంబులల్లకల్లోలముగ నుండెను. అశ్వముల ఖురనాదమాకూఁతల మిళితమై వినవచ్చుచుండెను. నెల్లూరింకను మూఁడుమైళ్లదూరమునుండఁగనే పాంథులిరువురు నాకస్మికముగ నొకవెదురుగుబురుప్రక్కన గుఱ్ఱములనాపి యవరోహించిరి.

అచ్చటబాటప్రక్క నొకపెద్ద మామిడి తోఁపుండెను. దానిముందర - మార్గమున కతిసమీపముగ నొకపెద్ద యిటుకబావియు నచ్చట నొకచేదయుఁగలవు. ఆప్రయాణికులది తాత్కాలికమైన మజిలీగా నిదివఱకే నిర్ణయించుకొన్నట్లుండెను. ఇరువురును బావిడాసి,నీరుతోడి ముఖములు, కాలుసేతులు

కడిగి, సేదదేరి, యొక్కింతకాలమా సామీప్య వృక్షముక్రిందఁ గూర్చుండి సంభాషింపఁ జొచ్చిరి.

“అల్లంపూడినుండి మంచివేళబయలువెడలితిమి. అనుకొనినట్లుసరిగా నీతోపు సూర్యాస్తమయమైన పిమ్మటఁ జేరితిమి.” అని మొదట వర్ణింపఁబడిన శూరుఁడు తలపాగతో విసరుకొనుచుఁ బలికెను.

“ఔను. ఇచ్చట నొకగడియకాలము విశ్రమించి కనుచీఁకటిపడిన తరువాత పురముఁ బ్రవేశింతము అశ్వములు వగర్చుచున్నవి.” అని ద్వితీయపురుషుఁడు, సమాధానమిచ్చి తానును తలపాగఁదీసి విసరుకొనఁ జొచ్చెను.

అశ్వములవైపు చూచుచు కొద్ది కాలము వారు నిశ్శబ్దముగవిసరుకొనుచుండిరి. ఎచ్చట నెట్టిసందడియును లేదు. గాలి కూడవీఁచుట యాగినట్లుండెను. చెట్లయాకులు స్వల్పముగనైనఁ జలించుటలేదు. గుఱ్ఱములు ఱొప్పుచుండుట మాత్రము విశదముగావినఁబడుచుండెను.

ఆకస్మికముగ నానిశ్శబ్దభంగముఁ గావించుచు నొకవింత మ్రోఁతవినవచ్చెను. సమీపమున నెవరో కొమ్మో, శంఖమో గట్టిగామ్రోయించినట్లయ్యెను. అశ్వములు చెవులుదిక్కించి యొక్కమారుగ సకిలించెను. ఆయోధుల హస్తములప్రయత్నముగ ఖడ్గముల పిడులవైపుచనెను. దడదడమని తోపువైపున శబ్దముపుట్టెను. వారొండొరుల ముఖములఁ దిలకించుకొనిరి. ఏకభావముతోఁ గరవాలములుదూసి తటాలున బావికెడముగ నిలువఁబడిరి. మఱుక్షణములోఁ బెక్కుమంది నల్లనిచెంచు

లాశూరులఁ జుట్టి భయంకరముగ నేలలోనుండి జన్మించినట్లు—కాక మింటినుండి యూడిపడినట్లు పొడగట్టిరి.

ఆయోధు లత్యాశ్చర్యము నొందిరి. కానిత్రుటికాలము మాత్రమే. నిష్కారణముగఁ దమ కెగ్గుదలఁచిన యాచెంచుదండును జూచినంతనే వారికి వీరావేశము గలిగిఁ నేత్రములు రక్తిమనొంది ప్రకాశింపఁ జొచ్చెను. విరోధులసంఖ్య యిరువదిలోపుగ నుండెనని వారొక్క చూపుతో గ్రహించి, నిర్లక్ష్యము సూచించుచు భయంకరాట్టహాసములతో ఖడ్గములు ఝుళిపింపఁ దొడఁగిరి. నల్లని వికృతాకారములుగల యాచెంచులలోఁ బెక్కురు విండ్లు, కోలలు ధరించి వాని నుపయోగింప సంసిద్ధులై యుండిరి. డాలులు లేకుండ నెట్లువారి బాణములఁ దప్పించుకొననెంచిరో యాయోధులకే యెఱుక— పరమేశ్వరునికే యెఱుక.

ఊపిరి సలుపుకొనుటకైన వ్యవధిలేక ముందేపోరారంభమాయెను. అంతకుఁ బూర్వము నిశ్శబ్దముగనున్న యాప్రదేశమున కంగు కంగుమని కత్తులతాకిడియు, విపరీత హాహాకారములు నుద్భవించెను. క్రమ క్రమముగఁ నావరించుచున్న కనుచీఁకటిలో నాయోధుల కృపాణములు మెఱపుతీగలవలెఁ గన్నులు మిఱుమిట్లు గొలుపుచుండెను. అసహాయశూరులైన యాశూరద్వయము తమ యపాయస్థితిని గ్రహించుకొని చెంచులు వాడిబాణములు ప్రయోగింపక పూర్వమే వారిపైఁబడి దారుణసంహారమునకుఁ గడంగిరి. వారియడ్డులేని ఖడ్గధాటిముందు చెంచుల తలలును, కాళ్ళును, చేతులును, పరి

కరములును విచిత్రముగ నెగురుచుండెను. తమవారి రక్తమును నాశమును గన్నులారఁజూచి, ప్రచండ క్రోధముల నొంది మిగిలిన చెంచు లొడలుమఱచి వికృతముగ గొంతులు పగులునట్లు హుంకరించుచుఁ, గేకలు వైచుచు, విజృంభించుచు, డీకొనుచు, అంకెలువైచుచు, నుఱుముచు నాప్రదేశమునఁ గోలాహలము సేయుచుండిరి.

మిక్కిలి చిత్రముగ నాయశ్వములు రెండును నాభీలముగ సకిలించి చెంచులపైఁబడి విచ్చలవిడి త్రొక్కివేయ నారంభించెను! ఆయాటవికులనాశనము విదితమయ్యెను. పెక్కురుగతజీవులై నేలపై రుధిరములోఁ జూచిన గుండెలవియునట్లు పడియుండిరి. ఒకరిద్దరు మరణవేదనతో వెక్కసముగ మూల్గుచుండిరి. హతశేషులార్వురు మాత్రమే యుండిరి. వారుప్రాణములకుఁ దెగించి పోరుచుండిరి. వారిలో నా దండునాయకుఁ డద్భుతముగ సమర మొనర్చుచుండెను.

ఆకస్మికముగఁ జామనచాయ మేని శూరుఁడు, కంఠమునుండి శోణధారలుగట్ట నేలమీఁది కొఱగెను. అదిచూచి చెంచులొక్కపెట్టుగ నుత్కంఠతతో గర్జించుచు తోపుమా అభ్రమ్రోఁతలిడు నట్లార్భటించుచు, నిలిచియున్న శూరాగ్రేసరుని గ్రమ్మిరి. ఆతఁడు తనమిత్రునికి సాయముచేయ వ్యవధిఁ గానక వారినెదిరి తోకఁద్రొక్కిన త్రాఁచువలె మండిపడుచు కుడియనక, యెడమయనక, ముందనక, వెనుకయనక, మీఁదనక క్రిందనక తన నిశాతకరవాల మృత్యుదేవతను జుట్టునుదాండవ మాడించుచుండెను.

హయము లలసి నిలిచెను. కఠినప్రయాణ మొనర్చినయాయోధుఁడును మిక్కిలిడస్సి నలఁగి, కొలఁదికాలములో ఖడ్గము విడువవలసివచ్చు నట్లుండెను. అయిననాతఁడు వధమాన లేదు. మఱియిరువురు చెంచుల శిరములు బంతులవలె నెగిరిమొండెములకు దూరముగ భూమిపైఁబడియెను. ఇఁక నలువురు మాత్రముండిరి. నలుగురు—నలుగురుమాత్రమే! ఆయోధునకు నలుగురనిన లక్ష్యమా? కాని యిట్టివేళలనా? ఆతనికన్నులు తిరిగినట్లయ్యెను. తలదిమ్ముగనుండెను. ఎట్లో చేతిలోనుండి కృపాణమెగురఁగొట్టఁబడియెను. ఆతఁడు నిరాయుధుఁ డాయెను. నిస్సహాయుఁడయ్యెను. చెంచునాయకుఁడాతనిఁ జంప తనయెఱ్ఱని చుఱకత్తి భయంకరముగఁ బైకెత్తెను. ఆయోధుఁడది చూచి గ్రహించెను. కాని యేమిచేయవలయును? ఆతఁడు కనులుమూసికొని భగవంతుని తలఁచుకొనెను. ఒక్కక్షణము-తానుండఁడు.

ఎవ్వరో కెవ్వున నార్చిరి. దబదబమనుశబ్దము ముహూర్తమాత్రము వినఁబడెను-పిమ్మట నిశ్శబ్దము. ఆయోధుఁడుకన్నులు విచ్చెను. ఎదుట నొకసన్యాసి వింతతేజముతో, దేవతవలెఁ జేత నొక కరవాలముధరించి నిలిచియుండెను. ఆతనిప్రక్క చెంచునాయకుని శవము నిలువున నేలపైఁ బడియుండెను. మిగిలిన ముగ్గురు చెంచులును బలాయన మొనర్చిరి.

ఈయాపద్బాంధవుఁడగు సన్యాసియెవ్వఁడు?

రెండవ ప్రకరణము.

* సన్న్యాసి *

నిలిచియున్న యాయోధునివింత యడుగకముందే యాపన్న ప్రసన్నుండైన యాసన్న్యాసి ఖడ్గము క్రిందఁబడవైచి నేలపైనొఱగియున్న శూరుని సరసమోకరించి కంఠమందలి గాయము పరీక్షింపఁ జొచ్చెను. నాటకమందువలె నొకదాని నొకటి విచిత్రముగ ననుసరించిన భయంకర ప్రదర్శనములచే నొకింత యేమరుపాటుఁజెంది, తననుదానే మఱచిన యానీలా శ్వారూఢుఁ డీమెడకుఁదెలివి తెచ్చికొని తటాలునఁ దానును మూర్ఛఁజెందిన నిజమిత్రుని కవ్వలిప్రక్క మోకరించి సన్న్యాసి చర్యల గమనింపఁదొడఁగెను.

సన్న్యాసిగాయము జాగ్రతగాఁబరికించెను. అదియరంగు ళము చదరపు పరిమాణముకలదై కంఠము కుడిప్రక్క, దవ డకు మూఁడువ్రేళ్ళక్రిందఁ గలిగెను. దానినుండి రక్తమింకను మెల్లగ స్రవించుచునే యుండెను. అంతకుఁబూర్వము కారిన నెత్తుటిచే నామూర్ఛితునికంఠము, కుడిభుజము, వక్షస్థలముఁ దడిసిపోయెను. ఆవిలువగలదుస్తులపై నెఱ్ఱని రక్తము దృష్టి చెదరునట్లుండెను.

"అయ్యా! గాయ మపాయకరమా?" అనిమూర్ఛి తునిమిత్రుఁడు సన్న్యాసి నాత్రతతో నడిగి సమాధానము కొఱకై యాతనిముఖమువంకఁ దీవ్రముగఁ జూచుచుండెను.

"భయములేదు! పరమాత్మునిదయచే నిది యచిరకా లములో నయముగాఁగలదు. ఆచేఁదతో నీరుదెమ్ము"

సన్న్యాసి యానతి క్షణములో నిర్వర్తింపఁబడెను. యోధుఁడు తెచ్చిన శీతలోదకముతో నాతఁడా మూర్ఛితుని గాయము కడిగి కట్టుఁగట్టుటకు సిద్ధమై ప్రక్కఁజూచెను. ఆతని యభిప్రాయము గ్రహించి యాశూరుఁడు నిర్లక్ష్యముగాఁ దన తలపాగలోని భాగము చించియిచ్చెను. ఆపాగ చాలవిలువ గలది యగుట సన్న్యాసి కొంత విస్మయము గనఁబఱచి యా తని యుదారగుణమునకు మెచ్చుకొని యావస్త్రభాగముతో మిక్కిలి నేర్పుగకట్టుగట్టెను.

మఱల నాయోధుని వింత యినుమడించెను. సన్న్యాసి గాఁ గన్పట్టుచు రణశాస్త్రము వ్రణశాస్త్రమునం దారితేరిన యాపురుషుఁ డెవ్వఁడు? తలవని తలంపుగ నచ్చోటి కావేళ యెట్లువచ్చెను? సన్న్యాసి మూర్ఛాగతుఁడైన శూరుని వదనము పైఁ జల్లని నీరుచల్లుచుండెను. ఆసమయమున నాయోధుఁ డాతని యాకృతిని సూక్ష్మముగాఁ బరీక్షించెను.

ఆయోగిదట్టమైన చామనచాయగలిగియించుమించుగా నలుపని చెప్పనొప్పు శరీరచ్ఛాయగలవాఁడు. గంభీరుఁడు. వయసు త్రింశద్వర్షములో కాక యింకను నేమాత్రమో తక్కువయో యుండును. వదనమున దివ్యతేజస్సు కలిగి యాతఁడు భూలోకమునకు విలాసార్థమేగుదెంచిన త్రిమూర్తు లలోనొకఁడన్నట్లుండెను. కాషాయ వస్త్రములగుండఁ గన్పట్టు మెడయు, ముంజేతులును, పిక్కలును మిగుల పుష్టిగలిగి

యాతఁడు వజ్రకాయుఁడని తెలియఁజేయుచుండెను. ఆతనికి గడ్డము విస్తారముగ లేదు. శిరముపైఁ గురులు జటలుగనల్లుకొని సాంబమూర్తివలె గోపురముగా ముడివేయఁబడి సుందరములై యుండెను. మధ్యస్థమైన యెత్తుగల్గి యాతని యాకారముఁ జూపఱహృదయాకర్షణ మొనర్చుచుండెను.

ఆయోధుఁడీ విషయములన్నియు గమనించునప్పటికి మూర్ఛితుఁడు సేదదేఱి, నేత్రములు విచ్చి మెల్లగా లేచి కూర్చుండి, క్రొత్తమనుష్యునిరాకకు వింతఁ గనుఁబఱచుచుఁ దన మిత్రుని వంకఁ బ్రశ్నార్థకముగఁ జూచెను.

“ఈ మహానుభావునికి మన మనేక కృతజ్ఞతావందనములర్పింపవలసియున్నది- ఈతని సమయాగమనమువలననే మన మింకను జీవములతో నున్నారము” అని నీలాశ్వపురాతు వెంటనే ప్రత్యుత్తరమిచ్చెను.

“స్వామీ-”అని మూర్ఛదేఱిన యాతఁడు కృతజ్ఞతాపూర్వకముగ నేమోచెప్పనారంభించి బాధచేనాగెను.

“మిత్రమా! ఇంక పది పండ్రెండుగంటలవఱకు నీవు మాటాడుట అపాయకరమనుట మఱవకుము- కృతజ్ఞత భగవంతుని యందుఁగాని, కేవలనరులకుఁ గూడదు.” అనుచు సన్యాసి మృదువుగా నాతని వారించెను.

నల్లగుఱ్ఱపురాతు తన మిత్రునికి జరిగినవిషయములు- సన్యాసి చిత్రముగాఁ దమ్ము రక్షించుట పూసగ్రుచ్చినట్లు చెప్పి యానూతన పురుషునితో నిట్లనియెను:—

“స్వామీ! మీతీరుచూడ ప్రచ్ఛన్నవేషమున ఋతుపర్ణుఁగొల్చిన నలచక్రవర్తివలె నున్నది. వేషముజూడ మహాయోగీశ్వరుని బోలియున్నది. ఇంతకుఁబూర్వము కనుఁబఱచిన యుద్ధకౌశల్యముఁగాంచ భీష్ముఁడు స్ఫురణకువచ్చెఁ. వ్రణవైద్యమునందలి యపారకౌశల్యము ధన్వంతరిని మఱపించుచున్నది. సాధారణసంబంధములేని యిన్నిగుణములొక్క మూర్తియందెట్లుండెనాయని మాకు మహాశ్చర్యము జనించుచున్నది. మాది నెల్లూరు. మిమ్ముచ్చటఁజూచిన జాడలేదు. మీచరిత్ర మాకభ్యంతరములేనిచోఁ జెప్పి, నేఁటికిఁమాపురమందలి యాతిథ్యము చవిఁజూచిఁపోవలెనని హృదయపూర్వక ప్రార్థన ”

ఈమాటలకు యోగిమందహాసమొనర్చెను. వక్తను తేఱిపాఱఁజూచుచు నాతఁడింకను జిరునగవుతోడనే యిట్లనియెను;— “నేనొనర్చిన సాయ మతిస్వల్పమైనను-సమయానుకూలమగుట-మీచేనింతగాఁ గొనియాడఁబడుచున్నది. మీయాతిథ్యమనుభవించుటకు నాకెట్టి యభ్యంతరమును లేదు. కాని గాయముచే బాధపడుచుండిన యీవీరునితోఁ బురమిప్పుడు చేరుట వెఱ్ఱితనము .తోపున కనతిదూరమున నాపర్ణశాలకలదు. మీరచ్చట నేఁటిరాత్రి విశ్రమించి వఱువాతఁ జనవచ్చును. అభ్యంతరముఁ జెప్పకరండు”

“అయ్యా!” ఆయోధుఁడు వినయపూర్వకముగఁబ్రత్యుత్తర మొసఁగెను, ‘మీదయక్షణక్షణప్రవర్ధమానమగుచున్నది. కృతజ్ఞతచే మాహృదయసీమలు నిండినవి. కాని ఆశ్వికుల

మగుమేము మీవంటి యోగిచంద్రులకు శ్రమ యీఁదలఁచు కొనలేదు:— మాయాగమనముచే మీకుటీరశాంతము భంగ మొనర్ప నెంచుకొనలేదు. కావున మాక్షమాపణ నుదార బుద్ధితోఁ గొనవలెనని మనవి."

సన్యాసి గంభీరముగ నాద్యంతమువిని మరల కొలఁదిగ నవ్వియిట్లనెను. "మిత్రులారా! మీరు నాకెట్టి శ్రమయు నీయరు. నేను కేవలము పర్ణశాలయందు నివసించుటలేదు. ఈతోపులో చివరభాగమున నొకపెంకుటిల్లున్నదని మీకు బహుశా తెలిసియేయుండును. నేనుప్రస్తుతము దానిలోనున్నాను. కనుచీఁకటి పడినది. మీరుసంకోచింపక రండు"

ఆయోధుఁడెట్టి ప్రత్యుత్తరము నీయకమునుపే పదు నాలుగేండ్ల పచ్చనిబాలుఁడొకఁడు రోజుచు నచటికి తోఁపు ప్రక్కగాఁ బరువిడుచువచ్చి, "బాబూ! బాబూ! చెంచు దండువచ్చి పెంకుటిల్లు ముట్టడించినది - చిన్నయ్యగారు - చిన్నయ్య - గా - రు -" అనుచు నకస్మాత్తుగ నాగెను.

సన్యాసియులికిపడి తటాలునఁ బ్రచండక్రోధముతో లేచి నిలిచి రెండడుగులు ముందునకువైచెను:—కాని మఱు నిమిషములోఁ దన్నుఁదా నెఱిఁగి, యోగి వెనుకకుఁదిరిగి, క్షమాపణపూర్వకముగ "అయ్యలారా! నన్ను క్షమింపవేడెదను. లోకములో నాకున్న సర్వస్వమగు స్నేహితుఁడు మహాయపాయములోనున్నాఁడు—" అనియారంభించెను.

"అయిన నాఋణము నేదీర్చికొనెదను," అనుచు నాయోధుఁడు వీరావేశముతో నాతనికడ్డమువచ్చెను.

ఆగుము-నీస్నేహితుని క్షేమముగాఁ బురముఁజేర్చుము. జాగ్రత! చెంచుదండింకను నశింపలేదు. మీరాలసింప వలదు. మీస్థితులగ్రహించుటచే నాచేతనయిన సాయము చేయ నుద్దేశించితినిగాని దైవసంకల్పము వేరేయున్నది. నేను వెడలుచున్నాను. మీప్రాణములు విలువగలవనియు - నెల్లూరుపురాభివృద్ధియు, ఐదువతనమును మీక్షేమములో నున్నవనియు బాగుగ నెఱుఁగుదును. ముమ్మాటికిని భద్రము - పురముఁజేరుఁడు - జాగ్రత్త! - శ్యామోజీ! రమ్ము, రమ్ము"

సన్యాసియు బాలుఁడును క్షణములోఁ దోఁపుప్రక్క నదృశ్యులైరి. తమ్మాతఁడు బాగుగా నెఱిఁగినట్లు మాటాడి నందుల కమితాశ్చర్యము నొందుచు నాయోధు లొకరిమొగ మొకరు చూచుకొనఁ దొడఁగిరి.— బాగుగాఁ జీఁకటిపడిన మూడు గడియల కాయోధు లిరువురును సురక్షితముగ నెల్లూరు పురముఁ బ్రవేశించిరి.

మూడవప్రకరణము

చండికాలయము

నెల్లూరునకుఁ బశ్చిమముననున్న సాంద్రారణ్య మధ్యమున నర్ధరాత్రమందు పిశాచములవలెనున్న పలువురు చెంచులనడుమ నేలపై నొకసుందరి ఖిన్నవదనముతో నాసీను

రాలైయుండెను ఆచోటచెట్లు తీఁగెలు పొదలు తొలఁగింపఁబడి వాసయోగ్యములగు కొద్దిగుడిసెలు నిర్మింపఁబడియుండెను. వాని కనతిదూరమున వెదుళ్ళతో నిర్మింపఁబడి వివిధములగు తీఁగెలతో, పుష్పములతో నలంకరింపఁబడిన ద్వారముగల యొకచిన్న దేవాలయమువంటి కట్టడము కలదు. తెఱవఁబడియున్న తలుపులోనుండి భీకరచండికా విగ్రహము పాలకర్ర దీపముల వెలుఁగున స్పష్టముగఁ గానవచ్చుచుండెను. కొఱవిదయ్యములవలె నాయాటవికులలోఁ గొందఱు కాగడాలు పట్టుకొని యటునిటుఁ గ్రుమ్మరుచుండిరి.

అద్వితీయలావణ్యనిధియగు నాజవ్వనితక్క మిగిలినవారందఱును మహోల్లాసములోనుండిరి. ఆసుకుమార యాకిరాతులకెట్లు చిక్కినది? అట్టి మనోహరమగు మొగలిపూవా పిచ్చిముండ్ల పొదలమధ్యనెట్లు వికసించినది? కారుమేఘముల నడుమఁ బ్రకాశించుపున్నమ చంద్రునివలె నొప్పుచున్న యాసుందరి యాప్రదేశమును నిజసౌందర్యముచే తేజోవంతమొనర్చుచుండెను. జ్వాజ్వల్యమానమగు జ్యోతిచుట్టునాడు మిడుతలవలె నాయాటవికులా యువతిచుట్టును విపరీతనృత్యము సలుపుచు వికృతారావములును వెడఅట్టహాసములును సలుపుచుండిరి. ఈశలభంబులు తుదకా తేజమందు మ్రగ్గునా?

ఆయొప్పులకుప్ప నొకమారుగాంచిన వారు మరల జీవితకాలములో క్షణము మఱవఁజాలరు. ఆమనోహరవినీలకుటిలకుంతలములు, ఆవిశాలఫాలము, ఆ హరిణసుందరనేత్రములు ఆముద్దుట మూటగట్టు కళంకలేశరహితమైన వదనబింబము-

దివిటీల కాంతుల ప్రతిఫలించుచున్న స్నిగ్ధదర్పణములవంటి చెక్కిలు - ఆమేలిమి బంగారు శరీరచ్ఛాయ - ఆసుకుమార దివ్యాకృతి చూచి- కన్నులకఱవుదీఱఁగాంచి తుష్టిచెందఁగలవాఁడెవఁడు? ఆలావణ్యమిహలోకమునకుఁ జెందవలసినదికాదు. ఆరత్నములబొమ్మ మనుష్యమాత్రుల కుద్దేశింపఁబడినట్లులేదు. ఆవజ్రమా మహారణ్యములో నా కిరాతులనడుమఁ బ్రకాశింపఁ దగినదికాదు. కాని దైవఘటన మహాచిత్రము. విచారగ్రస్తురాలై యాజవ్వని నాఁటియర్ధరాత్రమం దాయడవిలో భూతములమధ్య కటిక నేలపై నేలాకో యాసీనయైయున్నది.

చెంచులలోఁ గొందఱు చిన్నతప్పెటలు వాయించుచుండిరి. కొందఱుకొమ్ములనూదుచుండిరి. కొందఱుచప్పట్లు కొట్టుచుఁ దాళము వేయుచుండిరి. వేఱొకకొందఱు గిర్రునఁ దిరుగుచు, నెగురుచు, నూగుచు, బొబ్బలువెట్టుచు, హుంకరించుచు, తలలు ఱొమ్ములు చఱచుచు, చిందులు ద్రొక్కుచుండిరి. అది మహారణ్యము - దానిలో నిశీథసమయము- నడుమ పిశాచనాట్యము సలుపుచున్న కిరాతులవలయము- వారిచుట్టును పాలకర్రదివిటీలు-ఈవలయమునకు మధ్యవిషాదముతో నవనత శిరస్కయై కూర్చున్నయొక తరుణిదివ్యసుందరవిగ్రహము. ఈభయంకర ప్రదర్శనమున కర్థమేమి?

ఆమె వేనిని గమనించుటలేదు. దృష్టి నేలపైఁ బఱపి దీర్ఘముగా యోజించుచున్నది. అప్రయత్నముగ చేతిబొటనవ్రేలితో నేలమీఁద నేమో వ్రాయనారంభించినది. ఏమి వ్రాసెనో యామెకుఁ దెలియదు. కొంతవఱకువ్రాసి, తెలివి

తెచ్చికొని యామె యాయక్షరములఁ బరీక్షించెను. అవి యస్పష్టముగ నేలమీఁదఁ గన్పట్టెను. ఆమెలోలోనఁజడుపుకొనెను - సిగ్గుజెందెను - ధైర్యమొందెను. ఆ అక్షరము లేమి ?—'ము—కుం—ద' ఈమూఁడుమాత్రమే యామె వ్రాసెను. ఆపదోద్ధారకుఁడగు ముకుందుని దలఁచుకొను చున్నదా ?

చెంచులకు వీరావేశము ద్విగుణితమయ్యెను. వారు పదములుపాడుచుండిరి. అవిపాటలుగావు - కేకలు - పెడబొబ్బలు—పెనుఱంకెలు —పెద్దయురుములు — తప్పెటలు దబదబ మ్రోఁగుచుండెను- చిందులు గబగబవినవచ్చుచున్నవి. గజ్జెలు ఘల్లుఘల్లున మ్రోయుచున్నవి—చేప్పట్లు ఫెళ్ళుఫెళ్ళున రేగుచున్నవి. నాట్యము భయంకరముగనున్నది. ప్రక్కనఁ గూర్చున్న చెంచెతల ప్రోత్సాహపు కేకలు మిన్నందుచున్నవి. అడవి యాకోలాహలంబునకుఁ బ్రతిధ్వను లిచ్చుచున్నది. ఇంకను—ఇంకను—ఇంకను చెంచులాడుచునే యుండిరి—ఇంకను—ఇంకను—ఆసుందరియట్లే ప్రతిమవలెఁ గూర్చుండి యున్నది.

ఎట్టకేలకు నృత్యమాగెను. బొబ్బనవ్వులాగెను. వికృతపు పాటలు సద్దుమణగినవి. దబదబలు-గబగబలు-టపటపలు హాహాకారములు- అట్టహాసములు-అన్నియు శాంతించినవి. ఒక్కక్షణకాలము ప్రబలశాంతము నెగడెను. తరువాత ఝుమ్మను శబ్దము వినవయ్యెను—తుపానురాఁబోవు చున్నది. ఆఝుమ్మనుశబ్దము చిన్నచిన్న మాటలుగను-వాక్యములుగను-

వాదములుగను - జగడములుగను - కేకలుగను - అల్లకల్లోలముగను పరిణమించెను. ఆజవ్వని యేమిచేయుచున్నది?

ఇంకను నిశ్చలముగానట్లే యుపవిష్టయైయున్నది. ఆ మనోహరమూర్తి సజీవమా? లేకవిగ్రహమా? — ఒకచెంచెతవచ్చి యాయువతి హస్తముగట్టిగాఁ బట్టికొనిలాగెను, ఆమెయాలోచనాంధకారముపై భానుప్రకాశమైనట్లాయెను. ఉలికిపడి యామెతలపైకెత్తి యాచెంచెతవైపు తీవ్రముగఁ జూచెను. కిరాతాంగన యామెను మఱింతబలాత్కారముగ లాగెను. సుందరి లేచినిలిచెను. ఆమె "యనన్యసామాన్యలావణ్య' మిప్పుడు చూడవలెను. ఆయాకృతియందలి నిమ్నోన్నతసోయగ మిప్పుడు గమనించవలెను. ఆముఖచంద్రునిముందు దివిటీలు కాంతిహీనములై పోయెను,

మఱికొందఱు చెంచెతలువచ్చి యామెచుట్టును మూఁగి సందడిచేయ నారంభించిరి, శాంతముగా నామెకాగల దానికి వేచియుండెను. పురుషులలోఁగలసి స్త్రీలు నృత్యము మొదలుపెట్టిరి. ఒకతె యాజవ్వనిని మెల్ల మెల్లగ నడిపింపఁ జొచ్చెను. అట్లాగుంపు చండికాలయము సమీపించెను- దాని ముందఱ నందఱును నొక్కమారుగ నిలిచిరి.

వారి పురోహితుఁ డుచ్చస్వరముతో మంత్రములారంభించెను. అతఁడు తప్ప మిగిలినవారేకభావముతో నిశ్శబ్దముగా నుండిరి. కొలది కాలము మంత్రములైన పిమ్మట కొందఱుచెంచులొక కారుదున్నను పగ్గములతోఁ బట్టికొనివచ్చి గుడివాకిటి కెదురుగ నిలువఁబెట్టిరి. ఒక కఱకు ఆటవికుఁడు

గండ్రగొడ్డలి చేతధరించి దానిప్రక్క నిలువఁబడెను. మఱి కొన్ని మంత్రములు పఠింపఁబడిన పిమ్మట నొక్కమాఱుగ కేకలు- తాళములు- పాటలు- మృదంగములు ప్రారంభమై గందరగోళము నిండిపోయెను. ఆకాఱుదున్న పెనఁగులాడెను. తన జీవితము నాఁటితో ముగియుచున్నదని దానికి మనసు నొక్కి చెప్పుచుండెను. అదిగిజగిజలాడెను- పగ్గములు త్రెంపఁజూచెను- ముక్కుపుటంబులగూడ శ్వాస విసురుగ విడిచెను. కొమ్ములతో నటునిటుఁ జిమ్మెను. క్రుమ్మఁజూచెను. కాని నిష్ప్రయోజనము. చెంచు హాతకుఁడు తళతళలాడుచున్న గండ్రగొడ్డలిపైకెత్తెను. అప్పుడు దానిలో మృత్యుదేవత తాండవమాడుచుండెను. స్త్రీపురుషులనక కిరాతులందఱొక్కపెట్టునఁ బెద్దకొండ కేక పెట్టిరి. కాఱెనుబోతు ఖణిలన్ని రంకెవైచెను. విసురుతో గండ్రగొడ్డలి దానిమెడపై వ్రాలెను. మొండెము తల త్రుటిలో వేఱైపోయెను. దాని నెత్తురు పళ్ళెరములోఁ బట్టి శిరమును మంత్రపూర్వకముగ మోయించుచు పురోహితుఁడు వానిని చండిక విగ్రహము ముందుంచెను.

ఈదారుణకృత్యమాసుందరి యామూలాగ్రము గనునించెను. ఆయెనుము ప్రాణములకై పడిన పరితాపము కన్నులారఁ దిలకించెను. ప్రాణములెంత మధురములు! తనసంగతి కూడ- తనజీవితముకూడ త్వరలో ముగియవలసినదేనా? పైన భగవంతుఁడున్నాఁడా? ఉండిన నిరపరాధియైన యాకాఱెనుమునేల రక్షింపఁడు? నిష్కారణముగ వేలకొలందిగఁ దెగుచున్న యసహాయమృగములనేల కావఁడు? నోరులేనిమృగములు పాపము నిత్యము నెన్నిక్రూరమృగముల వాతబడుచున్నవి? ఇదేమిసృష్టి- యిదేమియన్యాయము?

ఆమెను జెఱియొక ఱెక్కపట్టుకొని యిరువురుస్త్రీలు గుడిలోనికిఁ దీసికొనిపోయిరి- ఈడ్చికొనిపోయిరి. పోవునప్పుడామెచే బలవంతముగ నామన్న కంఠమునుండి కాఱిన యెఱ్ఱని నెత్తుటిలో నామె పాదములు మోపించిరి. ఆమెపదములు చుట్టు శోణమంటుకొని పారాణి పూసినట్లుండెను. ఆమె యొడలు పులకరించెను. చేయునదిలేదు.

గుడిలో నిప్పుడామె చండిక విగ్రహము కట్టెదుట నిలువఁబడియున్నది. చేతులు కదలింపకుండ నిరువురు రాక్షస స్త్రీలామె ఱెక్కల మోటుగాఁ బట్టికొనియున్నారు. పురోహితుఁడు పెద్దగొంతుకతో తంతునడిపించుచు దేవిపూజఁ జేయుచుండెను. గండ్రగొడ్డలితో హాతకుఁడామెప్రక్క సిద్ధముగ నిలిచెను. ముగ్గురు, నలుగురుముఖ్యులుమాత్రము లోనికిఁజనిరి. మిగిలిన వారు గుడిద్వారములోను, ముందును స్త్రీపురుష విచక్షణలేక క్రిక్కిఱిసియుండిరి.

సుందరి ముందు నిశ్చయముగాఁ జూచెను. భీకరచండికా విగ్రహము - రుధిరపూరితపళ్ళెరములు - కాఱుదున్నశిరము- పురోహితుఁడు ! ప్రక్కన హాతకుఁడు, తనను బట్టుకొనియున్న స్త్రీలు ! వెనుక గోడకట్టినట్లున్న యాటవికులు! ఎటుఁజూచినను మహాయపాయసముద్రము ! దేవికిరెండు ప్రక్కలమండుచున్న దీపములలో పురోహితుఁడు ధూపములు వేయుచుండెను. మృత్యుదేవతయక్కడ వికటనృత్యము చేయుచున్నది.

మంత్రములాగినవి. భయంకర సందిగ్ధసమయము ప్రాప్తించినది. హంతగండ్రగొడ్డలి నెత్తెను. ఒకమోటు చెంచు బలవంతముగ నామెతలవంచి మెడ గొడ్డలిదెబ్బకు వీలుగఁ బెట్టెను. ఇప్పుడా దివ్యసుందరి చావుబ్రతుకుల సరిహద్దులలో నున్నది. అంతయు నిశ్శబ్దము. ఆమె యనుమానముతో భగవంతుని ధ్యానించుచున్నది. అట్టి వాఁడొకఁడున్నాఁడా? గొడ్డలి యింకను మెడమీఁదఁబడలేదా ?

'హంతలారా! కిరాతులారా! ఉడుగుఁడు! విడువుఁడు!' అను ప్రచండరోషవాక్యము లానిశ్శబ్దమును జీల్చివైచెను.

పెద్దపిడుగు మబ్బులు లేకయే పడినది! కారుమేఘారావము వినిన యాడునెమలివలె నాసుందరి యమానుషశక్తితోఁ దన్నుఁ బట్టుకొనినవారినుండి విడివడి - తెల్లపోయి వెనుదిరిగిన మనుజులగుంపు చీల్చుకొని, తనరక్షకుని తెప్పపాటుకాలములోఁ గలిసికొనెను. ఆరక్షకుఁడెవ్వఁడు? మనకుఁ బరిచితుఁడగు సన్యాసియే. ఆతనిప్రక్క శ్యామోజియుండెను. ఆబాలుఁడాసుందరికొక కరవాలమందించెను.

త్రాసుపల్లెములు క్షణములో మాఱెను. అప్పుడచట నిట్టిదని చెప్పరాని దారుణవధ యారంభమాయెను. సన్యాసియు, నభినవ సత్యభామయగు నాసుందరియు, శ్యామోజియు బెబ్బులులవలె నాచెంచులఁజెండఁజొచ్చిరి. వారిలోఁ బెక్కురు నాఁడచట తమదేవతకు బలియయిరి. మిగిలిన కొద్దిమంది పురుషులును, స్త్రీలును నలుదెసలఁ బలాయన మొనర్చిరి. ఆదున్నపగ బాగుగాఁ దీఱినది. పదునైదుగురు చెంచుల

శవము లాగుడిముందు కన్నులు చెదరునట్టి రక్తశయ్యపై వికలాంగములతోఁ బడియుండెను. చండికతృప్తిచెంది మందహాస మొనర్చుచున్నది.

ఆసుందరి యిప్పుడెచ్చటనున్నది? ఆమెమూర్తి శాంతించినది. ప్రతీకారము సంపూర్ణమైనది. ఆమె సన్యాసి కౌఁగిటిలోనున్నది. ఆతఁడనంతముగు ప్రేమతో నాలావణ్యరాశిని లాలించుచుండెను.

'ముక్తా! భగవంతుని ప్రార్థించుచుంటివా? ప్రార్థింపుము. ఆసర్వరక్షకుని యపారకృపాకారణమున నేనువేళకుఁ జేరఁగలిగితిని. లేనిచో - నాప్రాణములీసరికి నీవాని ననుసరించియుండవా?'

ముక్తాంబ మహానందముతోఁ దనరక్షకుని కంఠమును జేతులతోఁ జుట్టెను. ఆతఁడామె నునుజెక్కులఁ బ్రేమతో ముద్దాడెను.

నాలుగవప్రకరణము.

రాయబారి.

మనకథాకాలమునాఁటికి నెల్లూరిమండల మేలుచుండిన మనుమసిద్ధి భూపతి యొకనాఁటి ప్రదోషకాలమునఁ గార్యా

లోచన మందిరమునఁ దనమంత్రియగు తిక్కనసోమయాజి తోడను సేనానియుఁ గుశిభుజమునగు రణతిక్కనతోడను, మఱియొకదృఢకాయుఁడగు బ్రాహ్మణునితోడను నేదోవిషయమై దీర్ఘముగా యోజించుచుండెను రాజు ఉన్నతాసనమునం దనుపవిష్టుఁడైయుండెను. బ్రాహ్మణులుమువ్వురు నాతని కెదురుగఁ దమహోదాలకుఁ దగిన యాసనముల నలంకరించి యుండిరి. విశాలమై, సుందరమై, యమూల్యాలంకార మనోహరమైన యామందిరము నెల్లూరు పురాధీశ్వరుని సంపదనెల్లఁ జాటుచుండెను.

మనుమభూపతి నడివయస్కుఁడు. శరీరము చామనచాయ, సుందరుఁడు. బలిష్ఠుఁడు. క్షాత్రముసూచించుగొప్పమీసములుకలవాఁడు. తిక్కనసోమయాజియు, నితరులిరువురుఁగూడ నడివయస్కులే. ఆతఁడు తనయన్నయగు రణతిక్కనవలెపచ్చనివాఁడు. సమున్నతాకారుఁడు. ఆభూసురుల కెవ్వరికిని మీసములు లేవు. జగద్విఖ్యాతుఁడైన రణతిక్కన - (ఈతనికే ఖడ్గతిక్కనయనియుఁ బేరుకలదు-) వజ్రకాయుఁడు. ఆజానుబాహువు- వీరరసము మానఖనియైన యాతనిముఖమునఁ దాండవమాడుచుండును. అచ్చటనున్న మూఁడవ బాపఁడు అన్నంభట్టనునాతఁడు రాజున కాంతరంగిక మిత్రుఁడు. ధీమంతుఁడు.

తిక్కనసోమయాజి, ఖడ్గతిక్కనకు బినతండ్రికొడుకు. మనుమసిద్ధిభూపుని గడుఁగూర్చుమంత్రి. పదునైదు పర్వములు శ్రీమదాంధ్ర మహాభారతము తెనిఁగించిన యపర

బ్రహ్మయని వేఱచెప్పనక్కఱలేదు. ఈతఁడును సేనాధిపతియైన ఖడ్గతిక్కనయు భూధవునికి రెండుభుజములునయి యుండిరి. మేము వ్రాయుచున్న కాలమునాఁటికి, (అనగా క్రీ. శ. పదుమూఁడవ శతాబ్దమున) బ్రాహ్మణులే నృపులకు మంత్రులుగను, సేనాధిపతులుగను, ఇతరోన్నతోద్యోగస్థులుగను నుండుచు వచ్చిరనుటకుఁ బెక్కుదృష్టాంతములు గలవు.

నాఁటికార్యాలోచనకు హేతువు వివరించుచున్నారము. కనిగిరిసీమలోని యెఱ్ఱగడ్డపాడు రాజైన కాటమరాజు దేశమునఁ గొన్నినెలలక్రిందట గొప్పక్షామము సంభవించెను. ఆకఱవుకాలములోఁ బశువులకుమేఁత దొరకుట మిగులదుర్లభముకాఁగా కాటమరాజు మనుమసిద్ధిరాజునకొక విజ్ఞాపన పంపెను. ఏమన, మనుమరాజుయొక్క దక్షిణపుబీళ్ళుకొన్ని కాటమరాజు పుల్లరికి - అనగా అద్దెకని చెప్పవచ్చును - పుచ్చుకొనునట్లును, తనదేశములో క్షామముతగ్గినపిమ్మట తన పశువులఁదీసికొనిపోయి, పుల్లరిచెల్లించునట్లును రాయబారము నడపెను. సదయహృదయుఁడగు మన్మభూపతిసమ్మతించెను. కాటమరాజు దేశమందలి యాదవులను గొల్లలు పశులమందలఁ దోలుకొని మనుమసిద్ధి దక్షిణపుబీళ్లలో మేపుకొనిరి. కొంతకాలముగడచెను. కాటమరాజుసీమలోఁ గఱవుతగ్గిపోయెను. యాదవులు పశువులఁ దోలుకొని తిరిగి తమదేశము చేరిరి. మనుమరాజు తనపుల్లరికొఱకై మనుజులనంపెను. కాటమరాజు, తనయక్కఱదీఱినపిదప, పుల్లరివిషయమై తగవులఁ బెట్టసాగెను. నెల్లూరునాథుఁడు నేర్పరియగు అన్నంభట్టును

ఖచ్చితముగా పుల్లరి విషయము తేల్చుకొనిరమ్మని రాయబారిగాఁబంపెను. కాటమరాజు పుల్లరియిచ్చుట నిరాకరించెను. అన్నంభట్టు బెదరించెను. కాటమరాజు హుంకరించెను. యుద్ధముతప్పదనియుఁ, బుల్లరి యుద్ధమూలముగఁబుచ్చుకొందుమనియు మనుమసిద్ధివాక్యములుగా రాయబారిచెప్పెను. ధిక్కారముతో కాటమరాజు సమ్మతించెను. అన్నంభట్టు తిరిగి నెల్లూరువచ్చెను.

అన్నంభట్టు పోయినచోట జరిగిన వృత్తాంత పర్యవసానమిట్లు చెప్పెను:— "కాటమరాజు గర్వించియున్నాఁడు ప్రభువుల నగౌరవముగా మాటాడినాఁడు తనకుఁ బెక్కురు తోడువత్తురని కన్నుగానకున్నాఁడు. ప్రస్తుతమాతని ప్రాణస్నేహితుఁడును, పల్లికొండరాజునునగు చల్లపిన్నమనాయఁడు- వాని మంత్రియగు బ్రహ్మారుద్రయ్యయు నెల్లిగడ్డపాడులోనున్నారు. బ్రహ్మారుద్రయ్య ఆరాధ్య బ్రాహ్మణుఁడు. బ్రహ్మారుద్రుల కజేయ్యుఁడని ప్రతీతి. పిన్నమనాయనితోఁ బాటాతఁడును కాటమరాజును యుద్ధమునకు బురికొల్పుచున్నాఁడు. పిన్నమనాయఁడును మహాయోధుఁడు. అయిన స్వామికిని నమ్మిన బంటులకుఁ గొదువలేదు. రణతిక్కన యొక్కఁడువారి తిక్క నడంపఁగలఁడు. అన్యాయమునకు వారు పాల్పడియున్నారు. న్యాయము మన పక్షముననున్నది. మానధనులగు ప్రభువు లవమానము సహింపఁజనదు. వేయిు మాటలేల? యుద్ధము- అక్షరాల- సిద్ధము. ధర్మమే జయము!"

"మమ్మాటికిని సిద్ధము!" అనుచు మనుమభూపతిమహారోషముతో రాయబారి వచనములను ప్రతిధ్వనించెను. "ధర్మమేజయము! న్యాయముగా మనకు రావలసిన పుల్లరి నీయలేని యాబీదకాటమరాజును గరుణించి యుందునుగాని వానితిరస్కార ప్రవర్తన సహింపఁజాలను. యుద్ధము సిద్ధము. ఆచెనఁటిని గాచుకొనుమనుము! సత్యదేవతకు శత్రురక్తముతో నభిషేకమొనర్చి కదనరంగమునఁ బట్టాభిషేకము నెఱపెద. వాని కెందఱు సాయమువచ్చినను మానె భగవంతుఁడు మన బలము మనకుఁ గరుణించియున్నాఁడు. తిక్కనమంత్రీ! మన కాప్తులగు నృపులకు సందేశములు సిద్ధమొనర్చుము. సేనానీ! సైన్యముల నాయత్తముచేయుము. మన కరవాలములపదును అచిర కాలములోఁ బరీక్షింపఁబడఁబోపుచున్నది."

ఖడ్గతిక్కన యుద్రేకముతో లేచి తన ఖడ్గము నృపుని పాదసన్నిధినుంచెను. రోషముతో నాతఁడిట్లు సాహసవాక్యములు బలికెను. "ప్రభువుల సేవయందున్న కరవాలము లెప్పుటికిని గుఱితప్పవు. పదును జెడవు. ఈనాకత్తికి నాజ్ఞయిుఁడు. మీరు శ్రమదీసికొన నక్కఱలేదు ఈ శ్వేతాయుధమును క్షణములో శత్రురుధిరమున రక్తాయుధముఁ జేసెద."

"మేలు మేలు! ఈ క్షణమునుండియుఁ దగు ప్రయత్నము మీఁద నుండుము. పుల్లరి శాత్రవుల కళేబరముల మీఁదుగ నడచి నెల్లూరువచ్చునట్లు చేతుము. తిక్కనమంత్రి! నీయభిప్రాయమేమి? నీతికోవిదుఁడవు- నీకుఁ దెలియనియర్థములేదు. న్యాయమునకుఁ గయ్యమొనర్చుట తగపుకాదా?"

"సందేహమేమి?" అమాత్యశిఖామణి ప్రత్యుత్తరమిచ్చెను. "గర్వాంధకారము కన్నులఁదట్టియున్న కాటమరాజు నెదుర్కొని పరిభవించుట నాసమ్మతము. మనయాప్తనృపకోటికి సందేశములు నేఁడే సిద్ధము చేసెద."

"పరమసంతోషము. మీయట్టి విశ్వాసపాత్రులుండ నాకేమికొదువ? సరి నేఁటికి మీకు సెలవిచ్చియున్నాఁడ. అన్నంభట్టూ! మిత్రమా! నీవు రాయబారి ధర్మము చక్కఁగా నెఱవేర్చి, నీ నృపునికి గౌరవముఁ దెచ్చితివి. మేము నీకుఁ గృతజ్ఞులము. ధర్మరాజాదులకుఁ గృష్ణునివలె నీవు మాకులభించితివి" యని నృపతి రాయబారిని స్తుతించెను.

"ప్రభుకార్య పరాయణులమగు మాకివి విధాయకములు. ఇట్టి కరుణాస్వరూపుఁడగు రాజేంద్రుననుగ్రహించిన పరమేశ్వరునకు మేమెల్లరము కృతజ్ఞులమై యుండవలయు" నని అన్నంభట్టు వచించెను.

"మఱచితిని—" మనుమసిద్ధి యాకస్మికముగ ననెను. "మీలో నెవ్వరికైన నాసన్యాసి మరలఁ గన్పట్టెనా? ఆతని నడత నాఁడు మిక్కిలి చిత్రముగ నుండెను. ఆతనివృత్తాంతము గూఢముగానుండి, తెలిసికొన నాకత్యాభిలాషకలుగుచున్నది ఆతఁడే మాయెనో?"

మువ్వురు నాతనిజాడ తమకుం దెలియ రాలేదని చెప్పిరి. రణతిక్కన సాదరముగ నిట్లనెను. "స్వామీ! నాఁడాతఁడు రాకున్న మనము నేఁడెటనుందుమో! మనల నెఱిఁగినట్లాతఁడు మాటాడెను. ఆప్రచ్ఛన్నవేషధారియెవఁడు? ఏపురవాసి? మనకృతజ్ఞత తెలుపుటకు, నతిథిసత్కారము లిచ్చుటకును వలనులేకుండ, వచ్చినంత చిత్రముగనంతర్ధానమాయెనే!"

"ఆతని జాడలుదీయ యత్నింపుఁడు. ఆతనిస్నేహితుఁడు చెంచుదండుకుఁ జిక్కినట్లు మనకుఁ దెలిసెను. అందుపై నాతఁడతి త్వరితముగ నిష్క్రమించెను. నిజస్నేహితుఁ డాతనిచే రక్షితుఁడయ్యెనో, లేదో? ఆస్నేహితుఁ డెవ్వఁడో? అంతయు గారడిగనున్నది. ఆతని యుదంతము తెలిసికొనవలెనని యుద్రేకముకలిగి బాధించుచున్నది," యని రాజనెను.

తిక్కనమంత్రియు, నన్నంభట్టునుగూడ నాసన్యాసిని జూడఁ దమకోరికలఁ దెలిపిరి. ఆతని జాడలుదీయఁ బ్రయత్నింతుమని చెప్పి యామువ్వురును భూపతియొద్ద సెలవుగైకొని నిష్క్రమించిరి. జరిగిన సంభాషణనుబట్టి మొదటిప్రకరణములో వర్ణింపఁబడిన రౌతులిద్దరును మనుమభూపతియు రణతిక్కనయునని మేము మాచదువరులకు వేఱ వచించుటనపసరము.

అయిదవ ప్రకరణము

ముక్తాంబ

అన్నంభట్టు రాజు సమ్ముఖమునుండి నెల్లూరు రాజవీథిని మెల్లగా నిజగృహమునకుఁ దిరిగి వచ్చుచుండెను.

మొదట నాతఁడు తన రాయబారము, కాటమరాజు ధిక్కారము, పర్యవసానమైన యుద్ధము, తమపక్షమున రాఁగల రాజుల సంఖ్య వీనిని గూర్చి యోజించుచు నప్రయత్నముగ మనుమసిద్ధి కడపటి వాక్యములు జ్ఞప్తికిరా నాసన్యాసి చిత్రప్రవర్తనను గూర్చి పరిపరివిధములఁ దలపోయఁ దొడఁగెను. ఆతఁడెవఁడు? ప్రచ్ఛన్న వేషధారియగు నొకయోధుఁడు కావలెను. ప్రచ్ఛన్నవేషమేల? ఏరు నెఱుఁగని మనుష్యుఁడెట్లగును? పరదేశియైన నెల్లూరిలో నాతనికిఁ బరిచితులెవ్వరు? ఆతని స్నేహితుఁడెవ్వఁడు? యోజించిన కొలందిని వింత మఱింత యెక్కువకాఁ జొచ్చెను.

ఇట్లాతఁడు దీర్ఘాలోచనానిమగ్నుఁడై వీథినరుదెంచుచుండఁగా నెవరో యాతనిభుజములపై వెనుకనుండి తట్టిరి. అన్నంభట్టులికిపడి వెనుదిరిగిచూచెను. తానెవ్వరిని గురించి చింతించుచుండెనో యాసన్యాసియే యటనిలిచియుండెను. అన్నంభట్టమితాశ్చర్యమునొంది యాసంయమిని ఱెప్పవాల్పక గమనించి పోల్చుకొనఁ జాలకపోయెను. బాల్యమునుండియుఁ దాను నెల్లూరిలోఁ బెరిగినవాఁడు. ఆముఖమెప్పుడును జూచినట్లుండలేదు. ఆతని విస్మయమినుమడించెను.

“స్వామీ! మహానుభావులవలెఁ గన్పట్టుచున్నారు. ఇరువురుయోధులను గాచినది మీరేయని వారిచ్చిన వర్ణనను బట్టి గ్రహించుచున్నాను,” అని యాతఁడా సన్యాసిని జాకచక్యముగా హెచ్చరించెను.

“అంతయుఁ బరమాత్మునికృప - ఆక్షణమున మేమట దారసిల్లితిమి. ఆపన్నుల రక్షించుట మాప్రథమకర్తవ్యము,” అని సంయమిమందహాసముతోఁ బ్రత్యుత్తరమిచ్చెను.

‘మీరీపురవాసులుగారు. ఎప్పుడును వచ్చినట్లు లేదు. ప్రథమసమావేశమున నాయోధద్వయము నెట్లు తెలిసికొనఁగలిగితిరి?”

“కీర్తివినియుంటిమి,” యోగిసావకాశముగ నుత్తరువిచ్చెను; “ఖడ్గతిక్కనను దానిచేఁ దెలిసికొని, యాతనిఁబట్టి మనుమసిద్ధిని గనుగొంటిమి - అదియు, నాసాయమును ఘనకార్యములలో గణింపఁబడవలసినవికావు”

“అయ్యో! తమరట్లు సెలవీయఁదగదు అదియట్లుండ మీరు చెంచుదండులనుండి మీస్నేహితుని రక్షింపఁ గలిగితిరో, లేదో, మీరేమైరో తెలిసికొనుటకు మానృపతియు సేనానియు నాత్రపడుచున్నారు. దర్శనమిచ్చి యతిథిసత్కారములఁ గైకొందురని మనవి”

సన్యాసి చిఱునవ్వునవ్వి యిట్లనెను. ‘త్వరలోనే వానిని గైకొను తలంపుగలదు. రాయబారము పొసఁగదయ్యెనేమి? కాటమరాజు పుల్లరినీయనని ప్రత్యుత్తరమిచ్చెనా?’

అన్నంభట్టు మిక్కుటమయిన విస్మయముతో నిట్లనెను. “స్వామీ! మీరుసర్వవేదులు. తమకన్నియు నెఱుక. నేనిప్పుడే రాయబారపు పర్యవసానము మనుమభూపతికెఱిఁగించి వచ్చుచున్నాను. యుద్ధము తప్పదు.”

సన్యాసి క్షణకాలము యోజించి, "మంచిది. మీ నృపునకు నేను పెద్దమేలు చేసినట్లు స్తుతించుచుంటివి. దానికిఁ బ్రత్యుపకారము - మిక్కిలి చిన్నది - నీచేతిలో నున్నది. చేయఁగలిగిన సంతసించెదను," అని యాతనిఁ దదేకదృష్టితోఁ జూడఁ దొడఁగెను.

"మహాత్మా! మీ సేవకుని బ్రార్థింపకుఁడు - ఆజ్ఞాపింపుఁడు," అనుచు అన్నంభట్టు సగౌరవోద్రేకముతోఁ బలికెను.

"అచిరకాలములో దీనికిఁ బ్రత్యుపకారముఁ జేసెదను," అని సన్యాసి గంభీరముగాఁ బలికెను.

"ఇదివఱకుఁ జేసినది సర్వోత్కృష్టమైనది. మీకు వలసిన దేదో సెలవిండు. భృత్యుఁడు సిద్ధముగ నున్నాఁడు."

'ఎఱ్ఱగడ్డపాడులో ప్రస్తుతము చల్ల పిన్నమనాయుఁడు నాతని మంత్రి బ్రహ్మరుద్రయ్యయు నున్నారుగదా?"

"చిత్తము. నే వారిఁ జూచితిని. రాయబారములో సంభాషించితిని," అని అన్నంభట్టు సమాధానమిచ్చెను.

"సరి రమ్ము. కొలఁదికాలము స్వల్పవిషయమై నీతోఁ బ్రసంగింప వలసియున్నది" అనుచు సన్యాసి ముందు నడువసాగెను.

అన్నంభట్టు వింతతో, గౌరవముతో నాతని వెంబడించెను. ఇరువురు రాజపీథిని నడచి కొంతదూరమేగి ప్రక్క బాజారులోనికిఁ దిరిగి కొంతనడచి యొకగృహము ముందర నాగిరి. అప్పటికిఁ గనుచీఁకటి పడుచుండెను. సన్యాసి తలుపు

దట్టెను. శ్యామోజీ దానిని దెఱచెను. ఉభయులును లోని కరిగిరి. బాలుఁడు కవాటము బంధించెను.

చావడిదాఁటి వారు లోనికిఁ జనిరి. అది విశాలముగు గచ్చుఁ జేయఁబడిన చక్కనిగది. దానిలో రెండు తలుపు లెదురుగఁ గన్పట్టుచు నింక రెండు గదు లవ్వలనున్నట్లు తెలుపుచుండెను. ఒకతివాసిపై సన్యాసి అన్నంభట్టు నాసీనుఁ జేసి, తాను ప్రక్కగదిలోని కరిగి కొలఁదికాలముండి తిరిగి వచ్చెను. ఈ చిత్ర చర్య కర్థము దెలియక తనను బిలిచిన కారణము గనుఁగొనఁ జాలక అన్నంభట్టు మూకీభావము వహించి కాఁగల దానికిఁ గాచియుండెను. సన్యాసి వచ్చి యాతని సరస నాసీనుఁడై యిట్లనెను.

"మిత్రమా! నాకుఁ గావలసిన సాయముఁ జెప్పుచున్నాను. ప్రతిలక్షణమును జక్కఁగా జ్ఞప్తికి దెచ్చికొని బ్రహ్మరుద్రయ్యను వర్ణింపుము. ఆతఁడు నాకండ్లకుఁ గట్టినట్లగపడవలెను. తెలిసినదా?"

"చిత్తము"

'వర్ణింపగలవా?"

'కలనని ధైర్యమున్నది వినుఁడు"

సన్యాసి తలయూఁచెను. వింతకోరికకు వింతఁజెందుచు నన్నంభట్టు బ్రహ్మరుద్రయ్యనిట్లు వర్ణింపఁజొచ్చెను. "బ్రహ్మరుద్రయ్య పొడవరి. మిక్కిలి బలిష్ఠుఁడు. సురూపి. సువర్ణచ్ఛాయశరీరము కలవాఁడు. నుదురు మిక్కిలి విశాలము. వక్షస్థలము వెడద. శిరోజము పూర్ణముగా నుంచుకొని

యాదలపైమాత్రము ఖండించుకొను చుండును. చూపులతి గంభీరములు. ఉన్నతాధికార సూచకములు. ముఖమున తొత్రమిల్లుగట్టుకొని నట్లుండును. ఆతఁడారాధ్య బ్రాహ్మణుఁడని వింటిని. ఆతనిగురించి యితరవిశేషములు బాగుగాఁ దెలియవు. వదనమందుమాత్రము తేజస్సునకుఁ దోడుగ నొకవిధమగు విషాదభావము నిత్యము గన్పట్టుచుండును. మీసములుగాని గడ్డముగాని లేదు. కంఠమునందు బంగారపు లింగకాయ మిక్కిలి పెద్దదికలదు.

“అది యెంత పరిమాణము కలది? ఆకృతి యెట్లున్నది? అనిసన్యాసి యాతని కడ్డమువచ్చెను.

“సాధారణపు నిమ్మపండంత పరిమాణము కలది. ఆకృతియు నట్లై గుండ్రముగనుండును. ఒకప్రక్క కొనగలదు. చెప్పమఱచితిని. ఆతనికుడిచెవిప్రక్క చిటికినవ్రేలిపరిమాణము గల గాయపుమచ్చగలదు. సూదరుఁడు. వీరవరేణ్యుఁడు. ఇంత కంటెఁ జెప్పుటకు లేవు.”

“సంతోషము. నీమేలుమఱవను. నీకుశ్రమయిచ్చి నందుకుఁ గష్టముగనున్నను తప్పదాయెను. ఇకనీవు యథేచ్ఛఁ జనవచ్చును”

అన్నంభట్టు లేచి వినయపూర్వకముగఁ దాననుగ్రహింపఁ బడినట్లును, లేశమునుశ్రమ లేదనియుఁ జెప్పి, మఱునాఁడుమనుమ భూపతికి దర్శనమీయవలెనని ప్రార్థించి, యాగృహమువీడి, జరిగిన విషయములనుగూర్చి యోజించుచు, నీవింతసన్యాసి

చిత్రచర్యల కర్థము దెలియక విలవిలలాడుచు నిజగృహోన్ముఖుఁడైపోయెను.

ఆతఁడు నిష్క్రమించిన కొంత సేపటికిఁ బ్రక్కగది తెఱచి కొని ముక్తాంబ మందగమనముతోఁ, నింకను తివాచిపైనాసీనుఁడయియున్న సన్యాసిని మందహాసముతో సమీపించెను. సన్యాసి యామె ముద్దుమోమును సంతోషముతోఁ జూచి తాను కూడఁ జిఱునవ్వునవ్వెను.

“గురూ! మీఋణముముగ్ధురాలగు ముక్త జన్మలోఁదీర్చుఁ కొనలేదు. మరల సేవకురాలినిదయఁ జూచితిరి, “అనియామె మనోహరనీలదృష్టుల నాతనిపైఁ బఱపుచు మధురముగాఁ బలికెను.

“ముక్తా! కూర్చుండుము. నీవుకూడ స్తోత్రపాఠము వినువవా? అన్నంభట్టు వాక్యము లాద్యంతమును వింటివా? నీయభిప్రాయమేమి?”

ముక్తయాతని సరసఁగూర్చుండి చేతినిగ్రహించి వ్రేళ్ళతో నాడుకొనుచు నిట్లుత్తరువిచ్చెను. ‘గుర్వా! మీరువిలువిద్యలో అర్జునుని మించినారు. శబ్దవేదివిద్యమీది పరిపూర్ణము. మీబాణము గుఱితప్పదు. మీయుద్దేశము విఫలము కాదు. మీయోజనలో లోటు కలుగదు’

సన్యాసి విలాసముగానామె చెక్కిలిపైఁ గొట్టుచు నామె వాక్యముల కడ్డమువచ్చెను. “ఎన్నిచెప్పినను ముక్తకు స్తోత్రముపోదు! ఏమి?”

“అది యీముద్దరాలిస్వభావము. ఉదారత యీమెగురువు నైజము”

“చాలు. చాలు. కర్తవ్యము చెప్పుము.”

ముక్త అపారానందముతో సన్యాసివదనమును జూచుచు నిట్లనెను. “స్వామీ! శిష్యురాలనుగ్రహింపఁబడినది. ఇంకను మనకు సందేహమక్కఱలేదు. బ్రహ్మరుద్రయ్య మనమనుకొను నాతఁడే - ముమ్మాటికిని ఆతఁడే!

“ ఎట్లు ”

“ఆవర్ణన - ఆబంగారపు లింగకాయ - ఆచిటికెనవ్రేలంత మచ్చ - ఆలక్షణములు - ఆయన తప్పకనా - ”

సన్యాసి చిఱునవ్వుతో నామె పెదవులపై వ్రేలుంచి “ఆగుము అవ్వల శ్యామోజియున్నాడు. ఇక్కడ గోడలున్నవి. సామెత ప్రకారము వీనికిఁ జెవులున్నవి. ఇంకను బాగుగ ఆయంశము నిర్ధారణకాకముందే- తగిన సమయము రాక పూర్వమే మనము తొందరపడఁజనదు,” అనెను

“ఔను ఔను మఱినన్నెప్పుడా బ్రహ్మరుద్రుని దగ్గఱకు బంపెదరు?”

సన్యాసి కొలఁది కాలము యోజించి “శీఘ్రకాలములోనో వెడలఁగలవు. యుద్ధము సిద్ధమని తెలిసినది. అనివార్యమని తోచుచున్నది. అచిరకాలములో బ్రహ్మరుద్రయ్య యొద్దకు పురుషవేషమున రాయబారము వెళ్లెదవు. తెలిసినదా? శాంతము భూషణము.” అనిపలికెను.

“నిజము. అట్లే ఓపికతోనుందును. మీదండనుండ లోటేది?”

“మరల పొగడ్తయా?” అనుచు సన్యాసి ప్రేమపూర్వకముగా వంగియామె ముద్దుల గడ్డమును ముద్దాడెను.

ఆరవప్రకరణము.

ఖడ్గతిక్కన.

నెల్లూరు రాజవీథిని రాజభవనమునకు దక్షిణమునఁ గొంతదూరములో ఖడ్గతిక్కనయొక్క సుందర విశాల మందిర ముండెను. అది నాలుగంతస్తులది. విచిత్రమైన నగిషీ పనులతోడను. మనోహరములైన వింతవింతరంగు పూఁతలతోడను హృదయాకర్షణ మొనర్చు నాయున్నతమగు కట్టడము పెద్ద యింద్ర ధనువువలెఁ గన్పట్టుచుండును. దాని విపుల ముఖద్వారము దక్షిణమున నుండెను. సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయము దనుక నాద్వారముగుండ బ్రాహ్మణులును యుద్ధభటులును సేవకులును దాసీలును ఉద్యోగస్థులును నటునిటు గుంపులు గుంపులుగ రాకపోకలు సలుపుచునే యుందురు. సేనానాయకుని మందిరమును నచట నిత్యము జరుగు చర్యయు, నాతని సుగుణవిశేషములును మనోహరముగా నిట్లు వర్ణింపఁబడినవి.

సీ॥ 'వీరనికాయంబు వేదనినాదంబుఁ
బాయక యేప్రొద్దు మ్రోయుచుండు
భూసుర ప్రకరంబు సేసలు చల్లంగఁ
బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలు పోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసఁగిన పత్రికల పుత్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు
గీ॥ మాన ఘనుఁడైన తిక్కనమంత్రియింట
మదనసముఁడైన తిక్కనమంత్రియింట
మహితయశుఁడైన తిక్కనమంత్రియింట
మంత్రిమణియైన తిక్కనమంత్రియింట.

తెల్లవారినది. సూర్యోదయమైనది. నాలుగు గడియలుగడచినవి. రణతిక్కన గృహాము ముందు నిలిచిచూడుఁడు. వదనంబున భస్మము ధరించి, బిళ్ళగోచీలు తీర్చిపెట్టి రుద్రాక్షమాలలు ద్రిప్పుచుఁ గొందఱు, పనసజెప్పుచుఁ గొందఱు జందెములు వడఁకుచుఁ గొందఱు, శిష్యుల కుపదేశించుచుఁ గొందఱు, పట్టుబట్టలతోఁ గొందఱు పూలపళ్ళెరములతోఁ గొందఱు. తడివస్త్రములతోఁ గొందఱు బ్రాహ్మణులు భూదేవతలను నామము సార్థకమగునట్లుగ బ్రహ్మతేజస్సు ముఖమునఁబ్రకాశింప నాబాలగోపాలము సందడిగ ముఖద్వారమునుండి రాకపోకలు సలుపుచున్నారు. వీరభటులు కరవాలములుధరించి యటునిటుఁ బచారులొనర్చుచున్నారు. ద్వారపాలకులు ప్రతిమలవలె ప్రక్కలనిలిచియున్నారు. జనములోని కాత్రముగాఁ జనుచున్నారు. వెలికిగుంపులుగావచ్చుచున్నారు. సైనికోద్యోగస్థులు దర్శనముకొఱకై వేచియున్నారు. ఆస్థలమంతయు గజిబిజిగానున్నది.

మందిరములోనికరిగి చూచెదము. మిక్కిలి విశాలమగు నొకచక్కనిచావడియందుఁ బలువురుబ్రాహ్మణులు భగవత్పూజ సలుపుచున్నారు. పుష్పములు భగవంతునిసంపూర్ణముగఁ గప్పివైచినవి, వేదములు మూర్తీభవించినట్లు కూర్చున్న యాభూసురులనడుమ నిజముగాఁ బరమేశ్వరుఁడున్నాఁడు. అవ్యయునిప్రతిమ యచ్చట సజీవమైయున్నది. చతుర్వేదములను స్ఫుటముగ, స్వరయుక్తముగఁ బఠించువారును, తర్పణములు విడుచువారును, మంత్రాక్షతలు జల్లువారును, పూజ నడపువారును, ధ్యాననిమగ్నులైనవారును-ఆప్రదర్శనముఁజూచియే తీరవలెను. ఆవైభవముఁ గనులారఁ దిలకించనివానిజన్మ వ్యర్థము.

రెండుఝాములు కావచ్చినది. పూజముగిసినది. బ్రాహ్మణులులేచి తమతమయిండ్లకుఁజనినారు. ఖడ్గతిక్కన అతిథులతో భోజనమొనర్చి రెండవయంతస్థుపైకిఁజనినాఁడు. అచ్చట నాతనిభార్యయగు చెల్లాంబయాకు మడతలపతికొఱకు సిద్ధముఁజేసి స్వహస్తములతో నాతనికందించుచున్నది. సేనాని యొక రత్నకంబళముపై విశ్రమించియున్నాఁడు. భార్యప్రక్క నిలిచియున్నది. మఱియొకప్రక్క దాసి సుందరతాళవృంతముకొని కంకణములు తాళముగాఁగ మెల్లగా విసరుచున్నది.

తొందరగా నొకదాసి ప్రవేశించి, "స్వామీ! ఒక సన్యాసివచ్చి చావడిలో దేవరవారికొఱకు—" అనిచెప్పఁ జొచ్చెను.

దాసివాక్యము ముగింపకమునుపే ఖడ్గతిక్కన లేచి క్రిందికి వడిగాఁజనెను. మనకు బరిచితుఁడైన యాసన్యాసి చావడిలోనిలిచి భగవంతునివైపు చూచుచుండెను. గృహయజమానివచ్చి యాతనికి దండప్రణామ మాచరించి పైకి విచ్చేయఁ బ్రార్థించెను. ఉభయులును అంతస్థుపైకేగిరి. రత్నకంబళముపై సన్యాసినాసీనుఁ జేసి తిక్కన చెల్లాంబచే జలముఁ దెప్పించెను. సతీపతులిరువురు నాతనిపాదములు కడిగి, నీరు శిరములపైఁ జల్లుకొనిరి. సన్యాసి వారిని దీవించెను. పిమ్మట చెల్లాంబ, భర్తయాజ్ఞప్రకారము, కొన్ని ఫలముల కలధౌత పళ్లెరమునఁ దెచ్చి యా యోగి ముందుంచెను. ఆతఁడందుఁగొన్ని గైకొని భక్షించెను. సిద్ధముగ బంగారు పాత్రమున గోక్షీరముంచిరి. సంయమి వానిని ద్రావెను.

తరువాత భార్యాభర్తలాతని పాదములొత్తఁ దొడఁగ సన్యాసి మహానందము గనుబఱచుచు వారిని మృదువుగ వారించి యాసనములఁ గూర్చుండ నియోగింప, వారొకతివాసిపై నాతనికిఁ గొలఁదిదూరముగ నుపవిష్టులైరి.

యజమాని ప్రసంగమారంభించెను. "స్వామీ! మీరానాఁటిసంజవేళ వింతగా నన్నును నృపతినిరక్షించి మరల నంతలో మీస్నేహితుని రక్షింపనరిగిరి. మీయాప్తునికిఁ

కుశలమేకదా? "అనుచునాతఁడు వినయపూర్వకముగ నతిథి నడిగెను.

"ఆతనికిఁ గుశలమే. మేముసరిగా వేళలో నాయాపన్నునిఁ జేరితిమి. పరమాత్మునిదయచే నాతఁడు రక్షితుఁడయ్యెను".

"ప్రక్కన నృపతియవస్థఁ జూచి నేను మిమ్మనుసరింపఁ జాలక సిగ్గుఁజెందితిని. కాని విధిసంకల్పమట్లుండెను. కృతజ్ఞతఁ దెలుపుటకైన వ్యవధియీక శ్రీహరి మిమ్ము వేఱొక చోటికిఁ బంపెను"

"మీరాజునకు సంపూర్ణారోగ్యము కలిగినదా?"

"చిత్తము. మీదయచే మనుమసిద్ధికి క్షేమము"

సన్యాసి చెల్లాంబను తెప్పవాల్పక కొలఁదికాలముఁ జూచి, "సౌభాగ్యవతీ, నీవుదొడ్డయిల్లాలివి. నీవదనమున ప్రతివ్రతా తేజమున్నది. నిన్నుఁ జూచుట కేవలము పార్వతిని జూచినట్లున్నది" అనెను.

చెల్లాంబ లజ్జచే నవనత శిరస్కకాఁగా, మహానందముతో భర్తయామె సహాయమునకు వచ్చి యిట్లనెను:— మహాత్ములయాదరణచే మాజన్మయు, గృహమును ధన్యమైనవి. పెద్దలదయ మాయందుఁ బూర్ణముగనున్నది.

"నీకు భార్యవైపు చుట్టములెందఱు?"

"నామామగారికి నొక్కపుత్రుఁడును, పుత్రికయు మాత్రమే కలిగిరి. పుత్రిక జ్యేష్ఠురాలు"

“అయిన నీబావమఱఁది కేమిపని?—ఇదేమమ్మా! బాష్పములు గార్చుచున్నావు? నీసోదరుని కేమి?”

తిక్కనయేదో చెప్పవచ్చెనుగాని సన్యాసినేత్రములు మూసికొని దీర్ఘాలోచనా నిమగ్నుఁడై యుంటఁజూచి, యూతని గమనించుచు వింతతో నూరకుండెను. చెల్లాంబ బాష్పములు తుడిచికొని యోగిని గమనింపఁజొచ్చెను.

కొలఁదిసేపటికాతఁడు కన్నులువిచ్చి యామెనుజూచి, “అమ్మా! నీవామహస్తమిటు తెమ్ము. ... ... మంచిది. నీ చింతకుహేతువు దివ్యదృష్టినిజూచినారము. మురారికృపచేఁ దెలిసినది. నీసోదరుఁడు దేశద్రిమ్మరియైనాఁడు. చాలకాలముఁ గడచినది. తిరిగిరాలేదు. జాడతెలియదు. నీకీవిచారమందులకు. ... ఇటుఁజూడుము. ఈశ్వరకృప మీయందుఁ బరిపూర్ణముగ నున్నది. నీతోఁబుట్టువు అచిరకాలములోఁ దిరిగిరాఁగలఁడు. ఎనిమిది సంవత్సరముల కిప్పటికాతని మనసు గృహోన్ముఖమైనది. ఆతఁడు వచ్చుచున్నాఁడు. చింతమాని యుండుము” అనిధైర్యముజెప్పెను.

ఆమె మనసులోని ఖేదమునకుఁ గారణము గనుగొనఁజాలిన యామహాత్ముని మహిమకు సతీపతులానందభక్తిపరవశులై యాతనిచరణములపై నొక్కమారుగ వ్రాలిరి. సన్యాసి నిశ్చలముగా, గంభీరముగా నుచితరీతి వారిని దీవించెను.

ఏడవప్రకరణము.

యుద్ధప్రయత్నములు

పైప్రకరణమునందలిసంగతులు జరిగిననాఁడే సాయంసమయమున రాజభవనమున నొకసుందరమగు మహాలునందు మనుమసిద్ధియు, తిక్కనద్వయమును, అన్నంభట్టును, సన్యాసియు నుచితాసనములపై నాసీనులై సంభాషించుచుండిరి. వారందఱును సంతకుఁబూర్వమే సమావేశమైరి. సేనాని సన్యాసిని రాజాంతఃపురమునకు వెంటఁబెట్టుకొని వచ్చెను. ఆయాపద్బాంధవుని గాంచినంతనే రాజు మహానందమున సత్కరించి, మిక్కిలి గౌరవించెను. కొలఁదికాలము వెనుకటి విషయములఁగూర్చి ప్రసంగమునడచెను. భూపతికి సన్యాసి చరిత్ర తెలిసికొనవలెనని మిక్కిలి కుతూహలముండినను, ఆతఁడు సేనానికిఁజెప్పిన విషయములకంటె మనుమసిద్ధికి నెక్కువ తెలుపలేదు. తిక్కనమంత్రియాయోగి చిత్రచర్యలు బాగుగావినియుంటచే నాతని సాదరముగా వీక్షించుచు, నాతని వాక్యములం దెక్కువ గౌరవము సూచించెను. అచ్చటివారందఱు సన్యాసిని దేవతాపురుషునిగ భావింపఁజొచ్చిరి. వారిసంభాషణ యిప్పుడు యుద్ధవిషయమై జరుగుచున్నది.

తిక్కనమంత్రి యిట్లనుచుండెను. "స్వామియాజ్ఞలననుసరించి మనకు హితులైన నృపులకు సందేశములు సిద్ధమొనర్చితిని ప్రభువ్రాలు పెట్టిన వానిని దగు విశ్వాసపాత్రులగు దూతలచేఁ బంపెదను".

"ఎవ్వరెవ్వరికిఁ బంపఁదలఁచితిమి?" అని మనుమభూపతి యడిగెను.

"సమరతలమున కలంకారభూతుఁడగు తిరునామాల తిప్పరాజునకు మునుముందుగ నంపవలసియున్నది".

"తిప్పరాజు యోధుఁడు. మీస్తోత్రమునకర్హుఁడు."

రెండు, దేవరవారి బాల్యస్నేహితుఁడగు శ్రీకంఠరాజునకు—"

"శ్రీకంఠుఁడు మన సందేశము కన్నులకద్దుకొనును. ఆతఁడును వీరాగ్రేసరుల నగ్రేసరుఁడు."

"తరువాత మనకిదివఱకు సాయముఁజేసిన పెదవేగి చుక్కరాజొకఁడు."

"చుక్కరాజు మన పక్షమున లేనిచోఁ బెద్దలోటు కదా ?"

"సందేహమేమి?—" అమాత్యుఁడు ప్రత్యుత్తరమిచ్చెను; "ఉదయాద్రి ఉమ్మయ్య దేవరవారి బంధువు. అతని విషయమై వేఱ చెప్పనక్కఱలేదు."

"ఔను. ఉమ్మయ్యశూరుఁడు కాకిచే వర్తమానమంపినవచ్చును. నాపంచప్రాణములలో నాతఁడొకఁడు."

"మాదిరాజు, అచ్చిరాజు మన యాప్తకోటిలోఁ బ్రథమగణ్యులు."

"సంశయమేమి! వారి సాహాయ్యము మనకత్యవసరమైయున్నది."

"మిగిలినవారి కింతకుమున్నె స్థితిగతులు తెలియఁజేసితిమి. వారెవ్వరో దేవరవారికిఁ దెలియును.

"ఔను. వారిపేరులు చెప్పనక్కఱలేదు."

రాజునకు మంత్రికి నీసంభాషణ జరుగుచున్నంతసేపును సన్యాసి మందహాసముతో వారిని గమనించుచుండెను. మనుమసిద్ధి యా విషయము కనిపెట్టి సగౌరవముగ నిట్లనెను.

"స్వామి యెందులకో చిరునవ్వు నవ్వుచున్నారు. మహానుభావులకీ కలహములు, పోరాటములు పిల్లచేష్టలుగ—నాటకములుగఁ దోఁచుచుండు ననుకొనెదను."

"కేవలమందులకుఁగాదు—" సంయమి సమాధానమిచ్చెను. "తప్పనిసరి వచ్చినప్పుడుతప్ప భూపతికయ్యమునకుఁ గాలుద్రవ్వరాదు. రక్తవర్షములు కురియు సీమ వృద్ధికిరాదు."

"చిత్తము. కాని, నడచినవృత్తాంతమంతయుఁ దమకువిదితమేకదా? ఇందు నేచేయవలసినదేమున్నది? మొదట మనుజులఁబంపితిని. కాటమరాజు పుల్లరి చెల్లింపలేదు. ఈబ్రాహ్మణో

త్రముని—అన్నంభట్టును—పంపితిని. విరోధి గర్వించినమాటలాడెను. నాలోపమేమి? న్యాయము మనవైపుననున్నది"

"నీవాక్యములు కావనను. నీవుచేయవలసిన దంతయు సక్రమముగాఁ జేసితివి. అనుమానములేదు.

'మఱి తమ యభ్యంతరమేమి?'

'నాకెట్టి యభ్యంతరము. దేశక్షేమముఁ గోరుట మాబోంట్లవిధాయకమైయున్నది.—'

'చిత్తము. అయినమనకుఁ గర్తవ్యమేమి?'

'నా సలహాయందు మీకు గురుత్వము తోఁచినఁ జెప్పెద'.

"తమరు సర్వవేదులు. తమమహిమలు యీనామిత్రులవలన వినినాఁడ. నాయంతటనేనే కనులార స్వవిషయములోఁ గాంచినాఁడ. మీసలహాప్రకారము తప్పక నడచెదము," అని యాదరపూర్వకముగ రాజనెను.

"ఇహలోకవిషయముల విడిచిన మిమ్మిచ్చటమాయుద్ధప్రయత్నములకుఁ బరిచితులుగఁజేయుట, మాకుసలహానొసగి సరియైనదారినిజూపుటకే కదా?" అని సచివుఁడు సగౌరవముగ వచించెను.

"తమరియోజనల ననుసరింప మేము సంసిద్ధులమైయున్నారము. మీకుసందియమువలదు—" అని సేనానాయకుఁ డుద్రేకముతోఁ బలికెను.

"అమూల్యమగు మీసలహా వినుపించి మమ్ముధన్యులఁ జేయుఁడు," అని అన్నంభట్టువినమ్రుఁడై నివేదించెను.

వారివారిసాదరపూర్వక వాక్యములాలకించి, యానందముతో సన్యాసి యిట్లనెను. "మిత్రులారా! నాయెడమీకుఁ గలయనురాగముచే ధన్యుఁడనైతిని. మాధవునికృపమీయందు, నీభృత్యునియందు సంపూర్ణముగనున్నది. మీరు చేయఁగలిగినదంతయుఁ జేసితిరి. పర్యవసానము యుద్ధము తప్పదాయెను. ఇప్పటికైనను కాటమరాజు మీపుల్లరిమీకిచ్చుటకు సమ్మతించిన సన్ధియు సరిగానుండును. మీకు సమ్మతమేకదా?"

"చిత్తము," మనుమసిద్ధిసమాధానముచెప్పెను. 'కాని కాటమరాజు గర్వితుఁడై పలికిన దుర్భాషలకుఁ బ్రతీకారమో?"

"ప్రతీకారము పరమేశ్వరునిది. ఆసర్వాత్మకుఁడది యుక్తసమయములో నెఱవేర్చును. మనుష్యమాత్రునికా గుణము సహజమైనను సమంజసముకాదు—ముఖ్యముగానృపతికి—తనప్రతీకారము కొఱకై నమ్మినబంటులఁ గోల్పోయి దేశక్షోభ మొనరించుట మీవంటి సదయహృదయులకు భావ్యముకాదని తెలియునుగదా? తప్పొనరించుట మనుజుని స్వభావమై యున్నది. నేరముసైరించుట పరమాత్ముని లక్షణముల నొక్కటియై యున్నది. నెమ్మదిగ యోజించి చూడుఁడు."

మనుమసిద్ధి ద్విగుణితమైన భక్తితో “మహాత్మ మేము స్వల్పజ్ఞానమున విభ్రమించుచుందుము. తమ రపారజ్ఞానముచే విషయముల నున్నవాని నున్నట్లుగఁ జూడఁగలరు. తమ వాక్యములెంతయు సత్యములు.” అని వినయముతో సలహా యంగీకరించెను.

“అదియుఁగాక—” సన్యాసి నెమ్మదిగాఁ జెప్పఁజొచ్చెను. “అదియుఁగాక మఱియొక సంగతి గమనింపుఁడు. గర్వముతో రెండు రాయబారములఁ దిరుగఁగొట్టిన కాటమరాజు పుల్లరి నిప్పుడీయ సమ్మతించుట యాతనికిఁదగినంత శిక్షగాదా? కాఁబట్టి మనము దానియెడల వేఱు ప్రతీకారము సైకొనఁజూచుట యనవసరము”.

“సత్యము. మానధనుఁడగు ఱేఁడు అపయశంబునకు సహింపఁడు. ఇప్పుడు కాటమరాజు పుల్లరినిచ్చిన మనకు జంకినాఁడను నపయశమాతనికి రాకమానదు. ఇది యెట్లు పొసఁగునో నాకుఁదోఁచకున్నది.” అని మనుమభూపతి యను మానము గనుబఱచుచు మాట్లాడెను.

“మనము తుదిసారి రాయబారి నంపుదము. కాటమరాజు సమ్మతించిన సరి—లేనిచో—ఉండనేయున్నది”.

“కాని అన్నంభట్టును మరలఁబంపుట పొసఁగదు. ఈతనిమించిన రాయబారి మనకు లభింపఁడు. మీఁదు మిక్కిలి పదే పదే రాయబారములు పంపిన మనకు గౌరవహాని రావచ్చును.”

“నిక్కము. నేనీమాత్రమూహింపనైతినా! ఈమారు రాయబారములో మీకు సంబంధము లేదు. అది నేనుపంపెదను. రాయబారి మీసేవకుల నొకఁడుగాఁడు. కేవలము నాభృత్యుఁడు. మఱియు, రాయబారము సరిగా కాటమరాజునకుఁగాదు. అదియెల్ల నిప్పుడు వివరించి చెప్పఁజాలను. ఒక మాటఁదెల్పఁగలను. పరమేశ్వరు ననుగ్రహమున్న యుద్ధమీ రాయబారమువలననాగి, మీపుల్లరి మీకు సక్రమముగా రావచ్చునని ధైర్యమున్నది”.

ఈవాక్యముల కెల్లరును మహావిస్మయము గనఁబఱచిరి. ఈవింత సన్యాసి యెవ్వఁడు? ఈతని చిత్రచర్యల కర్థమేమి? రాయబారియెవఁడు? కాటమఱేనికిఁగాక రాయబారమెవ్వరికి? పుల్లరి వారీయ సమ్మతింతురా!

సన్యాసి మరలనిట్లు చెప్పఁదొడఁగెను. “మిత్రులారా! అయినను కేవలము నావాక్యములమీఁద నాధారపడి యుద్ధప్రయత్నము లుడుగకుఁడు. ఇదియు కేవల ప్రయత్నమాత్రము. తుదకుఁ బూర్ణముగాఁ దప్పిపోవచ్చును. అయినను నాలుగు దినములాగుఁడు. పిమ్మట వృత్తాంతము మీకుఁదెల్పెదను. బుద్ధిగలిగి కాటమరాజు సమ్మతించిన శుభము. లేనిచో సత్యమే జయము! ముమ్మాటికిని ధర్మమే జయించును”.

“అట్లేయాగెదము. మరల మీరనుజ్ఞ యిచ్చుదనుక మాకు సాయమువచ్చు నృపులకు సందేశములంపము. పెద్దల వాక్యము లవశ్యాచరణీయములు మీరాయబారము ఫలించినమేలు. ఫలింపకున్న పర్యవసానము కాటమరాజ నుభవిం

చుఁగాక. శ్రీపతి న్యాయముఁ బాలించుఁగాక!" అనిము నుమసిద్ధి యుద్రేకముతో దృఢనిశ్చయముతో వచించెను.

"తథాస్తు" అను సన్యాసి గంభీరవాక్యముల కందఱుఁ బ్రతిధ్వనులిచ్చిరి.

ఎనిమిదవ ప్రకరణము

ఎఱ్ఱగడ్డపాడు

రంగ మొకింతకాలము కాటమరాజు ముఖ్యపట్టణమగు ఎఱ్ఱగడ్డపాటికి మార్పవలసి యున్నది. కనిగిరి సీమలో నున్న యీయెఱ్ఱగడ్డపాడు మన కథాకాలమున నాఁటికి సుందరమైన గొప్పపట్టణమై చక్కని వీథులతోడను, విపులభవనములతోడను, ఉద్యానవనములతోడను కాటమరాజు శ్రీసూచకమై రాణించుచుండెను. రాజమందిరము పురమునకుఁ బశ్చిమముననుండెను. దానిచుట్టు రాజాప్తకోటి సంబంధములైన యితర కట్టడములు గలవు.

ఒకనాఁటి ప్రొద్దున, రాజభవనమునందలి యొకమహాలులో కాటమరాజును, నాతని సభ్యులును, నాప్తకోటియు, సాయమునకు వచ్చినరాజులు నుచితాసనము లలంకరించి కర్తవ్యము చర్చించుచుండిరి. ఉన్నతమగు నాసనముపై కాటమరాజు చుక్కలలోఁ జంద్రునివలె సగర్వముగా నాసీనుఁడై, తఱచు తనపెద్దమీసముల మెలివేయుచుండెను. అతని

వామపార్శ్వమున నమాత్యుఁడును, ముఖ్యసభ్యులునుండిరి. కట్టెదుటను, దక్షిణపుచక్కి నాతనికి రణమున సహాయపడ నేగుదెంచిననృపులుండిరి. వీరిలోఁ ముఖ్యులఁ బేర్కొనుచున్నారము.

దీర్ఘకాయుఁడును, గంభీరుఁడునగు పల్నాటిప్రభువు పద్మనాయఁడు కాటమరాజు సరసను పవిష్టుఁడై, తనయరుణనేత్రములతో నెల్లరివదనముల నిర్లక్ష్యముగాఁ దిలకించుచుండెను. ఈతనికెదుటఁ గరియాఁబోతువలెఁ గండలు పెరిగిన యోధుఁడు చల్లపిన్నమనాయఁ డుపవిష్టుఁడైయుండెను. ఈతఁడు పల్లికొండ భూపతి. గొప్పశూరుఁడు. భీమునిబోలు నాకృతికలవాఁడు. సమరభయంకరుఁడు. ఈతనిచెంతనే మంత్రియు, నవక్రపరాక్రమ సంపన్నుండును, క్షాత్రపెన్నిధాన మన నొప్పువాడను నగు బ్రహ్మారుద్రయ్య కూర్చుండెను. ఈతని నన్నంభట్టు తప్పువర్ణించియుండలేదు. ఆతఁడు చెప్పినట్లుగ బ్రహ్మారుద్రయ్య యానాఁడట మూర్తీభవించిన శాంతి వీరరసముఁగో యన నాసీనుఁడై యుండెను.

మిగిలినవారిలో కాటమనృపున కాంతరంగికమిత్రుఁడగు దొనకొండ అయితమరాజు రేచువలె శౌర్యవంత యుఁ దన వామనాకారమునని మిడ్చికొని, తరుణమున కెదురుచూచుచున్నట్లు కూర్చుండియుండెను. తరువాత గండుముఖముతో నాచకూళ్లనాయఁడుగలఁడు. ఈతని శరీరమున యుద్ధమందైన గాయపుమచ్చలురమారమి ముప్పదియున్నట్లు ప్రతీతి. అందులకుఁ దార్కాణముగ వదనముననే నాలుగైదు స్పష్టముగఁ గన్పట్టుచుండెను, నాచకూళ్ళ

నాయఁడారితేరిన యోధులలో నొకఁడై కాటమరాజునక ముఖ్యహితుఁడై యుండెను. మఱియుఁ గదనరంగారణ్యమున నిరాఘాటముగ విహరించి 'తోడేలు' అని బిరుదము వహించిన పుత్తమరాజు సగర్వముగఁ బెదవులు బిగఁబట్టి తనయాసనముపైఁ గూర్చుండెను. పుత్తమరాజు ఘాటికడ్డు లేదు. యుద్ధభూమియందెల్ల చోట్లనాతఁడే తోఁచుచు విష్ణువై పోరుసల్పఁగల సమర్థుఁడు. ఈతని పరాక్రమము వర్ణించినఁదీఱదు.

కాటమరాజు మిత్రులలో వీరు ప్రథమగణ్యులైనను, నించుమించుగ వీరికిఁ దుల్యులగు ఎఱ్ఱయ్యను, భట్టావుల రాజును, వల్లభన్నను, సిడిపోతని బిరుదొందిన కరియావుల రాజును, నేతి ముద్దయ్యనాయని, ముమ్మయ్య నాయని, పాచయ్యనాయనిఁ, ధీరులగు తదితరుల మఱికొందఱిని గ్రంథవిస్తరభీతిచే మేము ప్రత్యేకముగ వర్ణింపఁ దలఁచుకొనలేదు.

కాటమరాజు యుద్ధప్రయత్నము లించుమించుగా సంపూర్ణమైనవి. ఆతఁడు సందేశములంపిన దేశాధిపతులందఱు నాతనికిఁదోడుగవచ్చిరి. స్వల్పవిషయమై పెద్దయుద్ధమగునట్లుండెను. సేనలువచ్చి యెఱ్ఱగడ్డపాడు చుట్టును విడిసియున్నవి. ఒక రాజుగాఁడు, ఒక సేనానాయకుఁడుగాఁడు. ఇంతమందిలోని సేనాసమూహములనెల్ల నడపువాని నొకని నిర్ణయింపవలసియుండెను. ఆతఁడు మిక్కిలి సమర్థియై, మిగులనేర్పరియై, యుండవలెను. ఆసర్వసేనానాయకత్వము గొప్పపదవి. ఒకరి

కొసఁగిన నింకొకరి కసూయజనింపవచ్చును. సందిగ్ధసమయము వచ్చినది. ఇప్పుడంతః కలహములు జరుగునట్లున్నది. దాని విషయమై యిప్పుడు వారందఱు సభచేరి చర్చించుచున్నారు. కాటమరాజిట్లనెను.

"ప్రాణమిత్రులారా! నాయెడ మీరుచూపిన సౌభ్రాత్రతకు నేనాజన్మాంతము కృతజ్ఞుఁడ. నాప్రార్థనల మీరు మన్నించి, సేనలఁదోడ్కొని యరుదెంచుట మీమీ యుదారస్వభావములఁజాటుచున్నది. ఇప్పుడెఱ్ఱగడ్డపాటిలో రమారమి నలువదివేల సైన్యమున్నది. దీనికెల్ల నొక్క సేనానియుంట సమంజసము. ఎల్లవిధములఁ బాత్రుఁడైన యాతని మనమేర్పాటు చేయుదము. మిగిలిన వారసూయఁజెందఁజనదు. అట్లు జుగుప్సనొందువారీ నామిత్రులలో లేరని నాకు దృఢవిశ్వాసము గలదు. మొగమోటములకుఁబోక సామర్థ్యము, కౌశల్యము, అనుభవము, శూరత్వము విచారించి యాపదవికిఁదగిన వాని నిర్ణయింపయత్నించెదము. మీరు మీకుఁదోఁచిన భంగిసలహాలు చెప్పుఁడు. ఆనందమునఁ జర్చింతుము."

కంఠము సవరించుకొని దొనకొండ అయితమరాజు లేచి యిట్లనెను. "మిత్రులారా! మనమెల్లరముఁ గొద్దియో గొప్పయో శూరులమనుట నిర్వివాదాంశము. కాని మనస్నేహితుఁడు చెప్పినట్లు అన్నిగుణములును విచారించినఁ జల్లపిన్నమనాయఁడెల్లవిధముల సర్వసేనాధిపత్యమున కర్హుఁడని నాయభిప్రాయము మీమీ విపులహృదయములలో యోజించి యంతకంటెఁ బాత్రుఁడు దొరకునేమో చూడుఁడు."

మందహాసముతో పిన్నమనాయఁడు లేచి యిట్లుపలికెను. "నాయందు అయితమరాజేంద్రుఁడు చూపిన గౌరవమున కాతనికి ఋణస్థుఁడను. కాని మన్మిత్రుఁడు పల్నాటి పద్మనాయని బారపాటున నేమఱినాఁడని తోఁచుచున్నది. ఈ కార్యనిర్వాహమునకు పద్మనాయ సోదరుఁడు సర్వోత్తముఁడు."

గొప్ప పటాటోపముతో పద్మనాయఁ డన్నిదెసలఁ జూచుచు మెల్లగనిలువఁబడి యిట్లు సమాధానమిచ్చెను. "ఆత్మస్తుతితగదు. కనుక పిన్నమనాయ సోదరుఁడిట్లు పలికినాఁడు. నిజమున కాతఁడు మహాయోధుఁడనియు, నీయవసరమునకు మనలో నాతని మించినవాఁడు లేఁడనియు నానమ్మకము—మఱియు యుద్ధచిహ్నములు పెక్కులు మచ్చలరూపకముగ నిత్యము వహించుచుఁ బేరొందిన నాచకూళ్ల నాయని మనము గణింపవలసియున్నది."

నమ్రతతో నాచకూళ్ల నాయఁడాసనమువిడిచి సభవారి నిట్లు హెచ్చరించెను. "సమర్థులగు మీరెల్లరు నితరులఁ బేర్కొనుచు మీమీ సద్గుణములఁ జాటుచున్నారు. యోధాను యోధులరగు మీముందు నాచకూళ్లనాయఁడొక గణనలోని వాఁడుకాఁడు 'రణవృకంబు' (యుద్ధపుతోడేలు) అను మహాబిరుదయుతుండగు పుత్తమరాజు మీస్మరణలో లేకపోవుట వింతగానున్నది. క్షాత్రనిధానమగు పుత్తమరాజు శౌర్యమువిచారించుఁడు."

సమాధానముచెప్పుటకై పుత్తమఱేఁడు సగర్వముగ లేచెను. 'స్నేహితులారా! మీమన్నన కనర్హుఁడనని చెప్పకొననక్కఱలేదు. అయినను నాయెడల మీరుచూపిన మహాగౌరవమునకు నేను మీమేలుమఱవఁజాలను. మన మొకరినొకర మగ్గించుకొనుచున్నారమే కాని పర్యవసానము సులభసాధ్యముగాఁ జేసికొనుటలేదు. పెద్దలున్యాయముగా యోజించి విషయముచక్కఁగాఁ దెల్పుడు. మీయోజనలకు మేమెల్లరము బద్ధులమయియుందుము'

తరువాత నొకగడియ కెక్కువగ నచటఁ జర్చజరిగెను. వీరినివారు—వారిని వీరుసమర్థులుగ మరలమరలఁ బేర్కొనుచుఁ గాలముగడపిరి. తుదకేకగ్రీవముగ నందఱు కాటమరాజును దనయిచ్చవచ్చినవాని నొకనిఁ బేర్కొను మనియు, నాతని తీర్పున కందఱును బద్ధులైయుండునట్లును వచించి, యాత్రముగాఁగోరిరి. దానిపై, నిశ్శబ్దముగానున్న సభికుల మధ్య నెఱ్ఱగడ్డపాటి నృపతిలేచి చిఱునవ్వుతో నిట్లాసభను సంబోధించెను.

'శూరులారా! యోధులారా! మీరాకలచే నొకమారును— మరలనిప్పుడు మీయుదారబుద్ధిచే నన్ను నిర్ణేతగ నేర్పఱచుటచేతను—మీయుదారత నప్రయత్నముగఁ దెలిపికొని యమితస్తోత్రమున కర్హులై, మనవంశముల కలంకారభూతులగుచున్నారు. పరమేశ్వరుని నానాఁకయుం దుండఁ బ్రార్థించినాకుఁదోఁచినది వినయపూర్వకముగాఁ దెల్పుచున్నాను. మన పగతుఁడగు మనుమసిద్ధిసేనల బ్రాహ్మణుఁడగు ఖడ్గతిక్కన నడిపించుట నిశ్చయము. బ్రాహ్మ

ణేతరులమగు మన మాతనికిఁ బ్రతిగ సేనాధిపత్యము వహించి పోరుట సమవు జోడుగనుండమియేకాక ప్రమాదవశమున మనము ఖడ్గతిక్కనను వధించితిమేని బ్రహ్మహత్యాదోషము మనకు సంప్రాప్తమగును. ఈవిషయమై బ్రాహ్మణభక్తిపరులగు మీకు వేఱజెప్పనక్కఱలేదు. కాఁబట్టి కర్తవ్యమేమి? మనలో ఖడ్గతిక్కన కుద్దీయైన బ్రాహ్మణయోధుని వెదుకవలసియున్నది. వెదుకవలెనా? మిక్కిలి యనవసరము. మహాయోధుఁడగు బ్రహ్మరుద్రయ్యను గుఱించి విస్తారము చెప్పుటగాని, పొగడుటగాని కాలహరణమగు. బ్రహ్మరుద్రయ్య ఖడ్గతిక్కనను మించినచేయి—విఖ్యాతయశుఁడు. ఆతఁడు సర్వసేనాధిపత్యము వహించుట మనశ్రేయస్సునకు మూలమని నాదృఢాభిప్రాయము. మీఁదసభవారిచిత్తము!”

కాటమరాజు నిజాసనమలంకరించెను. ఆతనివాక్యములెంతయు సత్యములైయుండెను. నాఁడటఁజేరిన వారిలో బ్రహ్మరుద్రునిమించిన నేర్పరి, యనుభవశాలి, సమర్థుఁడు, శూరుఁడు లేఁడు. అయినను బ్రహ్మరుద్రయ్య జరుగుచున్న చర్చ సావకాశముగ గమనించుచు నివురుగప్పిన నిప్పువలెఁ గూర్చుండి మిన్నకుండెను. కాటమరాజాతనిఁ బేర్కొన్నంతనే సభ్యులెల్లరు నిష్పక్షపాతబుద్ధితో నేకకంఠముగ “బ్రహ్మరుద్రులసాటి బ్రహ్మరుద్రుఁడే సర్వసేనాధిపతి! ఆతఁడే మాయిష్టుఁడు! మఱియొకఁడాపదవికిఁ దగఁడు!” అనుచు నానందమునఁ గేకలు వేయఁజొచ్చిరి.

బ్రహ్మరుద్రుఁడు లేచి వారిని మృదువుగ వారించి సిజా

సర్వాత తెలిపికొనఁ జూచెను. సత్పురుషులగు వారాతని మాటలఁ బెడచెవినిబెట్టిరి. కాటమరాజు పూలహారముదెచ్చి యాభీష్మనిభుని కంఠముననుంచి సర్వసేనా నాయకత్వమందఱిలో నొసఁగెను. జయజయశబ్దములతో—మహానందసూచక సభాసదులకరతాళధ్వనులతో సభశుభప్రదముగ ముగిసెను.

తొమ్మిదవ ప్రకరణము.

బ్రహ్మరుద్రుఁడు.

బ్రహ్మరుద్రయ్య రాజమందిరమును విడిచి మెల్లగాఁ దనబసకేగుచు దీర్ఘాలోచనా నిమగ్నుఁడై నడువఁజొచ్చెను. తలవని తలంపుగాఁ దనకు సర్వసేనానాయకత్వ మొసఁగిరి. తానాకార్యమునకుఁ దగఁడా? అది వేఱుమాట. తగునోతగఁడో పరమేశ్వరుని కెఱుక. కాని యందఱుయోధులగు రాజులుండఁ దనకు వారీపదవి నిష్పక్షపాతముగా నిత్తురని యాతఁడు స్వప్నముననైనఁ దలఁపక సభలోమిన్నకుండెను. మృగములు, మూకీభావము వహించి శాంతముగాఁ గూర్చుండియున్న యేనుఁగును రాజుగాఁగోరుకొని నట్లాయెను. మంచిది. తానీక్షణమునుండియు సర్వసేనాధిపతి విధులఁదీర్పవలసి

యున్నది. ఎదుట సేనానియు సామాన్యుఁడుగాఁడు. త్రిలోక విఖ్యాతయశుఁడగు ఖడ్గతిక్కన! తానాతనితో ముఖాముఖిఁ బోరదరుణము సంప్రాప్తమైనది! సంతసింపఁదగిన సమయము !

బ్రహ్మరుద్రయ్య యిట్లాలోచించుచుఁదనవిడిది చేరెను. అచటనొకభటుఁ డాతనిఁగని కేలుమోడ్చి నమ్రుఁడై యిట్లు విన్నవించెను, "స్వామీ! మీకొఱకై యొకయౌవనుఁడు వచ్చి రెండుగడియలసేపటినుండియు వేచియున్నాఁడు"

"తరుణుఁడా! నాకొఱకా!" అనుచు బ్రహ్మరుద్రయ్య విస్మయము సూచించుచుఁబలికెను.

"చిత్తము. చావడిలోనున్నాఁడు"

వింతతో సేనానియాచావడిలోని కరిగెను. అచట నొకవయోవంతుఁడొక యాసనముపైఁ గూర్చుండి యుండి బ్రహ్మరుద్రయ్యనుగాంచి చప్పుననిలువఁబడి నమస్కృతి వినయపూర్వకముగఁ జేసెను. సేనానాయకుని విస్మయ మా బాలునిజూచుటతోడనే హెచ్చెను. తానాతని నెప్పుడుఁ జూచియుండలేదు. ఆతఁడెవ్వఁడు! బ్రహ్మరుద్రుఁడా సుందరుని యాకృతి శ్రద్ధతో గమనించెను. ఆయౌవనునికిరువది యేండ్లలోపు వయసని పాలుగారెడిమోమున మీసకట్టయి నను రామి సులువుగా గ్రహింపనగును. తుమ్మెదఱెక్కలవంటి నల్లని నిగనిగలాడు కురులుగలవాఁడు. శిరముపై పాగసుందరముగఁ జుట్టి, వదులుగనున్న పట్టుఅంగరకాధరించి, విలువగల వసనమొయ్యారముగఁ గట్టి యాతరుణుఁడు లావణ్యము మూర్తీభవించినట్లుండెను. సేనాని యాతని ఱెప్పవాల్పక

చూచి, చూచి, యాతనియందాదరముగలుగ, "నాయనా! నాతో నీకేమిపని?" అని మృదువుగ, ప్రేమతో నడిగెను.

"ఏకాంతమున మనవిచేసికొనియెద," అని యౌవనుఁడు సుధామధురస్వరముతో సమాధానమిచ్చెను.

"మంచిది! మేడపైకిరమ్ము" అనుచు సేనానియాశ్చర్యముతోఁ బైకిదారితీసెను. తరుణుఁడాతని ననుసరించెను. మేడమీద నొకచక్కని గదియందు వారు ప్రవేశించిరి. బ్రహ్మరుద్రుఁడొక పీఠముపై నధివసించి యాగంతుకునికొక యాసనముఁజూపెను.

"ఇప్పుడు నీపనిఁజెప్పెదవా?"

"చిత్తము. తమరు పెద్దలు. నేను బాలుఁడను. మిమ్ము కన్నజనకునిగా భావించి స్వతంత్రముగా నొకవేళ మాటాడిన క్షమించుఁడు," అని యౌవనుఁడనెను.

"మంచిది. కుమారా! సందేహించక నీస్వంతజనకునిగ నెంచుకొనియె స్వేచ్ఛగాఁ బ్రసంగింపుము. నీరాకకు హేతువేమి?"

"మహాత్మా! నేనొకకార్యార్థినై వచ్చియున్నాను. నాకొక సంశయముగలిగినది! అది ప్రస్తుతము జరుగనున్న యుద్ధవిషయమై— "

"చిత్రముగానున్నది. ఆగితివేల?"

"ఈరణమునకుఁ గారణము మీకెంతయు విదితము. జగమునకెల్ల విశదము. కాటమప్రభువు మనుమసిద్ధిరాజు

నకు న్యాయముగా రావలసిన పుల్లరి చెల్లింపకపోవుటయే దీనికి మూలము—కాదా?"

"అవుననుకొనుము. అయిన?"

"నాసంశయమేమన న్యాయముగాపుల్లరి చెల్లింపక, మీఁదుమిక్కిలి తనకేదో యపకారము జరిగినట్లు కాటమ రాజు యుద్ధప్రయత్నముఁజేయనేల? దానిచే దేశమునకు సంభవింపఁగల క్షోభ యోజింపఁడా?"

ప్రవర్ధమానమగుచున్న వాత్సల్యముతో బ్రహ్మరుద్రుఁడు నవ్వుచు నాతరుణునితో నిట్లనెను. "ఆరితేరిన రాయబారివలె వాదించుచున్నావు. ఇది రాజరహస్యవిషయిక ప్రసంగము. నీవెవరో పూర్ణముగాఁ దెలియువఱకు నేను తగు ప్రత్యుత్తరము నీయఁజాలను."

"చిత్తము. ఉభయదేశ కుశలాభిలాషియగు నొక సన్యాసి కూర్మిశిష్యునిగా నన్నెఱుఁగుఁడు. మాగురువిప్పుడు నెల్లూరిలోనున్నాఁడు. నిష్కారణ యుద్ధమునకు - రక్తప్రవాహములకు నిష్టములేక వారునన్ను మీకడకు రహస్య దూతగాఁ బంపించినారు—"

"నాకడకేల?"

"మొదటికారణము. కాటమరాఁడు తన బాల్యస్నేహితుఁడగు పిన్నమనాయని మాట జవదాఁటఁడు. పిన్నమనాయఁడు తనగుండెయగు బ్రహ్మరుద్రమంత్రిమాట త్రోసిపుచ్చఁడు. కావున యుద్ధమాపఁగల చాకచక్యము తమలో నిశ్చయముగానున్నదని నమ్మకము."

"రెండవహేతువు?"

"మొదటిదానిమీఁద నాధారపడియున్నది. కాటమ భూపతి, పిన్నమనాయని మూలముగ మీచేత నుండును. ఉద్రేక స్వభావులగు క్షత్రియులు యుక్తాయుక్తముల, న్యాయాన్యాయముల విచారింపరు. బ్రాహ్మణులగు మీరు నిష్పక్షపాతముగా యోజింపుఁడు. యోజించి యిప్పటికయిన మీబుద్ధికిఁదోఁచినట్లు కావింపుఁడు"

"ఔరా! ఎంతతీయగా సంభాషించెదవు బాలకా! ఇంతవాక్చాతుర్య మీయీడున కేయెట నేర్చికొంటివి?"

"పొగడ్తకు సేవకుఁడనర్హుఁడని మనవి. నాప్రార్థన శాంతముగా యోజింపుఁడు-నెత్తుటిచే భూభారము కలిగింపకుఁడు"

"సందేశహరా! వినుము. నీచెప్పినదంతయు నిక్కమని యంగీకరించితిని. ఇదివఱకయిన నీవేడుకోలువినియుందును. ఇప్పుడుకార్యము మించినది"

'స్వామి యభిప్రాయమేమి? న్యాయము మాపట్టున లేదా?'

'నిర్వివాదాంశము. అయినను చేదాటినదని తెలిసికొనుము. కాటమరాజు తనకు సాయముగ నెందఱినో రప్పించినాఁడు. పలువురురాజులు వచ్చియున్నారు. వారు యుద్ధాభిలాషులై చనుదెంచినారు. ఇప్పుడు కాటమరాజు వారిని బొమ్మనలేఁడు. పొమ్మనరాదు.'

'ఇంతమాత్రమేనా?'

'యుద్ధప్రయత్నములెల్ల జరిగినవి. సర్వసేనానాయకునొకని నేర్పఱచినారు'

'మీకంటె సమర్థుని గనిపట్టఁగలిగిరా?'

'నీవు కుశాగ్రబుద్ధివి. దైవసంకల్ప మట్లున్నది. నన్నే యాపదవిని నిల్పిరి. చెప్పిన వినరైరి'

యావనుని నేత్రములు గౌరవానందములతోఁ బ్రకాశించెను. 'స్వామీ! సర్వసేనాధిపత్యము మీకుఁదక్క నితరులకు రాణించదని భగవంతునికిఁ దెలియదా? కానినిక్కముగా సమయముదాఁటినదా? నా రాయభారము వ్యర్థమేనా? రుధిరము వర్షించియే తీరవలెనా? సకలచమూనాథా! న్యాయము నెంచి, భగవంతునికి భయపడి, మీశక్తి నెల్లవినియోగించి యుద్ధముమాన్పరా?'

'కుమారా! మాన్పఁజాలను-చాలను. నీవాదమునిష్ప్రయోజనము. సంగతులు దూరము నడచినవి - వెనుకంజ దుర్ఘటము. ప్రాణాపాయకరము. కాన నాలోచనానర్హము!'

'తండ్రీ! న్యాయమునకుఁగూడు లేదా? మీశాంతహృదయమునకును యుద్ధమే సమంజసమని తోఁచెనా?'

'నాయనా! నీవాగ్ధాటి ప్రబలశక్తిమంతము. కాని-కాని నేనొకనృపునిమంత్రిని-ఆతనియడుగులలో నడవవలసినవాఁడను. పిన్నమనాయనికి యుద్ధమిష్టమైనది. తత్క్షణమే బ్రహ్మరుద్రునికి నిష్టమైనది'

'—ఒకమనవి. మీకుఁదెలియని యంశములుండవు.

పిన్నమనాయని మొదటనే మీరు సదుద్దేశముతో వారించియుండవచ్చును. ఇప్పుడయిన మీకుమించినది లేదు. మీరు సమరము మాన్పవచ్చును'

'కుమారా. ఎవరికొఱకంత గట్టిపట్టు పట్టుమనెదవు?"

'భగవంతునికొఱకు"

'నేను తగను'

'అమూల్యమును బ్రాహ్మణ ధర్మము నగు న్యాయముకొఱకు"

"అన్యాయ పాపము రాజులది. భృత్యులనంటదు"

"అయిన—అయిన—" బాలకుఁడుతడఁబడుచు పాగయు, నంగరకాయు విడుచుచుఁ జెప్పఁజొచ్చెను. 'అయిననొకప్పుడు మీరు ప్రాణముకంటె నెక్కుడుగఁ బ్రేమించి-సర్వస్వముగ నెంచికొని మన్నించిన ముద్దులకొమరితయగు-ము-క్తాం-బ- ముక్తకొఱకు!"

ప్రచండనిర్ఘాతము! ఆకస్మికముగా భూమివిచ్చి పాతాళము వఱకు గహ్వరమేర్పడి నట్లయ్యెను. ఎనిమిదేండ్ల క్రిందటఁ దానుపోగొట్టుకొనిన మణి-ముక్తాంబ- తన కన్నకూఁతురిప్పుడు తనయెదుట నిలిచియున్నది. బ్రహ్మరుద్రుఁడు తెల్లపోయి- యాజవ్వనిని దేటిపాఱఁజూచి, మరలఁజూచి మరలఁజూచి, ముఖమున నొక్కమారుగ వింతకళ ప్రజ్వలింప నపారానందమునఁ దటాలున లేచి కుమార్తెను గాఢాలింగన మొనర్చి తిరిగి తిరిగి యామె ముఖమంతయు ముద్దులచే నింపెను.

పదవ ప్రకరణము

తండ్రి—కూఁతురు.

జనకుఁడును పుత్రికయు నిప్పుడు సరస సరస నొక మెత్తపై నాసీనులై యున్నారు. ముక్త తండ్రిభుజముపైఁ జేయి వైచి యాతని ముఖమువంకఁ దనవిశాలహరిణ నేత్రములతోఁ జూచుచున్నది. ఆతఁడామె సన్నని నడుమును దనచేతితో సగముచుట్టి యాస్పర్శచే నపూర్వానందము నొందుచున్నాఁడు. కన్నకూఁతు మోమును నెంతచూచినను దనివిచెంద లేకున్నాఁడు. ఎనిమిదేండ్ల క్రిందటఁ దనకు కుమార్తెకు నెడబాటు కలిగెను. అప్పటినుండియు నాతఁడు మందహాస మొనర్చిన జాడ లేదు. ఒక్కగడియయైన నిజమైన సుఖమనుభవింపలేదు. లోకములోఁ దనకున్న దెల్ల నొక్క పుత్రికయే! ఆమె నాతఁడెంత ప్రేమతోఁ బెంచుకొనుచుండెనో వర్ణనాతీతము. ఆపుత్రిక నాతఁడు దైవఘటనచేఁ బోఁగొట్టుకొనెను. ఆమెను గూర్చి యాశలన్నియు వదలికొనెను. మరణించినదని నమ్మియుండెను. ఇప్పుడు? - అగ్నిపర్వతమునఁ గొంత కాలము పేరుకొని, పేరుకొని, పేరుకొని యొక్కమారుగ నుబికి పొంగి, పొరలి వఱదలై ప్రచండవేగమునితోఁ దన జన్మస్థానమగు కొండను ముంచివైచు శిలాప్రవాహమువలె బ్రహ్మరుద్రుని యనురాగ మాతని సొక్కించి

వివశు నొనర్చెను. గతించిన ప్రాణములు మరలవచ్చినట్లాయెను. ఆతని జీవితములోని కెల్ల నిది సర్వోత్కృష్టానందమనుభవించిన సమయము.

“ముక్తా! ఆహా! ఎన్నినాళ్ళకు మరల నాబిడ్డను సంబోధింపఁ గలిగితిని! పరమేశ్వరుని కీదీనునిపై నేఁటికి దయ గలిగినదా? ముక్తా! బిడ్డా! నీవృత్తాంతము చెప్పుము. సరిగా నీవేళ నిచ్చటి కెట్లు వచ్చితివి. తల్లీ! ఇన్ని సంవత్సరముల నుండి నీ సంగతియేమి? సన్న్యాసికి శిష్యురాలనంటివి. ఆసన్న్యాసియెవ్వఁడు - ముందు చెప్పుము - ముందు చెప్పుము! నేను విన్నవఱకు నాకేమియుఁ దోఁచదు. చెప్పుము” అనుచు నాతఁడు కొమరిత నుద్రేకముతో నడిగెను.

ముక్త యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. ‘తండ్రీ! ఈశ్వరుఁడీ యబలను నేఁటికనుగ్రహించినాఁడు. ముక్తకున్న యొక్క కొఱఁతయుఁ దీఱినది. నాచరిత్ర దెల్పెదను. కాని కొన్ని కొన్ని కారణములచేతఁ గొన్ని పేరులు- కొంత విషయము చెప్పఁజాలను. దానికి నీవు క్షమింపవలయును. ఇట్లు చిరకాలమునకు లభించిన నాకన్నతండ్రి చెంతఁ గూడఁ గొన్ని యంశములు దాచుటకుఁ గేవలము నేబాధ్యురాలనుగాను. ఇది నా భర్తయాజ్ఞయని తెలిసికొనుము.”

“నీభర్తయా?” అనుచు మహాశ్చర్యముతోఁ దండ్రి సగము లేచెను. కాని మరలఁ దెలివి తెచ్చుకొని యాతఁడు శాంతుఁడై యిట్లనెను. “తల్లీ ఈ యెనిమిదేండ్లలో నీజీవితమెన్ని మార్పులు జరిగినదో? వెనుకటి బాలికవలెనే నిన్నిప్పుడెంచ

వీలులేదు. అయిన ముందుగ నీవువచింపఁదలఁచి కొనినంతఁ దెల్పుము. తరువాత నా యనుమానములకు వ్యవధిగలదు."

"ఇంకొక సంగతి. నాకథ సవిస్తరముగాఁ బ్రస్తుతము తెలుపఁజాలను. క్లుప్తముగాఁ గొంతచెప్పెదను. నిలుచుటకుఁ గూడ నాకు వ్యవధిలేదు. నాభర్త యెఱ్ఱగడ్డపాదున కనతి దూరమున నా కొఱకు తీవ్రముగా వేచియున్నాఁడు"

"నీ రాకకంటె నీవాక్యములు చిత్రముగా నున్నవమ్మా! అయిన నీకుదోచినట్లు క్లుప్తముగనే నీ చరిత్రఁ దెల్పుము.'

"అయిన వినుఁడు. ఎనిమిదేండ్ల క్రిందట - నాపదియవ యేట - మనమిర్వురమును కంచర్లలో నొకపెంకుటింట వసించుచుంటిమి. ఆకస్మికముగా నొక నాఁటిరాత్రి కొందఱు లంబాడిదొంగలు నన్ను నీకుఁదెలియకుండ, నపహరించుకొని పోయిరి. నీవు మఱునాఁడు నాగతి- జాడ లేశమును దెలియక మిక్కిలి వాపోయియుందువు'

'నాయరణ్యరోదనము సర్వేశ్వరుని కెఱుక!'

'లంబాడీలు నాలుగైదు నెలలపాటు నన్నూరూరుత్రిప్పిరి'

"నీవెప్పు డెవ్వరితోడను నీసంగతి చెప్పుకొనలేదా?'

'వారునన్ను వెలుపలికి మెదలనీయలేదు. నోరెత్తనీయలేదు. మీఁదుమిక్కిలి మాటాడిన- అఱచిన నన్ను నోరు కాలుసేతులు బంధింతుమని బెదరింపుచుండిరి. కాగలదానికి సంసిద్ధురాలినై- దుఃఖమంతయు దిగమ్రింగికొనుచు - నేను మనస్థైర్యము చిక్కఁబట్టి మిన్నకుంటిని.'

'కన్నతల్లీ! బాల్యమునుండియు మనోధైర్యము నీ నగలలో నొకటిసుమీ?'

'కొన్నియాళ్ళిట్లుతిరిగిన తరువాత నా లంబాడిదండు తాత్కాలికముగఁ గొన్నిపాకలు నిర్మించి యొక యడవిలో విడిసెను. అచ్చట ఆరునెలలు మేము గడపితిమి. దినములు గడచిన కొలఁదిని నా నిరాశవృద్ధినై- తుద కాకస్మికముగ నన్ను మ్రింగునట్లుతోఁచెను. కాని లంబాడీలు నన్నేమరకుండిరి. స్వేచ్ఛగా నన్ను పర్ణశాలలమధ్యఁ దిరుగనిచ్చిరి కాని యవిదాటి పోవలను లేకుండెను. ఎట్లో క్షణమొక యుగముగ నారునెలలచటఁ గడచెను. అప్పటికిమనయిరువురి కెడబాటు గలిగి రమారమి సంవత్సరమాయెను.'

'చిట్టి తల్లీ! ముగ్ధప్రాయమున నెన్ని కష్టములఁ బడితివమ్మా?' అనుచుఁ బ్రేమతో బ్రహ్మరుద్రుఁడామె మూర్ధాఘ్రాణ మొనర్చెను.

'కాని భగవంతుఁడు నన్ను మఱవలేదు. నాకా లంబాడిదండు విడుచుకాలము సమీపించెను. ఒకనాఁటి యుదయమున నొక రాజా యడవికి వేటకు వచ్చెను. ఆతని వెంటఁ జాల పరివారముండెను. కొమ్ములు- బాకాలు- తప్పెటలు- కేకలు- నవ్వులు- చప్పట్లు- వీనిమ్రోఁత కడవి ప్రతిధ్వనులీయఁ జొచ్చెను. కొందఱు రాజసభికులు మా పర్ణశాలల ప్రక్కగ స్వారిచేసిరి. నేను వారినిజూచి యానందించుటకు వెలుపలికి వచ్చితిని. అప్పుడా ప్రక్క నొక చిత్రము జరుగుచుండెను. ఒకయడవి పంది మహారోషముతో- వాయువేగ

ముతో మాకుటీరములవైపు పరుగెత్తుకొని వచ్చుచుండెను. 'తొలఁగుము తొలఁగుము' అనుచుఁ గంఠములు పగులునట్లు పెక్కురు నన్నుగూర్చి పలికిరి. ఆ తొందరలో నాకేమియుఁ దోఁచలేదు. వారి కేకలు నన్ను స్తంభితురాలి నొనర్చెను. నేను నావిపత్తు గ్రహించుకొనులోపల పందినాకు పదిగజముల దూరములోనికివచ్చి నన్నుచూచి ఘుర్ఘురించి నామీఁది కెగిరెను. మఱుక్షణములో నాజీవితమంతము కావలసినదే- కాని పైన సర్వరక్షకుఁడున్నాఁడుసుమా?'

ముక్తాంబ నిట్టూర్పుయాగెను. తండ్రి యామెను మరింత దగ్గఱకుఁదీసికొని గడ్డము పుడుకుచు, 'నిజముగా సర్వేశ్వరుడున్నాఁడు. మనలఁ బ్రతినిమిషమును గాచియున్నాఁడు. కాని, చెప్పుము. పిమ్మట నేమిజరిగినది? నీవెట్లు తప్పింపఁబడితివి?' అని యాత్రము సూచించుచు నడిగెను.

ముక్త మరల నిట్లు చెప్పఁజొచ్చెను 'ఒక దివ్యసుందరుఁడా సభికులలోనుండి తటాలున వెలువడి యశ్వమునురికించి సరిగా పందినాపైఁ బడఁబోవు క్షణమునఁ దననిశాతభల్లము దానిహృదయమ్ముగుండఁ దూసికొని పోవునట్లు పొడిచెను.' ఆవరాహము నెత్తురుఁ గ్రక్కుచు మరణవేదనతో గర్జించి యొగిరి ప్రక్కకుఁబడి ప్రాణములు విడిచెను.'

'ఆహా! ఆహా! అట్టిశూరుఁడెవఁడు. తల్లీ! లజ్జచెందుచున్నావు. నీపెనిమిటి కాఁడుగద? అనుచు సేనాని యామెకథ కడ్డువచ్చెను.

'నాయనా! మీయూహ సరియైనది. ఆవీరుడే నాభర్త.

కంటికి ఱెప్పవలె నన్ను బోషించుచున్న సుగుణోదారుఁడే యాతఁడు.'

'బిడ్డా! ఆతనియొక్క సాహసమునకై మణివగు నిన్ను నేనే మనస్ఫూర్తిగ నిచ్చియుందును. నీ కెల్లవిధముల సుఖదాయకుఁడైన భర్తలభించినందులకు నాయానందము మేరమీఱుచున్నది.'

'తరువాత నన్ను సభికులందఱు సమీపించి సాహసమునకాయావ్యానుని- చక్కదనమునకు నన్ను స్తుతింపఁజొచ్చిరి. వారిరాజువచ్చి జరిగిన విషయమువిని నన్నుజూచి విస్మితుఁడై లంబాడీలయొద్దనుండి కానుకగా గ్రహించి, యాప్రదేశముననే నావృత్తాంతమడిగెను. నేనునాకుఁదెలిసినది నివేదించితిని. రాజు సాంతమువిని లంబాడీలఁదూఱి, మా యిరువురి సమ్మతిమీఁద నన్ను నాసుందరుని వధూవరులనుగా నిర్ణయించి తన పురమునకు వెంటఁబెట్టుకొని పోయెను.'

'మిక్కిలి చిత్రముగానున్నది. తరువాతఁ జెప్పుము.'

'నేనాక్షణమునుండియు నాప్రియుని చెంతనేయుంటిని. ఆతఁడు సైనికోద్యోగులలో నొకఁడనియు, రాజుగారికాప్తుడనియు నాకుఁ దెలిసెను. ఆతని యుదార ప్రవర్తనవలననే నాతనిఁ బ్రతిక్షణము నెచ్చుచున్న యనురాగముతోఁ జూచుకొనఁ జొచ్చితిని. మీకొఱకై యానృపతి మనుజులఁబంపెను. మీరు కొన్నిదినములేడ్చి గృహపురములు విడిచి జాడలేకుండఁ జనినట్లు తెలిసెను. ఆసంతోషమప్పటిలో నేను నోచుకొననైతిని. యథావిధిగ మా వివాహము జరిగెను. నీకొఱ

కై నాభర్త యీయేడేండ్లనుండియుఁ బ్రయత్నించుచు మారు పేరుననున్న నీ జాడ కొన్నిదినములక్రిందఁ గనిపెట్టఁగలిగెను.'

'ఎట్లు? ఎట్లు?'

'అది నే జెప్పఁజాలను. కాని నేను మిక్కిలి సుఖముగా లవమైన లోపములేకుండ భర్తతో నున్నాననియు- నిన్ను గాంచుట నాయానందము సంపూర్ణమైనదనియుఁ జెప్పఁగలను'

"ఆ సుందరుని పేరు- ఊరు- ప్రస్తుతోద్యోగము చెప్ప జాలవా?'

'మీరడుగవద్దు. యుక్తసమయములో నాపతియే చెప్పగలఁడు'

'పోనిమ్ము. నీవిప్పుడిచటి కెట్లువచ్చితివి?'

'నిన్ను గుర్తించుటకై నాపతియునేనును నెల్లూరు వచ్చి యిచ్చట నీవుంట తెలిసి రానెంచుచుండ నింతలో యుద్ధము సంప్రాప్తమాయెను. నాభర్త నెల్లూరిలో నిలిచి యుద్ధమాపనెంచి సమయము కలిసివచ్చినందులకు సంతసించి నన్ను తెలిపికొనుటకును దాని మూలముగ నిన్ను మరలఁ గలిసికొనుటయేకాక యుద్ధమాప యత్నించుటకును నన్నంపెను. ఈరాజులందఱు నప్పుడేవచ్చినసంగతి యాయనకుఁ దెలియదు.

'ఇప్పుడు రణము జరిగిన మీకేమి?'

'నాభర్త నెల్లూరురాజునకు హితుఁడు. ఆతని ప్రతికక్షులఁగలియఁడు. నాకొఱకై మీరైనయుద్ధము చేయకున్నఁ బరమసంతోషము.'

'బిడ్డా! పోనీ నాకెదురుగఁ బోరాడక యాతఁడు రణమేలమానరాదు? మమ్ముఁ గలియనక్కఱలేదు. ఊరకుండ వచ్చును.'

'అది సంభవించదు— 'ముక్త దిగులుతోఁ జెప్పెను. ఈసమయమున నెల్లూరునందుండి యాతఁడు సేనను జేరకున్న సమంజసమా? మఱియు నీకుఁ బ్రస్తుతము వచింపరాని మహాత్కారణమున్నది.'

'అయిన నేను మాత్రము మానఁగలనా? తల్లీ! నీకొఱకై సర్వము త్యజించెదను. కాని—కాని—ముక్తా! యిది నన్ను మించినది. యుద్ధము తప్పదు. ఇంతదూరము సంగతులు నడచి నన్ను సర్వసేనాధిపతి నొనర్చిన పిమ్మట నేనేమి చేయఁగలను. కన్నతల్లీ! నీమీఁదఁ బ్రమాణముచేసి చెప్పుచున్నాను. నాచేతనున్నఁ బాణముల సంతసముతో విడిచి యీపెదను. కాని నేనొక భృత్యమాత్రుఁడనని నీకుఁ దెలియును. నేనెట్టిసాయము నీతరుణమున జేయఁజాలనందులకు మిక్కిలిఖేదముగానున్నది. ముఖ్యముగా నిప్పుడు - నా కన్నులపండువవునీవు తలవని తలంపుగా లభించినప్పుడు- నా పెన్నిధానమునాకుఁదిరిగి యబ్బినప్పుడు. నాముక్త నన్నుప్రార్థించినప్పుడు నిష్ప్రయోజనము-: నిరర్థకము"

తండ్రి సదుద్దేశమును- యుద్ధమాపఁజాలనందులకుఁ జింతయుఁజూచి ముక్త యాతని వక్షముపైఁ దనతలపెట్టి, ముఖమెత్తి యాతనిమోముఁగాంచుచు 'తండ్రీ! చింతిల్లకుము. అంతయు దైవముచేతిలోనున్నది. ఆకరుణాళుని ఘటన

మెట్లున్న నట్లుజరుగును!' అని మృదువుగా, సాంత్వనముగా వచించెను.

'పరమేశ్వరుని సంకల్పము జరుగుఁగాక! ఆదయా సముద్రుఁ డీదీనుల నేమఱకుండుఁగాక!' అని బ్రహ్మరుద్రయ్య గంభీరముగాఁ బలికెను.

తరువాతఁ గొంతకాలము దనుకఁ దండ్రి కూఁతులెవరి యోజనలలో వారు మునిఁగి మౌనముద్ర వహించిరి.

పదునొకండవ ప్రకరణము.

"నత్తుశేరులారా! పాఱుఁడు!"

'తండ్రీ! ఇఁక నేనిచ్చట మసలుట మంచిదిగాదు. మారుపేరుతో నీపదవి కెట్లువచ్చితివో క్లుప్తముగాఁ జెప్పుము. తరువాతఁ గర్తవ్యముఁ గూర్చి విచారించి దాని ననుసరించి నడచుకొనవలెను. నన్ను జోరులెత్తుకొని పోయినపిమ్మట నీవృత్తాంతమేమి? అనిముక్త తనజనకుని మృదువుగా నడిగెను.

"ముక్తా! నాదీనచరిత్ర సంగ్రహముగా జెప్పెదవినుము' అనుచు బ్రహ్మరుద్రుఁ డారంభించెను. "నిజాడ తెలియక నాలుగైదు నెలలవఱకు నేను పడిన పరితాపమును - నీజా

డలు దీయుటకై నేనుజేసిన ప్రయత్నములును- క్షణము స్వస్థత లేక నేను గడపిన రాత్రింబవళ్ళును- వేయేల నాగోడుపరమేశుని కెఱుక —"

ఈమాట లుచ్చరించుచు సేనాని కొమరిత మరల లభించిన యానందము మనసార ననుభవించుటకో- లేక యాజవ్వనిఁ దిరిగి యెడఁబాపఁబడుననుభయముచేతనో ఆమెను హృదయమునకు హత్తికొనెను. క్షణమూరకుండి యాతఁడు మరలఁ జెప్పఁజొచ్చెను.

"తుదకు నాకు విసుకు జనించెను- నీవీభూమిపై లేవని నిశ్చయించుకొంటిని? మీతల్లి నీ బాల్యముననే గతించినది. లోకములో నాకింక నేమున్నది. ఆలోచింపఁగా, నాలోచింపఁగా నాకు వైరాగ్యము కలిగెను. తుదకు కంచర్ల యొక నిశీథమున విడిచితిని. మరల నింతవఱకు నచ్చట నడుగుపెట్టలేదు. పేరుమార్చుకొని బ్రహ్మరుద్రుఁడను నూతన నామముతో దేశాటన మారంభించితిని. అయినను నావైరాగ్యము సంపూర్ణము. ప్రతిగ్రామమున- ప్రతిపట్టణమున- ప్రతియింట- ప్రతిచోట నింకను నాముక్తను- నాకన్నతల్లిని వెదకుచునే యుంటిని."

"మీ వాత్సల్యము నేనెఱుఁగనా!"అనుచు ముక్త ద్విగుణితమైన మహానురాగముతోఁ దండ్రికథ కడ్డమువచ్చెను.

"చిట్టితల్లీ! లక్ష్మివంటి మీతల్లితోనే నేనును బోయి యుందును. మాయిరువురి ప్రేమల మూర్తిఁ గొనిన నీవు నన్ను జీవింపఁ జేసితివి. కాని యావిషయమిప్పుడేల? మీఁది

వృత్తాంతము వినుము. ఇట్లు రెండుసంవత్సరములుదిరిగి తుదకు సంచారము నంత మొనర్చి న పల్లికొండచేరితిని. నా జీవితము మార్పునొందవలసి యుండెను. పల్లికొండ ప్రభువును- ఉదార చిత్తుఁడునగు చల్లపిన్నమ నాయఁడా సమయమునఁ బ్రచండ వ్యాధిగ్రస్తుఁడై యుండెను. ఎల్లరు నాతని యాశలు వదలుకొనిరి. నాకు వైద్యమునఁ గొంతపరిచయ మున్నదని నీకుఁ దెలియునుగదా? రాజవైద్యులతోఁ గలసి నే నంతఃపురమున కేగి రోగిని జూచితిని. రుగ్మతనాకుఁ దెలిసెను. దానికిఁ దగిన మందు పడలేదు. అచటి వైద్యులు దానిని వేఱురోగముగా భావించి నిష్ప్రయోజనములగు మందుల వాడుచుండిరి. పలు మాటలేల? నేనావ్యాధి నొకవారము దినములలోఁ గుదర్పఁ గలనని వచించి పందెము లొడ్డితిని. రాజవైద్యుల యసూయ చెప్పఁదరముగాదు. తెలిసి తెలియక వైద్యముచేసి తనప్రాణములకెగ్గు దెచ్చినఁ దగుకఠినశిక్ష విధింతుననియు- వ్యాధికుదిర్చిన నుచితరీతి సత్కరింతుననియు రాజు తెలిపెను. నేను నిర్భయముగా సమ్మతించితిని.

"వైద్యమారంభించితిని. గడవులోపల రాజు దేహములో మార్పుజరిగెను. భగవత్కృప నాయందుంటచే రుగ్మతనిమ్మళించెను. పిన్నమనాయఁడు రెండునెలలో సంపూర్ణారోగ్యవంతుఁడై నన్ను బహుమానము కోరుకొమ్మనెను. సేనలో నుద్యోగము గోరితిని. ఆతఁడిప్పించెను. దినదినాభ్యాసవశమున నస్త్రవిద్యలో నచిరకాలములో నసమానపాండిత్యము లభించెను. ఇదివరకున్న సేనాని వృద్ధుఁడు కాఁగా రాజునా

యెడల మహాదరబుద్ధివహించి నన్ను సేనాధిపతిగ నొనర్చెను. కొలఁది కాలములోనే నన్ను ప్రధానమంత్రినిగఁ జేసి నా మాట జవదాటక నాయందు మిక్కిలి నమ్మకముతోఁ బ్రవర్తింపఁజొచ్చెను. నాలుగేండ్లనుండి నేను పల్లికొండ మంత్రిగను సేనానిగనున్నాను. రాజాదరణకేమియుఁ గొఱఁతలేదు."

బ్రహ్మరుద్రుఁడు తన కథముగించి యాగెను. ముక్తాంబ యందలి ముఖ్యాంశముల గ్రహించి యిట్లనెను. "మన మొండొరులకథలఁ జెప్పికొనినాము. కొంతవఱకొకరి వృత్తాంత మొకరికిఁ దెలిసినది. ఇఁకఁ గర్తవ్యము విచారింపవలసియున్నది. నేనిఁకఁ బోయిరాననుజ్ఞయిండు—'

"అమ్మా! జయాపజయములు భగవదధీనములు. ఈ యుద్ధములో నెవ్వర మేమగుదుమో చెప్పఁజాలను. పండువెన్నెల వలెవచ్చి యింతలోనన్ను గాఢాంధకారమునముంచి పోయెదవా? బిడ్డా! నన్ను విడువకుము- విడువకుము నేను నిన్ను జూడకుండఁజాలను.— అయ్యో! నావెఱ్ఱి! ఒకనిభార్యవు. పరాధీనురాలవు. నిన్ను - కన్నతండ్రినైనను - నేను నిలువుమనుట పాడిగాదు. అయిన మరల నెప్పుడు వచ్చెదవోకదా?" అనుచుఁ గూఁతును విడుచుసమయము వచ్చునప్పటికిఁ దండ్రి కలఁగఁజొచ్చెను.

'తండ్రీ! దైవనిర్దేశమున్న యుద్ధాంతమున నీ పుత్రిక పతితోఁ గూడ నీయింటఁ గొంతకాలముండును. ప్రస్తుతము మాత్రమాశీర్వదించిపంపుము!'' అనుచు ముక్తాంబ తండ్రిపాదములకు నమస్కారమొనర్చెను.

ఉచితరీతి హృదయ పూర్వకముగా బ్రహ్మరుద్రుఁడు తనయను దీవించి లేవఁదీసి నుదురుముద్దాడి యిట్లనెను. "అయిన నీలోఁపుగ నీపతినిజూపవా ముక్తా? ఇప్పుడు కాకున్న మరల నేనాతనిఁ జూడనోఁచుకొనక పోవచ్చును- ప్రచండ దారుణ రణరంగమున నెవ్వరికేమో."

'మీరన్నది నిజమే. అయిననది ప్రస్తుతము సందర్భ పడలేదు. కరుణాళుఁడగు భగవానుఁడు పునర్దర్శన సౌఖ్యము మనకును- ప్రథమసమావేశ సౌఖ్యము మీయుభయులకు ననుగ్రహించుఁగాక.'

'తథాస్తు'

'నేను నాపతిని బొగడికొనిన గర్వముగ నుండు నేమో కాని- యాప్రాయమున కంతటి యోధుఁడింకొకఁడుండడు.'

'అగునా? ఆతని వయసెంత?'

'ఇరువది యెనిమిదేండ్లు. తేపునీవాతని సమరభూమిని జూడగలవు. గుర్తింపఁగలవు. ఆతని పరాక్రమ మట్టిది కాని జనకా? నీవు నాకొక వాగ్దత్త మొనర్పవలెను. ఎట్టి సందిగ్ధ సమయమునందును నల్లునిపైఁ గత్తినెత్తకుము. నాపతిచేతఁ గూడ నిట్టివాగ్దత్తమే చేయించుకొందును. మీ రొండురుల సంగరరంగమున నెదుర్కొనుట నైజవిరుద్ధము.'

'తనయా! ఈవిషయము నీవు మాయిరువురికిఁ జెప్ప నవసర ముండదని నమ్మెద. తప్పని సరిచే మేము వేఱుపక్ష ములఁ బోరాడవలసి వచ్చినను నన్యోన్యము నిర్మూలించుకొన వలెనను నగత్యములేదు. నా కరవాలమునకు మనుమసిద్ధి

భటులు పెక్కురున్నారు. ఆతని కృపాణమునకుఁ గాటమ రాజు సైనికులు చాలమందికలరు. యుద్ధము సేనాపఁజాలని కారణము నాయల్లునికి స్పష్టముగఁ జెప్పుము. ఆతనిపేరు- నివాసము- పదవి- చరిత్ర తెలియువఱకు నాకుఁదోఁచదు. అయిన నోపికతోనుందును'

'అయిననాకిఁక సెలవు. తిరిగి త్వరలో మాధవుఁడు మనల నందఱ సుఖసమావేశమున మన్నించుఁగాక'

ముక్తను బ్రహ్మరుద్రుఁడు మఱియు మఱియు ముద్దాడి దీవించి, భోజనము చేయననుటచే ఫలాహారమిడి పతిని గలుసుకొనువఱకుఁ దోడుగ నలువురనిచ్చి, పురుష వేషమును ధరింపఁజేసి, బరువెక్కిన హృదయముతో వీడ్కొనెను.

... ...

ముక్త మరల సన్యాసిని గలిసికొనెను. జరిగిన విషయమంతయుఁ బూసగ్రుచ్చినట్లు తెలిపెను. యుద్ధము తప్పదనుట యెఱిఁగించెను. తనతండ్రి చేతిలో నాపుశక్తి లేకుంట విశదముగాఁ జెప్పెను. అంతయువిని సన్యాసి యామెతో గంభీరముగా నిట్లనెను.

"ముక్తా! మనము మంచిచేయఁ జూచితిమి. భగవంతుని తలఁపు వేరైయున్నది. జననాశనము తప్పదు... పిచ్చిరాజులారా! అభిమానములు చంపుకొనలేక కాట్లకుక్కలవలెఁ బోరాడుఁడు! అంతఃకలహములతో నొండొరుల నాశనము చూచుకొనుఁడు! ఏపాపము నెఱుఁగని భటులారా. సైనికులారా! నిహతులుకండు. నెత్తుటేరులారా! పాఱుఁడు. వినాశ

కాలమా! రాజ్యమేలుము....ముక్తా. రమ్ము. ఈ నిష్కారణ యుద్ధములో నాజోక్యము విడిచియుందును కాని-కానితప్పదు. నేనొకరికొఱకై మనుమసిద్ధిపక్షమునఁ బోరాడవలసి యున్నదని నీకుఁదెలియును. పైనసర్వాత్మకుఁడున్నాఁడు. మనమాతని చేతికీలుబొమ్మలము. ఆతఁడాడించినట్లాడుదము రమ్ము."

పంద్రెండవ ప్రకరణము.

గాలివాన.

అనంతవినీలాకాశమును మేఘములు గప్పివైచినవి. సూర్యుఁడు కానరాడు. పట్టపగలు ప్రొద్దుగ్రుంకినట్లున్నది. గాలి చెలరేఁగినది. దుమ్ముదట్టముగా దిశలనావరించుచున్నది. మహోన్నతవృక్షములు విఱిగిపడునట్లుఱ్ఱూఁత లూఁగుచున్నవి. రెల్లుగానమొనర్చుచున్నది. పత్రములు వేలకొలఁదిగఁ బైకెగురుచున్నవి. గిర్రునఁదిరుగుచున్నవి. పక్షులు కలకలలాడుచున్నవి. మేఘసమూహము గగనవీధిని మదపుటేనుఁగుల వలె- యుద్ధరథములవలె భయంకరముగా సంచరించుచున్నది. ఉరుములురుముచున్నవి. ధణాంధణాశబ్ధములతోఁ జెవులు బ్రద్దలగునట్లున్నవి. కన్నులు చెదరునట్లు మెఱపులు మెఱయుచున్నవి. దూరమున హోరుమను మ్రోఁతసముద్రఘోషము వలె వినవచ్చుచున్నది. అదియేమి?

గాలివాన. ప్రళయకాలమందలి వర్షమువంటిగాలివాన. ఆరంభమైనది. ఈయనంతజలపాతమునకు-ఈయురుములకు- ఈమెఱుపులకు ఈపిడుగులకు- ఈప్రచండవాయువునకు-పంచభూతముల యీమహాయుద్ధమునకు - ఎన్నిగృహములు పాడువడునో! ఎన్ని మహోన్నతవృక్షములు కూఁకటివేళ్ళతోఁగూడఁ బెల్లగింపఁబడి కూలునో! ఎన్ని జంతువులు మ్రందునో! ఎన్ని జనపదముల కెగ్గువాటిల్లునో! ఎంతనాశనముకావలసియున్నదో! ఎప్పుడు తెలియును? మబ్బులువిచ్చి మరల భూమిపయి సూర్యరస్మిపడును. అప్పుడుగమనింపుఁడు! జరిగిన ఘోరవిషయములన్నియు నప్పుడుతిలకింపుఁడు. ప్రళయ పర్యవసానములప్పుడు కన్నులారఁగాంచుఁడు. ఇప్పుడు? ఇప్పుడుగాలివానకు మూలబలమగు కారుమేఘములు గుమిగూడుచున్నవి. వానివిచిత్రవిహారములింక నవియారంభింపలేదు. గాలివానరాలేదు. రాఁబోవుచున్నది.

యుద్ధము జరుగనున్న దినమువచ్చినది. నెల్లూరిలో నల్లకల్లోలముగనున్నది. తిక్కనమంత్రి, భూపతియనుజ్ఞతోఁ సందేశములు పంపినరాజులందఱుమనుమసిద్ధికిఁదోడుగ వచ్చియున్నారు. పురవీథులనెచ్చటఁజూచిన యుద్ధభటులు ఆశ్వికులు, ఏనుఁగులు సందడిగఁదిరుగాడుట స్పష్టమగును. సైన్యములకాహారసామగ్రికయి గుంపులుగుంపులుగ వీథులందుసైనికులటునిటుఁదిరుగుచున్నారు. ఉద్యోగులుసుందర వస్త్రములుధరించి వారివారి "హోదా"లకుఁదగినట్లు వాహనములెక్కి పురవీథులఁ గ్రిక్కిరిసి పచారు లొనర్చుచున్నారు.

పట్టణముచుట్టు మహాసైన్యములు విడిసియున్నవి. నూరుల కొలఁది డేరాలు పెద్దపురమువలెఁ గన్నులపండువొనర్చుచున్నవి.

తిక్కనమంత్రి యింటనంతయు గందరగోళముగనున్నది. జరుగనున్నరణములో మనుమసిద్ధి కైలాసనాథుని కరుణవలన జయమునొందుటకై బ్రాహ్మణులు దేవుని బూజలు చేయుచున్నారు. నెల్లూరియుద్యోగులు - నితర రాజోద్యోగస్థులు బత్తెములకు - ననుజ్ఞలకు - సందేశములకు - ననేకమిషలచే నటునిటుఁ గ్రిక్కిరిసి తిరుగుచున్నారు మంత్రికూపిరిసలుపుకొనుటకుఁ దీరికలేదు. వేయికన్నులు—వేయిచేతులు—వేయిరూపములుగలిగినట్లు—తానెక్కడే వేయిమందిపెట్టుగ సమాత్యవరుఁడు పనులుజూచుచుండెను.

రణతిక్కన గృహముననేయున్నది. ఆయోధుఁడు సిద్ధముగనున్నాఁడు. కవచము-శిరముపైనుక్కుటోపి - చేతపరిపంథి భయంకరమగు కరవాలము-తనప్రాణతుల్యమగు నల్లని యశ్వమునెక్కి యాతఁడిప్పుడే రాజసన్నిధానమున కేగ సిద్ధమై గృహముఖద్వారము నిర్గమించినాఁడు. కేతనకవి వర్ణించిన యామూర్తిని గనుఁగొనుఁడు!. అందతిశయోక్తి లేశమైనఁ గలదేమో పరికింపుఁడు !

సీ॥ "వేఁడినవర్థార్థి వృథపుచ్చ నేరని,
దానంబుతనకు బాంధవుఁడుగాఁగ
నెదిరిన జమునైన బ్రదికిపోవఁగ నీని,
శౌర్యంబు తనకిష్టసఖుఁడుగాఁగ

శరణువొచ్చిన శత్రువరునైనరక్షించు,
కరుణయె తనకు సంగాతి గాఁగఁ
బలికినఁ బాండవప్రభునైన మెచ్చని
సత్యంబుతనకు రక్షకుఁడుగాఁగ
గీ॥ జగతినుతికెక్క-రాయవే ♦ శ్యాభుజంగ
రాజ్యరత్నాకరస్ఫూర్తి ♦ రాజమూర్తి
గంధవారణ బిరుదవి ♦ ఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయ ♦ తిక్కశౌరి॥"

సేనాని రాజమందిరమున కేగెను. అచ్చట విప్రులు రాజజయార్థము పూజలు సేయుచున్నారు. రాజు సేనాధిపతికి వెంటనేదర్శనమిచ్చెను. తిక్కనప్రభువుతోఁ గొంతకాలము ప్రసంగించినపిమ్మట మనుమసిద్ధియిట్లనెను:—"సేనానీ! నీవు నాకొకవిధముగ నాప్తుఁడవుగావు. మనయిరువురి ప్రాణములొక్కటిగ మెలఁగితిమి. మహాయోధసమేతమైన యీసేనకెల్ల నిన్ను సర్వసేనాధిపు నొనర్చితిమి. నీప్రభువు గౌరవమును గాపాడి, రిపునిగర్వము నడంచిరమ్ము. నీకుజయమగుఁగాక. న్యాయము జయించుఁగాక."

నమ్రుఁడై తిక్కనయిట్లు సమాధానమిచ్చెను. "స్వామీ. మీయుప్పుదిని సదామీక్షేమముఁగోరుచున్న మేము-ముఖ్యావసరమైన యిప్పుడు శరీరముదాచుకొనకుండ నీతుచ్ఛప్రాణముల రాజసేవార్థము నవ్వుచుఁ ద్యజింప సంసిద్ధులమై యున్నారము. మీఁదదైవ నిర్దేశము. కాటమరాజు సైన్యములో నెల్లరు యాదవులే. వారినిసులువుగా జయింపలే

కున్నఁ బౌరుషమేమి? రణపర్యవసానమునుబట్టి నృపతి తీర్పుచెప్పఁగలరు. పలుమాటలు కంఠశోషామాత్రములు"

"యోధశిఖామణివి. నీకు వేఱచెప్పనక్కఱ లేదు. బ్రాహ్మణులును క్షత్రియులు నేకకాలముననైన ద్రోణాచార్యులను, అశ్వత్థామను, పఱశురాముని మఱపించు క్షాత్రపెన్నిధానమవు. బ్రహ్మతేజోవంతుడవు. పోయిరమ్ము."

సేనాని రాజసమ్ముఖమునుండి నిజగృహమునకువచ్చి వృద్ధులగు జననీజనకులు సిద్ధయ-ప్రోలాంబలయొద్దను, భార్యయొద్దనునుచి తరీతుల వీడ్కోళ్ళు వడసి సేనలు సిద్ధమైయుండ నాజ్ఞయిచ్చి యెవరికొఱకో వేచియుండెను. ఇంతలోఁ గవచాదులుధరించి యుద్ధవేషముతో—నొఱయందు వ్రేలుచున్న నిశాతకరవాలముతో నొకసుందరాశ్వము నెక్కి సన్యాసి వచ్చెను. సేనానియాతని నుచితవిధిని సన్మానించి, "స్వామీ. నాప్రార్థనవినక మీరుకూడ మావైపునఁ బోరాడ—అనఁగా న్యాయపక్షమునఁ బోరాడఁ—దలఁచితిరి. మీమాటమేము జవదాటము. మీపరాక్రమముమాకుఁ బరిపూర్ణముగాఁ దెలియును. మీరుమాతో వచ్చుటచే మేము ధన్యులము. యుద్ధభూమి యలంకరింపఁ బదుము," అని సాదరముగా వచించెను.

సన్యాసిమందహాస మొనర్చి యిట్లనెను. "స్తోత్రము వద్దు. ధర్మపక్షమున సమర మొనర్చుట మావిధియై యున్నది. కాషాయవస్త్రములఁజూచిన నన్నీ యుద్ధవేషమునఁ జూచుట వింతగానున్నదా?"

"చిత్తము—రండు. ఇఁకనాలసింప నేల?" అనుచు సేనానిగృహము సన్యాసితోఁగూడ నిర్గమించెను.

... ...

పాలేటియొద్దనున్న పంచలింగాలకొండదగ్గఱ రెండు సైన్యములు నెదుర్కొనినవి. యుద్ధమునకంతయు సిద్ధమైయున్నది. మనుమసిద్ధిపక్షమున తిప్పరాజు, శ్రీకంఠరాజు, చొక్కరాజు, వరదరాజు, అచ్చిరాజు, మాదిరాజు, గంగరాజు, సోమన్న, ఉమ్మయ్య, చంద్రశేఖరుఁడు, దేవముని వెంగళయ్య, పట్టుకోట బసవరాజు, పాపతిమ్మరాజాదులు, మనుమసిద్ధికిఁ దోడయివచ్చిరి. వెనుకనొకప్రకరణములో మాచే విశదముగా వర్ణింపఁబడిన పద్మనాయఁడు, పిన్నమనాయఁడు, అయితమరాజు, ఘత్తమరాజాదులుకాటమ రాజునకుసాయము వచ్చిరి. ఇటురణతిక్కన— అటు బ్రహ్మరుద్రుఁడు సేనానులు. ఇటునటునించుమించుగా నలుబది వేల సైన్యమున్నది. ఇటుమన్మసిద్ధి రాలేదు. అటు కాటమరాజు రాలేదు.

పంచలింగాలకొండసమీపమున రెండుసేనలెదురెదురుగ నిలిచియున్నవి. క్రిందటిదినమున నిర్మానుష్యముగనున్న యామైదానముపై నిప్పుడించుమించుగ నెనుబదివేలయుద్ధభటులు పంక్తులుతీర్చి భాగములుగా నిలిచియున్నారు. గాలి వాన రాఁబోవుచున్నది. అది ప్రొద్దున. సూర్యుఁ డుదయపర్వతము నతిక్రమించి చాలసేపైనది. రెండవ జామారంభమైనది. ఆ నాఁటియంతము లోపల నాస్థలమెట్టి ఘోరమగు మార్పు నొందవలసియున్నదో! ఎందఱుసమయనున్నారో!

ఏమిదారుణ కృత్యములు — సాహసకార్యములు సంభవింప నున్నవో!

రెండు సేనలకును మధ్యమున్నూరుగజముల ఖాళీస్థల మున్నది. అదియిఁకఁ గొలదికాలమునకు నెత్తుటిమయము కావలసియున్నది. రెండుసేనలనుండి రణభేరీలు మ్రోగి యా సేనాసముద్రములోఁ గల్లోలములు పుట్టించెను. కత్తులు, కఠారులు, బాకులు —ఈటెలు —శూలములు —డాలులు—అన్ని యుసిద్ధముగ నున్నవి. జయజయశబ్దములతో— హరహరా యను నారావములతో- హయహేషలతో-మదగజ ఘీంకారములతో-రణభేరీల ఢమఢమా రావములతో రెండుప్రవాహములు నొకదానికెదురుగ నొకటి వాయువేగముతోఁ బాఱెను ·ఒకక్షణము! ప్రవాహములొండొంటి విసురుగాఁ దాకినవి - సైన్యములు కలసిపోయినవి. సంహారమారంభమైనది ... ... గాలి వాన మొదలు పెట్టినది!

పదమూడవప్రకరణము.

యుద్ధము—ప్రథమదినము.

సాధారణముగా యుద్ధముల వర్ణనలు మనము గ్రంథములలోఁ జదువుచునే యున్నారము. భారతయుద్ధముఁ

జదువుచున్నప్పుడును- లేక వినునప్పుడు నది మనకన్నులయెదుట నుండును. వీరావేశమున బొబ్బలు పెట్టువారును - నన్యోన్య ప్రోత్సాహముల నుఱుములవంటి కంఠస్వరముల నుచ్చరించువారును-నిశాతఖడ్గముల మెఱుపులవలె ఝళిపించువారును- నీటెలఁబొడుచువారును - శూలములఁగ్రుచ్చువారును - కత్తుల మొత్తువారును- డాలులఁద్రిప్పువారును - హయములఁజబుకు సేయువారును - గజముల నుఱికించువారును - భేరీలూరక వాయించువారును-బాకాలు భీకరముగమ్రోయించువారును నైప్రచండకోలాహలముఁ జేయుచున్న వేలకొలఁది భటులు మన మనోనేత్రము ముందు స్పష్టముగఁ దోఁచుచుందురు.

పంచలింగాల కొండయొద్ద జరిగినయుద్ధము భారత యుద్ధమంత గొప్పది కాదు. కాని సంహారమునందును, జననాశనమందును దానికిఁ దీసిపోదు. అన్నదమ్ములవలె, నైకమత్యము వహించి పట్టణములఁ బల్లెలేర్పఱచుకొని శాంతముగా నొకప్పుడు వసించుచుండిన జనులేనావీరు? నాతండ్రి- నాతమ్ముఁడు- నాబావ- నాహితుఁడని యొక్క సమయమున నోరారఁ బ్రేమతో సంబోధించుచుండిన చుట్టములేనావీరు? తమ యాప్తులలో నొకరికి రుగ్మత సంభవించిన- నొకరికిఁ దేలుగుట్టిన- నొకరిని జీమగఱచిన దిగులొందు హితులేనావీరు? దగ్గరవారు మరణించినఁ గన్నీరు మున్నీరుగా విడుచు ననురాగవంతులేనావీరు? ఇదేల నొకరి నొకరు నిర్మూలించుకొనుచున్నారు? ఏల గర్భశత్రుత్వము వహించినట్లు గన్పట్టుచు నెదుటవారిఁ బొడుచుచుఁ - జీల్చుచు - నఱకుచు-

మోదుచు నిష్టమువచ్చినట్లు చెలరేగుచున్నారు? ఈ మహార్భాటమంతయు నేమి? వీరిప్రేమ లేమైనవి? వీరి కరుణయెచ్చట నడఁగిపోయినది? వీరిమనుష్య ధర్మమేమైనది?

రణమట్టిది. కదనరంగమునఁ జుట్టములు లేరు- అనఁగాఁ దమపక్షమువారు తక్క యెదుటి వారందఱు గర్భశత్రువులు. తమ పక్షమువారందఱు ప్రాణమిత్రులు. తమపోరాట మున్యాయము, ఘనము- వర్ణనీయము. తామే గెలుపొంద వలెను. ప్రాణములు?- పోయిననుమానె. ఎదుటివారిని ఖండింపవలసినదే! నురుమాడవలసినదే! తుత్తునియలొనర్పవలసినదే! మ్రింగివేయవలసినదే!

పంచలింగాల మైదానమున జరుగుచున్న దారుణసంగ్రామము తిలకింపుఁడు. రణతిక్కన విజృంభించినాఁడు. సన్యాసిశత్రువులకు మృత్యువుగాఁ దోఁచుచు విహరించుచున్నాఁడు. అచ్చిరాజు వ్రేటునకొక శిరమొగురుచున్నది. చంద్రశేఖరుని కృపాణధార గురితప్పక యొక్కొక్కప్రాణమునె మ్రింగుచున్నది. ఆదివన్నె మాదిరాజు తురంగమే శత్రువులఁ బరిమార్చుచున్నది. రౌతు దానిమీఁద నాసీనుఁడై యుండుటయే దుర్ఘటముగానున్నది. వెలకంచి వెంగళపతి తన జీవితమఱచేతిలోఁ బెట్టికొని సమర మొనర్చుచున్నాఁడు. ఉమ్మయ్య, అచ్చిరాజు, శ్రీకంఠరాజు మొదలగువారుచితవీరావేశముల నొడళ్ళుమఱచి సంగర తలమున విహరించుచున్నారు.

ప్రతికక్షులయందును యోధులకుఁ దక్కువలేదు. బ్రహ్మ రుద్రయ్య ప్రళయ రుద్రునిభంగి భయంకరుఁడై

యెల్లెడలఁ దానయగుచు మనుమసిద్ధిసైన్యముల హాతమొనర్చుచుండెను. పిన్నమనాయఁడు మూర్తీభవించిన యముఁడో యనఁ దనకడ్డమువచ్చిన వారి నుగ్గునుగ్గుచేయుచుఁ గపాలముల ఛిన్నాభిన్నము లొనర్చుచుండెను. అయితమరాజటునిటు సవ్యసాచివలెఁ గరవాలము మెఱపించుచు విరోధుల నరఁటి తూండ్లవలె నఱకుచుండెను. 'రణవృకము' పుత్తమరాజు. చెలరేగి చేయుచున్న నాశనము వర్ణనాదుస్సాధ్యము. నాచకూళ్ళనాయఁ డుగ్రుఁడై కొండవాగువలె నిరాఘాటముగ విజృంభించుచుఁ దనముప్పది గాయములను సంఖ్యలో వృద్ధి చేసికొనుచుండెను. కరియావులరాజు కారెనుమువలె నడ్డువచ్చిన ప్రతికక్షులఁ గ్రుమ్ముచుఁ- ద్రొక్కివైచుచుఁ- జీల్చివైచుచు- మార్తాండునివలె మండిపడుచు నాభీలముగాఁ జెండుకొని తినుచుండెను.

రెండుఝాములు దాటినది. ఎండ తీవ్రముగనుండెను. యుద్ధము మహాదారుణముగ జరుగుచుండెను. రెండుపక్షముల నూరులకొలఁది భటులు మ్రందిరి-మ్రందుచుండిరి. మనుమసిద్ధిపక్షమున నేతెంచిన రాజులలోఁ గొందరికాసమయమున నంతఃకలహములు గలిగెను. అవి మొదట మొదట నంతవిశేషముగాఁ గన్పట్టలేదుగాని క్రమక్రమముగా వృద్ధిజెంది క్రియారూపకముగఁ బరిణమించి యానృపతులు తమసైన్యములకు యుద్ధము మాననాజ్ఞయిచ్చిరి. వారిని గొందరనుసరించిరి. తలవని తలంపుగా సంభవించిన యీవిఘాతమునకుఁ దిక్కన సేనాని మిక్కిలి విచారించి యానృపతుల ననేకవిధముల సాం

త్వన మొనర్పఁజూచెను. కాని వారు తమసేనల విడఁదీసిదూరముగాఁబోయి యచ్చటఁ దగవులాడఁ జొచ్చిరి. తుదకు ఖడ్గతిక్కన వారితగవుదీర్చి యుద్ధభూమికిఁ గొనివచ్చుటకు సన్న్యాసిని రాయబారిగఁ బోవ బ్రార్థించెను. యుద్ధపర్యవసానమారాజుల నేస్తముమీఁద నాధారపడియుంటచే సన్న్యాసి రాయబారావశ్యకతఁ దృటిలో గ్రహించి యుద్ధభూమివీడి యానృపతుల యొద్ద కేగెను.

ఈలోపుగ మిగిలిన స్వసైన్యములతో రణతిక్కనయపరమృత్యువై కాలయముని చండతను మఱపించుచుఁ జెలరేఁగి యహితుల సేనలపైఁబడి తేళ్ళగుంపు నడుమ దుమికికలగుండు వడఁజేయు బెబ్బులి తెఱంగున శత్రువుల దారుణసంహారమొనరించుచుండెను. ఆతని ధాటిని బ్రహ్మసుద్రుఁడాపఁజాలకపోయెను. ఇది యిట్లుండ పిన్నమనాయఁడు పరాక్రమించి తిక్కనసేనను దనపొట్టను బెట్టుకొనఁ దొడఁగెను. రమారమి నలుఁబదివేలమంది ప్రతికక్షులపై హతశేషమైన తిక్కనసేన పదునైదువందలు పోరాడుచుండెను. ఎంతవ్యత్యాసము! అయినను తిక్కన వెనుదీయక తనభటుల ననేకవిధములఁ బ్రేరేపించుచు శత్రువుల మార్కొనుచుండెను. మఱిరెండుగడియల కాతనిసేన మూఁడవవంతు మిగిలెను. దనకుఁ దనభటులకు నాఁడు చావుతప్పదని నిశ్చయించుకొని యాయోధుఁడు వారినొక్కమారు హెచ్చరించి శత్రువులమీఁది కుఱుకఁబోవుచున్నతరుణమున పిన్నమనాయఁడు పెద్దగొంతుకతో నిట్లనెను.

'బ్రాహ్మణుఁడా! నీపరాక్రమ మద్వితీయము నీకీదినము

జయలక్ష్మి లేదు. నీసహాయభూపతులు వేరైరి. నీవేమి చేయఁగలవు? దైవసంకల్ప మట్లున్నది. అమూల్యప్రాణముల నీహతశేషుల వెఱ్ఱిగాఁ జంపుకొనఁబోకుము. మేము ముప్పదియాఱు వేలమందిమి. మీరు? అయిదునూర్లు! లాభములేని యీపనినుడుగుము. నీవు భూసురుఁడవు. నిన్ను రణమునఁ జంపిన బ్రహ్మహత్యాపాతకము మాకుసిద్ధించును. మామీఁదఁగోపింపక పోరుమానుము. యోజించుకొనుము. రేపు తగుసేనలతో రమ్ము. నేఁటికాగుము.'

తిక్కన నిలిచెను. తనభటులతో యోజించెను. పిన్నమనాయని వాక్యములు సమంజసములగుట నవశ్యాచరణీయములని వారేకగ్రీవముగ వాక్రుచ్చిరి. వృథయా పరిశ్రమచేసి వారిప్రాణములఁ బోగొట్టుకొనుట కేవలము వెఱ్ఱియనివారు విశదముగా సేనానికిఁ దెల్పిరి. ఖడ్గతిక్కన నిర్ఘాంతపడెను. యుద్ధభూమినుండి వెనుదిరుగుటయా?- తనజన్మములో లేదు! ఇప్పుడు కర్తవ్యమేమి? తానొక్కఁడును బోరాడి యావేలకొలఁదినున్న సైన్యమును జయింపవలెననుట సముద్రమునీదు తలఁపువంటిది. భటులకును నిష్కారణముగ నసువులఁదొఱఁగుట యనవసరమని తోఁచినది. సన్న్యాసిగాని- ఒక్కరాజుగాని రాలేదు. కర్తవ్యమేమి?

కొంతకాలము నిలువవలెనని, కొంతసేపు రణరంగము విడువవలెనని యోజించియోజించి- పరితపించి- యెట్టకేలకు రణమింకను జేయుట మూర్ఖత్వమని గ్రహించి-తనతప్పులేదని నిశ్చయించి- మఱునాఁడుపగఱనూచమేదఁ గొట్టవలయునను

పట్టుదలతో - జరిగిన సంగతులు విశదమైనప్పుడెల్లరును దనను నిందించుటకుమాఱుగ దూరబుద్ధికగ్గింతురను ధైర్యముతో - "ఆపదలకోర్చిభంగపాటుతీర్చికొన" వలెననునూహతోఁబోఁబో వరాకయున్న పాదములతో - గిజగిజలాడుచున్న మనసుతో - హతశేషులతో రణతిక్కన సమరభూమివిడిచి పురోన్ముఖుఁడై పోయెను!

ప్రథమదినమున కాటమరాజు సంపూర్ణజయమందెను.

పదునాలుగవ ప్రకరణము.

పునర్జన్మ.

విశేషములను వెనుకవిడిచి, యపజయవార్త తిక్కనకుముందే నెల్లూరుప్రవేశించి కార్చిచ్చువలెఁద్రుటికాలములో నెల్లదిశల వ్యాపించెను. ఈదారుణవార్త నాలకించినప్పుడు 'హా! ఎంతవిపరీతము!' అనువారును, ముక్కుపైవ్రేలుంచి మహాశ్చర్యము సూచించువారును, 'ఇది నమ్మఁజాలము. సుమారు నలువదివేలసైన్యము హతమైనదనిన విశ్వసనీయము గాదు. ఇదియొక యసత్యవదంతిమాత్రమే' అనుచునను మానముతోఁ దలలూపువారును, "తిక్కనయే తిరిగివచ్చుచున్నాఁడా! పరాజితుఁడై! వచ్చునది ఖడ్గతిక్కనా, యాతని శవమా! మేనఁబ్రాణములుండ సిద్ధయతిక్కన యనినుండి పాఱినాడా? ఏమపయశము! ఎంతధైర్యము!" అనుచు

విసుగునఁ దిట్టువారునునై నెల్లూరిపురజనులు కల్లోలపడఁ దొడఁగిరి.

ఎట్టకేలకు విన్నపోయిన వదనముతో - నవనతమైన శిరముతో - నడుగులో నడుగువైచుచున్న యశ్వముతో - ఖిన్నులైన హతశేషులతో ఖడ్గతిక్కన నెల్లూరిరాజవీధిలోని జనులకుఁ గానవచ్చెను. కొందఱాతని మానమునుగౌరవించిరి. కొందఱాతని వెనుకఁ బరిహసించిరి. "సర్వసేనాధిపతి ముఖము చూడుఁడు. తెల్లదనమిల్లు కట్టికొనినది" అనియొకపౌరుఁడు కర్ణకఠోరములైనమాటలు వినఁబడివినఁబడనట్లు పలికెను. సేనాని వినెను. నేరస్తులవినుశక్తి మిక్కిలిసూక్ష్మము! "యుద్ధములో గతించిన నింతకంటెమేలు! వేయిమడుంగులుమేలు! ఒకమారు వెళ్లి గెలుపును వెనుకవిడిచి తిరిగివచ్చుట——" తుదిమాట తిక్కనహృదయములోఁ గ్రుచ్చుకొనెను. "తిరిగివచ్చుట-పందతనము!"- శాంతముగ నీయపనిందల- నీదూషణలభరించుచు సేనానిముందుఁ బోయెను. కొందఱెగతాళి మాటలాడిరి. కొందఱు నిర్భయముగా నిందించిరి. కొందఱు "బ్రాహ్మణకులమున కపకీర్తి తెచ్చినాఁడు. ఛీ!" అనిరి. 'తండ్రిసిద్ధయ కడుపునఁదప్పఁబుట్టినాఁడు. పులికడుపున మేకపిల్ల కలిగినది.' అనికొందఱు హేయభావముగనఁబలికిరి ... ... ఓపికతో సేనాని యింకను ముందునకేగెను. ఇదియేమి! లోకము. దీనిని మూయమూకుఁడు తేఁగలమా? కారణము తెలియక- విషయము లెఱుఁగక పౌరులు తనను నిందించుచున్నారు, నిజము తెలిసినఁ దననుస్తుతింపరా?——పోనిమ్ము, నిందించినందు

లకుఁ బశ్చాత్తాపపడరా! అనుకొనుచుఁ దిక్కనరాజమందిరమునుగూర్చి పోయెను.

పరాజయవార్త మనుమసిద్ధికిఁ దెలిసెను. తిక్కన తిరిగి వచ్చుచుండెననియు- నంతఃకలహములచేఁ బలువురురాజులు సేనలఁ బోరింపలేదనియుఁగూడ నతనికిఁదెలియవచ్చెను. ఉదారచిత్తుఁడగు మనుమసిద్ధి తిక్కనను గౌరవముతోఁ దక్కనింకెట్టి భావముతోడను దలఁపలేదు. సేనానివచ్చి యాతనికి విశేషములన్నియు నెఱిఁగించెను. అంతయువిని రాజువిచారసాంత్వనములఁజూపుచు నిట్లనెను. 'ఖడ్గతిక్కనా! నీవీయపజయమునకు విచారింప వలదు. దైవము న్యాయమునకుఁ బ్రతికూలమైనయెడ నేమిచేయఁగలము. నేఁడుమనకు-ఱేపు? ఱేపువారలకు! ఱేపులేదా! నేనా రాజమిత్రుల యంతఃకలహములుదీర్చి సైన్యమంతయు ఱేపుపోరునట్లొనర్తును. ఈ పరాజయమునకుఁ బ్రతీకారము ఱేపుతీర్చికొనుము. నీవు చూపిన సాహసవిక్రమములు వర్ణనాతీతములని భటులు దెలిపినారు. నీయట్టివారిరువురున్న జయముమనదే! కాని, నేఁడిట్లయినది. పోయి, నిర్విచారముగా భుజించి, మరలఱేపునన్ను గలసికొనుము."

ఈహృదయపూర్వకసమ్మానవాక్యములచేఁగొంతధైర్యమొంది తిక్కననృపుని వీడ్కొని నిజగృహాభిముఖుఁడాయెను. త్రోవలో మరలమిక్కిలి యోపికతో దూషణవాక్యములు సహించుచు నతఁడిల్లుసేరెను. ప్రాంగణమున నాతనిముసలితల్లిదండ్రులు గంభీరముగానిలిచియుండిరి. గుఱ్ఱముదిగి తిక్కన

మహాభక్తితో ప్రోలాంబకును సిద్ధయకును నమస్కరించెను. మాతాపితలిరువురును గనుబొమలుముడిచి క్రోధము, విసుగు సూచించు వదనములతోఁ గొమరుని మ్రొక్కులందిరి. "ఛీ! పాఱుబోఁతా! మాకడుపునఁ జెడఁబుట్టితివిరా, తిక్కనా!" అను దూషణవాక్యము లిరువురొక్కమారుగ నుచ్చరించిరి. తిక్కన యేమోచెప్పవచ్చి నోటమాటరాక మందిరములోనికరిగెను. ఆతనిముఖమునఁ గత్తివాటువేసిన నెత్తుటిచుక్కలేనట్లుండెను.

అందఱుఁ-దనకన్నతల్లిదండ్రులు సహితము - తన్నంత లోఁదప్పఁ దలఁచుటకు సేనానిమిక్కిలి ఖిన్నుఁడై కొంత కాలముఁ దీర్ఘయోజనానిమగ్నుఁడైయుండి యెట్టకేలకు స్నానమునకుఁబోయెను. భార్య చెల్లాంబ యాతనికి దొడ్డిలోనికిదారిచూప వెంటవచ్చెను. ఆమెను దలయెత్తిచూడక తిక్కన స్నానముచేయఁబోయి స్తంభితుఁడైయాగెను. అచ్చట నొకనీళ్ళబిందెయు - దానికిఁజాటుగనొక నులకమంచముంచఁబడెను! నులకమంచముకోటిపై నొకపసుపుముద్దయుండెను! ఆశూరుఁడు విన్నపోయి తాను పొరఁబడెనో, లేకయువితన్నవమానపఱచుట కట్లుంపఁబడెనో యని చింతించుచు, నడుగ సిగ్గుపడుచుండ నాతనికున్న లేశానుమానమును దీఱ వీరపత్నియగు చెల్లాంబ హేళనగా నిట్లాడెను; "నాథా! సిగ్గుపడెదరేల?

క॥ "పగఱకు వెన్నిచ్చినచో
నగరేనిను మగతనంపు నాయకులందుఱ్ ?

ముగురాడు వారమైతిమి

వగపేటికిజలక మాడ వచ్చినచోట౯॥''

ఇదివఱకు మనయింట మీతల్లియు - నేను నిద్దరు స్త్రీలమేయున్నాము. మీరారబలరీతి రణతలమునుండి పాఱి గృహముచొచ్చుటచే ముగ్గురాడువారమైతిమి. స్నానము చేయుఁడు. చింతయేల ?

తనభార్య! తనయర్ధాంగియేనా యీకర్ణశూలములఁ జిమ్మినది? కాలము! కాలము! తానోపికతో నుండవలెను. జగమెల్లఁ దన నన్యాయముగా ఫాలనేత్రముతోఁ జూచుచున్న దేమి?

ఎట్లో స్నానమొనరించి, మడిగట్టి, భోజనమునకుఁ గూర్చుండెను. పేరునకు మాత్రమే! ఆతనికొక్క కబళము లోనికిఁ బోలేదు. 'అమ్మా! పాలుపోయుము. నాకుభోజనము రుచింపలేదు,' అని యాతఁడు భక్తితోఁ దల్లిని బిలిచెను. ప్రోలాంబ క్షీరము వడ్డించెను. ఇది యేమి? పాలువిఱిగియుండెను.

'అమ్మా? పాలువిఱిగిన వేమి?' అనియాతఁడు భయపడుచునడిగెను.

అందులకు ప్రోలాంబ పరిహాసముగా నిట్లుత్తరమిచ్చెను: 'నాయనా? పాలు విరిగిన హేతువడుగుచుంటివా? వినుము.

క॥ 'అసదృశముగ నరివీరులఁ,

బసమీఱఁగ గెలువలేక పందక్రియ న్ని

వసివైచి విఱిగి వచ్చినఁ

బసులున్విఱిగినవి, తిక్క! పాలున్విఱిగె౯!'

నాయనా?. ఇదివఱకుఁ బలునోళ్ళ 'తిక్కన వీరమాతకు జన్మించినాఁడు. ఆమెజన్మ కాన్పుధన్యములు. పనసవృక్షమునఁ బనసపండు పుట్టినది' అను స్తుతివాక్యములు విని మీ తండ్రియు నేనును వంశోద్ధారకుఁడవగు నిన్నుఁ జూచి సంతసించుచుంటిమి. అయ్యో! అట్టి ముదమంతలో మార్పునొందఁ జేసి భువిలో నెంతనిందకుఁ బాల్పడితివి! ఎట్లుసాహసించితివి? నీవు పవిత్రమైన భారతమాతకు జన్మింపలేదా? నీపెంపుడు తల్లి కెంత యపయశముఁ దెచ్చితివి? నీయొడలియందు శూరరుధిరము ప్రవహించుచుండలేదా? స్వామికార్యమునకై యెన్నిగజములు, ఎన్నితురగములు రణభూమిఁ గూలినవి? వానికంటెహీనుఁడవైతివా? ఎందరుభటు లానందమున సమసివారు? నీసేవకులకంటె నీచుఁడవైతివా? అయ్యో! కొడుకా! ఈ తుచ్ఛకార్యముచే నీజననీజనకులకు- నీరాజునకు- నీపురమునకు- నీదేశమున కెంతయపకీర్తి దెచ్చితివి! చంద్రునివంటి మీకులమున మచ్చవలెఁ బుట్టితివే!'

తిక్కన భోజనమువిడచిలేచి తల్లిపాదములకు మ్రొక్కి 'అమ్మా! ఈదురాత్ముని దూఱకుము. నేఘోరపాపుఁడను. సెలవిమ్ము. ఒక్కఁడ నేగుచున్నాను. మనవంశమున కపకీర్తి లేకుండఁజేతును. చంద్రునిలోని మచ్చను నా నెత్తుటితోఁ గడిగి వైచెదను.' అనుచు నుద్రేకముతో మేడపై కేగెను. భోజనముకూడ సరిగాఁ జేయనట్టి కఠినవాక్యములకు మిగుల

నెచ్చుకొని- మాతృవాత్సల్యమొలుకఁ 'దల్లి యాతని నా వెడఁగుకార్య ముడుగుమని ప్రార్థించెను. తండ్రీ వేడెను. చెల్లాంబ కాళ్ళపైఁబడి చుట్టుకొని విడువకుండ విలపింపఁ జొచ్చెను- గాని లాభము లేదు. తిక్కన యాఁగక వారినిబలిమిని విడిపించుకొని ముందున కడుగిడెను. ఆతని వెడగు కృత్యమునకు పర్యవసానము మృత్యువని యెఱిఁగి యాముప్పురునాతనికిఁ ద్రోవలో నడ్డముగఁ బరుండిరి. ఆతఁడు నిర్లక్ష్యముగా వారిని గడచి ముందున కేగెను. అతనిచేతిలోఁ గరవాలము తళతళలాడుచుండెను. దేహముపైఁ గవచము లేదు. మడిగుడ్డలుమాత్రమే! ఆతనికిఁ బిచ్చియెత్తినట్లుండెను. యుక్తాయుక్తములు సమసినవి.

ద్వారములో నెవరో యాతనికడ్డము నిలిచి "బావా! శాంతింపుము. నీమఱఁది ముద్దుచెల్లిపుఁను. ముకుందునికోరిక కభ్యంతరము చెప్పెదవా?" అనియెఱిఁగిన కంఠస్వరముతోఁ జనువుగా సంబోధించిరి.

తిక్కనయాఁగెను. విభ్రాంతి చెందెను. కరవాలమాతని చేతినుండి క్రిందఁబడెను. అతఁడా క్రొత్తమనుష్యునిఁజూచెను. మనసారఁదిలకించెను. తటాలున "ముకుందశర్మా? నాయారవ ప్రాణమా!" అనుచు నాయాగంతుకునిగాఢాలింగనమొనర్చెను.

"తమ్ముఁడూ! తమ్ముఁడూ! పునర్జన్మమెత్తినావురా, తమ్ముఁడూ!" అనుచు చెల్లాంబ రివ్వునఁబోయి తనభర్త కౌఁగిటినుండి విడువడినపురుషుని మనసారసంశ్లేషించి యానందబాష్పములు విడువఁదొడఁగెను.

పదునైదవప్రకరణము.

దేశద్రిమ్మరి.

కుశలప్రశ్నములై పోయినవి. పునఃపునరాలింగనములడఁగినవి. ఇప్పుడు తిక్కన, యాతని తల్లిదండ్రులు- చెల్లాంబ, ముకుందశర్మచుట్టునుగూర్చుండి, యాతనిఁదమ మధ్యనాసీనుఁ జేసి, యెనిమిదేండ్లనుండియు నాతనివృత్తాంత మేమో, సరిగా నీసమయమున నాతఁడచటికెట్లు వచ్చుట తటస్థించెనో యని వింతచెందుచు నాతని నావిషయము గ్రుచ్చిగ్రుచ్చి యడుగఁజొచ్చిరి. ముకుందశర్మ మందహాసమున బావతో నిట్లనెను.

"బావా! నాచరిత్ర వినవలెనని యభిలాషకలదా? అయిన నీవీవెడఁగు కృత్యము మానినఁగాని నేను నీకది తెలియఁ జెప్పను. నీవెంటయుద్ధమునకు రాను. తెలిసినదా!"

ఖడ్గతిక్కన, యపజయపరాభవ మిప్పుడు తలఁచుచుండలేదు. ముకుందశర్మ రాకచే సూర్యప్రకాశమున విచ్చు మంచురీతి నాతనియుద్రేకముడిగెను. నవ్వుచు నాతఁడు శాంతవదనముతో నిట్లుత్తరమిచ్చెను. "శర్మా! నాకుడిచేతివి- నాహృదయమవు నీవు గాకున్న నే నింకయుద్ధమున కేగుదునా? నీక్షేమసమాచారము—చిత్రవృత్తాంతముఁ దెలిసికొన మిక్కిలి తొందరగలుగుచున్నది. శాంతముగా విందును.

చెప్పుము. ఈయెనిమిదేండ్లనుండియు నీవు లేమి మనసున కేమోచీఁకటిగ నున్నట్లుండెను. బుద్ధికినుల్లాసము నశించెను- కాని యీవ్యర్థ ప్రసంగమేల? నీచిత్రచరిత్ర వినువఱకు నేమియుఁదోఁచుటలేదు. మున్ముందుగఁ జెప్పుము"

ముకుందశర్మ యంతట మందహాసము ముఖమునఁ దొట్రాడ నిజవృత్తాంతము నిట్లు వారికిఁ జెప్పదొడఁగెను:—

"ఎనిమిదేండ్లక్రిందట—అనఁగా నాయిరువదియవయేట—నేను మిమ్మెల్లర విడిచి, చెప్పకుండ లేచిపోయి, దేశాటన మారంభించితిని. వింతస్థలములఁజూడవలెనని - పూర్వులవలె నుదారకృత్యము లొనర్పవలెనని నాయభిప్రాయమైయుండెను. అక్కా! నీవు నాకొఱకెంత వగచితివో! బావయెంత చింతిల్లెనో!—కాని నామనసట్లు పోయినది. నేను దేశద్రిమ్మరిని హృదయపూర్వకము గానైతిని.

"నాలుగైదు నెలలు నాయిచ్ఛవచ్చినట్లు సంచారమొనర్చి పిమ్మట కాకతీయగణపతి పాలించు ఓరుగల్లుచేరితిని. నేనచ్చటఁజేరిన కొలఁది దినములకే పెద్దపందెములు జరిగెను. గుఱ్ఱపుస్వారి—కత్తిసాము—మల్లయుద్ధము మొదలగునవిపురము వెలుపలనున్న మైదానమున గణపతిమహారాజు నాధిపత్యముక్రిందజరిగెను. నేను చూడఁబోతిని. ఆప్రదేశము చేరునప్పటికి నాకువీరావేశముకలిగెను. నేనుచక్రవర్తినిడాసి యొకగుఱ్ఱము- కరవాలము నర్థించితిని. నన్నుగనిన ప్రథమక్షణము నుండియు రారాజునకు నాపైఁ బుత్రవాత్సల్యము కలిగెను.

ఆయన నాకోర్కులఁ దీర్చెను. నేనును బందెములలోఁ బ్రవేశించితిని.

"పరమేశ్వరుని కృపనాయందుఁ బూర్ణముగ నుండుటచే నానాఁడు గుఱ్ఱపుస్వారియందును- కత్తిసామునందు నేను ప్రథమగణ్యుఁడనైతిని. గణపతి మహారాజు నన్నొనర్చిన యాదరణమునకు స్తుతికి మేరలేదు. ఆతఁడు నన్నొక సైనికోద్యోగిని జేసి తన యంగరక్షకులలో నొకనిగ నేర్పఱచెను. నాటినుండియు దేశములు ద్రిమ్మరు బుద్ధిమాని యచట వాసముచేయ నారంభించితిని. దీనికిఁదోడు చిరకాలములోనె నన్నచటఁ గట్టివేయుపగ్గమును దేవుఁడు పేని సిద్ధమొనర్చియుండెను.

'ఒకనాఁడు చక్రవర్తితో నేను వేటకేగితిని. అచట నొకచిత్రము జరిగెను. నాఁడు దైవకృపచే నేనొక యసహాయురాలగు బాలికను పెద్దయడవిపంది నోటనుండి కాపాడఁ గలిగితిని——'

ఇచ్చట ముకుందశర్మ వృత్తాంత మొకింతకాల మాపుచున్నారము. ముక్తాంబను రక్షించుట- గణపతియామెను లంబాడీలయొద్దనుండి కానుకగా గ్రహించి, 'వృత్తాంతమడుగుట- బ్రాహ్మణబాలికయని తెలిసికొనుట- ముకుందశర్మను ముక్తను వధూవరులుగ నాస్థలమునే నిర్ణయించుట- పురముఁ జేరుట- ఆమె తండ్రికొఱకుఁ గబురుపంపుట- ఆతనిజాడ తెలియకపోవుట-కొంతకాలము నిదానించి యిర్వురికిని వివాహముఁ జేయుట వఱకును జదువరులకుఁ దెలియుట చెప్పమానుచున్నాము. ఇంతదనుక విన్నతరువాత నాశ్చర్యముతో ప్రోలాం

బయిట్లనెను. ‘అల్లుఁడా? బంధుగులఁ బిలువకుండ వివాహము చేసికొంటివా? నీభార్య యెచ్చటనున్నది? ఆమెను దీసికొని వచ్చితివా లేదా? చెల్లంబా! నీకు నేఁటికి మఱఁదలు గలుగు భాగ్యము భగవంతుఁ డనుగ్రహించినాఁడు. ఆమె చక్కని చుక్కఁగాకున్న ముకుందుఁ డిట్లామె వలలోఁబడి యిన్నిదినములు మనల మఱచిపోవుట సంభవింపదు.’

‘నాకథ సాంతమైన పిమ్మట లోపములు తీర్చెదను. ప్రస్తుతము ముందుసంగతి వినుఁడు,’ అని కథకుఁడు చిఱునవ్వుతోఁ జెప్పెను.

సిద్ధయ్య నవ్వుచుఁ బ్రేమతో “ముకుందా! నీకును ముక్తాంబకును సంబంధము తగినది. ఆమె తండ్రిని బాసి యిడుమలఁబడుచుండ నీవామెను జిత్రముగాఁ గాపాడితివి. మీసమావేశము వివాహము నాటకములందువలె వింతగానున్నది” అనెను.

“నీమామగారిజాడ యిప్పటికైనఁ దెలిసినదా?” అని తిక్కన యడిగెను.

ముకుందశర్మ మనస్ఫూర్తిగాఁ గొన్ని యాబద్ధములాడెను. దీనికిఁ గారణములు తరువాతఁ జెప్పెదము. శర్మయిట్లుత్తరమిచ్చెను “ప్రయత్నింపఁగా - ప్రయత్నింపఁగా నాల్గైదునెలల క్రిందట నాతని జాడఁ గనిపెట్టఁగలిగితిని. అదికనుఁగొనుట కారుసంవత్సరముల కెక్కువగ శ్రమపడితిని. తుదకు యత్నము ఫలించెను. నామామ పల్నాటిలో నున్నట్లు తెలిసి భార్యాసహితుఁడనై వెడలితిని. మేమాతనిఁ జూచితిమి. ఆయన

కూఁతును మనసార దగ్గఱఁదీసి మమ్ము తనచెంతఁ గొన్ని దినములుంచుకొనెను. కానియాతఁడు విస్తారముకాలము జీవించలేదు. చెంతఁ గుమార్తెయు నేను నుండఁగనే నిర్విచారముగా నాతఁడు పరమపదమొందెను. ఆయన చరిత్ర ప్రస్తుతము మనము తెలిసికొననక్కఱలేదు. పోఁగొట్టుకొనిన పుత్రికనుగూర్చి చింతించి, చింతించి, కృశించిన యాతని తుదిప్రార్థనను పరమేశ్వరుఁడు మన్నించి నెఱవేర్చెను.”

“పాపము! ముక్తకున్న యొక్కచుట్టమును గూడ గతించెనా?” అనుచుఁ జెల్లాంబ విచారముతోఁ బల్కెను.

“ఆతని యుత్తరక్రియలు యథావిధిగ నెఱవేర్చి మేము ఓరుగల్లు తిరిగివచ్చితిమి. దేనికొఱకైన నేను కడుఁ బ్రయాసపడుచుంటినో యాపనిదీఱుట తడవుగ నెనిమిదిసంవత్సరములకు నాకు నాసోదరిని బంధుగులను జూడవలెనని యుద్రేకము జనించెను. మహారాజునొద్ద సెలవుఁగైకొని నెలదినముల క్రిందట భార్యతో బయలుదేరి, వెంటనొక బాలునిఁగూడఁ బరిచారునిగా నుంచుకొని నెల్లూరు వెలుపలనున్న మామిడితోపులో విడిసితిని. అచ్చటతోపులోని పెంకుటింట బసజేసితిమి——”

తిక్కన, మఱఁదిమాటలకడ్డమువచ్చి, “పడమటిబాట ప్రక్కనున్న తోపులోనా! అచ్చటఁ గొలఁది దినములక్రిందట నేను మృత్యువునోటనుండి యొకసన్యాసికృపచేఁ దప్పించుకొంటిని. ఆసన్యాసియు నాపెంకుటింటనే యాసమయ

మునఁ దనసహచరునితో వసించుచున్నట్లు తెలియవచ్చినది. నీవాతని నెఱుఁగుదువా?" అనియడిగెను.

"ఎఱుఁగుదును," అనుచు ముకుందశర్మ మందహాసముతో సమాధానముచెప్పి యిట్లనెను, "ఈనడుమ చెంచుదండులా తోఁపుప్రక్క ప్రబలముగాఁదిరుగఁ జొచ్చినవి. మేమక్కడ మావేషములనుండుట యపాయకరముగఁ దోఁచెను—"

ఈమాఱు సిద్ధయ శర్మవాక్యముల కడ్డమువచ్చి, "తిన్నగా భార్యతోఁ బురమునుజేరి మనయింటికేల రావైతివి?" అనిప్రశ్న వేసెను.

"ఒక్కమాఱుగ మారాకచే మిమ్ముఁగలవరపెట్టఁదలఁచికొనలేదు. నేను మాఱువేషమున మిమ్ముఁజూచి-సమయమెఱిఁగి తెలుపుకొని- నావృత్తాంతముఁజెప్పి, నాభార్యనుదీసికొనిరాఁదలఁచితిని. దీనికిఁదోడుగ నాకోరుగంటిలో వైద్యుల పరిచయము బాగుగానుండుటచే మాఱువేషములకు లేపనములు తెలియును. నేను వానినిసంపాదించి శరీరమునకుఁజిత్రముగ దట్టమగు చామనచాయ పూఁతపూసి, చిఱుగడ్డము పెంచి, శిరోజములు తలపై జటలుగా ముడివేసి, సిద్ధముచేసియుంచిన కాషాయవస్త్రములుధరించి—సన్యాసినైతిని!"

పెద్ద మెఱపుమెఱసి గాఢాంధకారము విచ్చి సమస్త వస్తువులు నొక్కమాఱుగ గోచరమైనట్లాయెను.

"ఆఁ! ఆఁ! ఆసన్యాసివినీవేనా! నీవా!" అనుచు నందరినోళ్ళనుండి యొక్కమాఱుగ నాశ్చర్యోక్తులు వెలువడెను. వారివింత గమనించియే తీరవలెను.

"నాయనా! మాకుఁ బుత్రభిక్ష పెట్టితివి. శర్మా! చచ్చినీకడుపునఁబుట్టి ఋణము తీర్చికొందుము." అనుచు ప్రోలాంబయు సిద్ధయయు ముకుందునిస్తోత్రపయోధిలో నోలలాడించిరి.

"తమ్ముఁడా! బావగారిని రక్షించుకొని సోదరియైదువతనమునకు భంగమురాకుండఁ జేసితివా! నీయద్భుతచర్యలోకదానినొకటి మించుచున్నవిగదా! పరమేశ్వరుఁడునాకు సోదరుని, పతినినొక్కమాఱే తిరిగిప్రసాదించినాఁడు సుమీ!' అనుచుఁజెల్లాంబ యానందాశ్రువులువిడిచెను.

"ఎంతగారడి చేసితివోయి, మఱఁది," అనుచు తిక్కన మహాసంతోష విస్మయాదరములతోఁ బలికెను. "అయిన నాదినమున నీసేవక బాలుఁడు 'చెంచులు చిన్నయ్యగారిని ముట్టడించినారు' అని కాఁబోలు నఱచెనే. చిన్నయ్యగారన నీభార్యకు పురుషవేషము వేసితివా? నీచర్యలు చిత్రముగానున్నవి"

జరుగుచున్న సంభాషణనుబట్టి రణతిక్కన మామిడితోఁపుదగ్గఱ జరిగినయంశములు తనతల్లిదండ్రులకును భార్యకును దెలిపినట్లు స్పష్టమని మాచదువరులకు మేము చెప్పవలసిన యగత్యములేదు. స్తోత్రము రుచించని ముకుందశర్మ వారి పొగడ్తయంతయుఁ జిఱునవ్వుతో సహించి మరలఁ దనకథ నిట్లుచెప్పుచు వారి సంశయములు దీర్చెను.

'అవును. దేవికైన మంచిదని ముక్తకుఁ బురుషవేషము వేసికొన నాజ్ఞయిచ్చితిని నేను మీయొద్దనున్నపుడు నాబాల

సేవకుఁడు శ్యామోజి వచ్చెను. మీరు క్రొత్తవారగుట నాతఁడు యుక్తిగా 'చిన్నయ్యగారు' అనుచు నాభార్యనుద్దేశించి యామె యపాయస్థితి నాకుఁ దెలిపెను. నేను మిమ్ము వీడ్కొని వెళ్ళునప్పటికే కార్యము మించిపోయెను. అసహాయయై యున్న ముక్తను చెంచులెత్తుకొనిపోయిరి.'

'శ్యామోజియెట్లు తప్పించుకొని నీయొద్దకు వచ్చెను?' అని తిక్కన యడిగెను.

'ఆతఁడు తోపులోఁ గ్రుమ్మరుచుండఁగా దండు ముక్త యున్న గృహముఁ జుట్టుముట్టెను. ఆతఁడు వెంటనే పఱువిడుచు వచ్చి నాతోఁ జెప్పెను. నేనును శ్యామోజియు భద్రముగా దాచియుంచిన మాకరవాలములఁ దీసికొని మేమాదండును వెంటనే వెంటనంటి సుమారర్ధరాత్రమగు నప్పటికి సాంద్రారణ్యములో వారిజాడ కనిపెట్టి, సమయములో ముక్తను రక్షించితిమి.'

చెంచులు ముక్తను బలియొసఁగనెంచుట మొదలగు ఘోరవిషయములు వినువారదరునట్లు విశదముగాఁ జెప్పి శర్మ మరల నిట్లుపక్రమించెను.

"చెంచులు ముక్త స్త్రీయని గ్రహించి పురుషవేషము మార్పించిరి. నేను రక్షించునప్పటి కామె సహజవేషముననుండెను- అక్కా! చెంచులను బాఱఁదోలుటలో నీమఱద లవక్రపరాక్రమముఁ జూపెను. ఆమె రాజపుత్రస్త్రీలవంటిది సుమా!"

'అగునా? పెండ్లమును సమరశిక్షయందుఁ బ్రౌఢనొనర్చితివా?' అనుచు నెల్లరు నగతాళిగాను- బ్రేమాపూర్వకముగను బలికిరి.

"పిమ్మట మేము సురక్షితముగా నెల్లూరుచేరి యొక గృహమునందు విడిసితిమి. నేను సమయము కొఱకు వేచి మీకెఱింగించుకొనఁ దలఁచుకొంటిని. ఈలోపుగ నీయుద్ధపు గోలపుట్టెను. అది ముగిసినపిమ్మట తెల్పవచ్చునని యూరకుంటిని. కాని నేఁటిరణపర్యవసానమునుబట్టి బావమనసు చిన్నబోయియుండుననియు- నాతని నోదార్పమీరు సమర్థులు కారనియు నేను మారువేషము త్యజించి వచ్చితిని."

"తమ్ముఁడు! తగుసమయమున వచ్చితివి. మేము వీరావేశమున నన్న మాటలచేఁ బ్రేరేపితులై మీబావ వెనుక ముందులు యోజింపక యుద్ధభూమికి బయలువెడలినారు." అనుచుఁ గన్నీటితోఁ జెల్లాంబ వచించెను.

"కథయైనదా? నీభార్యను జూపులోపమో?' అనుచు ప్రోలాంబ వికసితముఖముతో నాతని హెచ్చరించెను.

'రండు' ముకుందశర్మ లేచెను. 'ఈసరికి ముక్త వచ్చి మనకొఱకై వేచియుండును. క్రిందికిరండు!"

అందఱుఁ గ్రిందికి వచ్చిరి. అచ్చటముక్త శ్యామోజీతో వేచియుండెను. ఆమెముద్దులుమూటగట్టు ముఖమును, మనోహరాకృతిని జూచుటతోడనే యెల్లరు నామెయందు బద్ధానురాగులైరి. ప్రోలాంబయు- చెల్లాంబయు ముక్తనొక గడియవఱకుఁ గౌఁగిలించుకొనుచు, సాంత్వనోక్తులు పల్కుచు

క్షేమసమాచారమడుగుచుఁ దనివి తీఱ నామెనుగాంచుచు నామెను బ్రశ్నలు వేయుచు నేయుండిరి. వారియత్యాదరమున ముక్తవినయమున నానందజనిత కృతజ్ఞతాబాష్పములు విడుచుచు వారివారిప్రశ్నలకు మృదుమధుర స్వరముతోఁ బ్రత్యుత్తరములు చెప్పఁజొచ్చెను.

పదునారవ ప్రకరణము.

యుద్ధము—ద్వితీయదినము.

ముక్తాంబనోటితోఁ నామెచరిత్ర నచటివారు వినఁగోరుటచే నామె దానిని వారకి వినుపించెను. కాని వారెల్లరుఁ జక్కఁగా వినికిడిమూలమున నెఱిఁగిన బ్రహ్మరుద్రుఁడే మాఱుపేరుతోనున్న తనతండ్రియనియుఁ, దానాతని సందర్శించినట్లును—అతఁడు జీవించియేయుండి వారిప్రతికక్షిసేనానాయకుఁడై యున్నట్లు నామె యెఱిఁగింపలేదు. ముకుందశర్మ యబద్ధములాడినట్లె యామెయు నేర్పుతో నసత్యములు పలికి తనతండ్రి పల్నాటిలో నుండినట్లును, మరణించినట్లును జెప్పెను. ఇట్లామెయనృతములు పలుకుటకు భర్తయాజ్ఞయే కారణము. అతఁడిట్లొనర్చుటకు హేతువు వివరించుచున్నాము.

రణతిక్కనయు, బ్రహ్మరుద్రయ్యయు నెదురుసైన్యముల సేనానులైయున్నారు. జరుగుచున్నది దారుణసంగ్రా

మము. వారొండొరుల మార్కొనుట సహజము-మార్కొనక తప్పదు. అనుమానాస్పదమగు యుద్ధభూమియం దెవ్వరి కెవ్వరో— యేవేళకేమో! వారు తనమూలముగ బంధువులైరని తెలుపుట సమంజసముగాదు. తిక్కన తనబావయని తెలిసిన బ్రహ్మరుద్రుఁడాతని మనస్ఫూర్తిగా నెదురింపఁజాలఁడు. బ్రహ్మరుద్రయ్యతనమామయని గ్రహించిన తిక్కన యుల్లాసము నశియించును. ఆతనిస్థితి కష్టమగును. పోరాడి బ్రహ్మరుద్రునిజయింపఁ జూచుట కాతనికిఁ జేతులు రావు. ఈ కారణముచేఁ బ్రస్తుతము వారిర్వురిని ముకుందశర్మమోసపుచ్చెను. అది మిక్కిలి సదుద్దేశముతోడనే! ఆతనిదూరాలోచన యెంతవఱకు నుపయోగించెనో ముందుముందుఁ దెలియఁగలదు.

ముకుందశర్మ తిక్కనతోవాదించి మఱునాఁడు సర్వసేనతో నుచితరీతి యుద్ధభూమిఁ జేరునట్లు సమ్మతింపఁజేసెను. తరువాత బావమఱఁదు లిరువురును రాజసన్నిధానమునకుఁ బోయిరి. అచ్చటరాజు, తిక్కనమంత్రి అన్నంభట్టునుండిరి. వారుముగ్వురు ముకుందశర్మనిదివఱకు బాగుగ నెఱిఁగినవారగుట యాతని యాకస్మిక ప్రత్యక్షమునకు విస్మయాంబుధిని మునిఁగి యాతనిఁజుట్టును జేరిరి. వారికోరికపై శర్మతన వృత్తాంతము క్లుప్తముగా నెఱిఁగించెను. ఆతఁడే తనను గాపాడిన సన్యాసియని వినినప్పుడు మనుమసిద్ధిచెందిన యాశ్చర్యమునకు మేరలేదు. నాఁడువారేటికి మాఱువేషములతో నెల్లూరువచ్చుచుండిరో యని శర్మయడుగ మనుమసిద్ధి యిట్లుత్తరమిచ్చెను.

'ఇచ్చటనే సమీపమున అల్లంపూడిలోఁ గొందఱు ధనికులు తగవులాడి నాసభకే తెంచి తమ తమ జగడములు కారణములుఁ జెప్పిరి. నేను స్వయముగా మాఱువేషముతో మన తిక్కన సేనానిని వెంటఁబెట్టుకొని తలవని తలంపగునట్లుగా అల్లంపూడిచేరి యచ్చట సభచేసి, జగడములు తీర్మానించి బయలువెడలి వచ్చుచు నీచే రక్షింపఁబడితిని. చాలచిత్రముచేసితిని.'

'అన్నంభట్టూ! వెనుక నీవు నాకొకమాఱుపకారము చేసితివి. దానికిఁ బ్రత్యుపకారము నీబాల్యస్నేహితుని ముకుందుని దెచ్చినీకుఁ గన్పఱచినాను' అనుచు శర్మ చిఱునవ్వుతోఁ జెప్పెను.

'నిజముగా మేలుచేసితివి. బ్రహ్మరుద్రుని వర్ణన విశదముగాఁ జెప్పుమంటివేల? అని యన్నంభట్లు ప్రశ్నవైచెను.

చిక్కువచ్చినది. సంగతి బయలగునా? శర్మచాకచక్యముతో నిట్లనెను. 'అది మాఓరుగంటిరాజకీయవ్యవహారము. ఒక బ్రాహ్మణుని కొఱకు గణపతి మహారాజు మిగులఁబ్రయత్నించుచున్నాఁడు.,

మనుమసిద్ధి ప్రయత్నముచే సహాయమువచ్చిన భూపతులయంతః కలహములుడిగెను. వారు తమ వెఱ్ఱిపనికిఁ బశ్చాత్తాపపడి మఱునాఁడు తమ తమ పరాక్రమములు పూర్ణముగాఁజూపి వెనుకటి దినము పోరాడనిలోపము దీర్తుమని దృఢనిశ్చయులై పల్కిరి. మఱునాఁడు మరల మహాయుద్ధమునకు సర్వసన్నాహములుజరిగెను. తనయుపనిందశాత్రవరక్తముతో

గడగివేయుట కెప్పుడు తెల్లవారునాయని తిక్కన సేనాని యుద్రేకముతో వేచియుండెను. ఎట్టకేలకుఁ దెల్లవాఱెను. ఒకజాము గడచిన పిమ్మట యోధులెల్లరు యుద్ధసన్నద్ధులై కవచాదులు ధరించిరి. రణతిక్కనయు, ముకుందశర్మయు, దమ తమ ప్రియురాండ్రయొద్దను, ఇతరచుట్టముల యొద్దను వీడ్కోళ్ళువడసి, పెద్దల దీవనలొంది, సుందరాశ్వములెక్కి గొప్పసేనను నడపించుచు పంచలింగాల కొండకడకు బయలు వెడలిరి.

మహావీరుఁడగు తిక్కనసేనాని నెల్లూరు మరల జీవములతోఁ బ్రవేశింపలేదు.

పోరు మఱునాఁడింకను భయంకరముగ నుండెను. ఇరుప్రక్కల ననేకులు నిహతులగుచుండిరి. ఎందరు యువతులు సోదరుల, దండ్రుల, మగల, జుట్టముల వారిజీవితములలో మరలఁ బ్రాణములతోఁ దిరుగఁ జూడనోచుకొనలేదో! ఒకనృపతికి మఱియొకని కేకారణముననో జగడము. అదిసామాన్యముగాఁ బోవదు. అదిమారిక వంటిది. దానికెన్నియమూల్య ప్రాణములో బలిగావలెను. ఎంతరక్తమో యభిషేకము కావలెను. ఎంతమంది నరులో యాహారము కావలెను. పరమేశ్వరుడట్టి జననాశన హేతువులైనయుద్ధముల నేల చేయించును? జననాశనముకూడ నొకప్రక్కను జరుగకున్న క్షణక్షణాభివృద్ధిఁ గాంచుచున్న యీసృష్టిలో నరులొకరి నొకరు మ్రింగుకొనరా? ప్రళయములు పుట్టవా?

ముకుందశర్మకు పిన్నమనాయనితో యుద్ధముతట

స్థమాయెను. వారిరువు రొకగడియకాలము తీవ్రముగాఁ
బోరిరి. పిన్నమనాయఁ డద్భుతశౌర్యము చూపెను. ఆతఁడారి
తేరినయోధుఁడు. అనేక యుద్ధరంగములఁ జూచినవాఁడు.
ముకుందశర్మ యౌవనుఁడు. విస్తారమనుభవశాలిగాఁడు. అయి
నను మిక్కిలి నేర్పరి. ఆతఁడు కాఁబట్టి నాఁడు పిన్నమనా
యని ధాటికాగఁజాలెను. చుట్టుప్రక్కలనున్న భటులు రణము
డిగి యాద్వంద్వయుద్ధము నాత్రముగాఁ దిలకింపఁజొచ్చిరి. కొంత
సేపుగడచెను. పిన్నమనాయఁడలసి తనవిరోధికి లొంగవలసి
వచ్చునట్లుండెను. ఆతని శరీరమునఁ గొన్ని పెద్దగాయములై
నెత్తుటిచే నంగములు తడసెను. తన శూరుఁడగు విరోధి నా
తఁడు లోలోన నెంతయో మెచ్చుకొనఁ జొచ్చెను. ఈ సమ
యమున నెల్లరి దృష్టులు నొక్కచోటి కాకర్షింపబడెను. అం
దఱు యుద్ధముఁ జేయుట మాని వింతతో, మెప్పుతోఁ గొదమ
సింగములవలెఁ బోరుచున్న యొక యోధద్వయమును దిలకిం
పఁదొడఁగిరి.

వారెవ్వరు? బ్రాహ్మణ క్షత్రియ ధర్మముల మూర్తు
లనఁదగు ఖడ్గతిక్కనయు, బ్రహ్మరుద్రుఁడును. ఎట్టకేల కిరు
వురు మహావీరులును ముఖాముఖిఁ గలసికొనిరి. ఒకరినొకరు
మెచ్చుకొనిరి. తనకు సరిజోడని యొకరినొక రగ్గించుకొనిరి.
కేవలము మనసునందే! హయారూఢులై భయంకర ద్వంద్వ
యుద్ధమారంభించిరి. మొదటఁ జుట్టుప్రక్కలవారును క్రమ
క్రమమున నా మహాసైన్యమంతయు నాఘోరసమరముచే
నాకర్షింపఁబడెను. ఇరుతెగలవారు నొకపెద్దవలయ మేర్పడి

మధ్య నాద్వంద్వమునుంచి సూక్ష్మముగా నాపోరు గమనించు
చుండిరి.

ఇరువురు నిప్పటికి రెండుగడియల కాలమునుండి
రణమొనర్చుచుండిరి. ఉభయుల కవచములును - హయము
లును అస్త్రములును అంగములును నెత్తుని రక్తముచేఁ దడుపఁ
బడి దృష్టిచెదరునట్లు కన్పట్టుచుండెను. ఒకరిరుధిర మొకరు
చూచినకొలఁదిని వారి వీరావేశమెక్కువయై హుంకారము
లతో పటాక్షేపముతో ఘోరాకృతులతోఁ బ్రాణములపై
నిరాశతో గర్భశత్రుత్వము వహించిన యాఁబోతుజంటవలె
వారొండొరులఁ దాకుచుండిరి. నడుమ నడుమఁ గొందఱు
సైనికులు 'మేలు! మేలు' 'బౌరా! నేర్పు!' 'ఆహా! యేమి
పరాక్రమము!' సింహద్వయము' అనుచు నొక్కొక్క సాహ
సకృత్యమునకు బిగ్గఱగ నఱచుచుఁ బొగడ్తలఁ దెలుపుచుండిరి

ఆద్వంద్వయుద్ధ పర్యవసానము పైనాఁటి యుద్ధపర్యవ
సాన మాధారపడియున్నట్లు స్పష్టమాయెను. లేనిచో నిన్నివేల
నేత్రము లాశూరయుగమునట్టు తిలకించుచు నుద్రేకము
సూచించుచుండ నేల? అందఱు రాజులు నిలిచి యాకయ్యము
సాదరముగా గమనింప నేల? తిక్కనయు, బ్రహ్మరుద్రుఁడు
నీవిషయము గ్రహించుకొని నట్లగపడిరి. వారియుత్తమాశ్వ
ములు సహితము గ్రహించుకొనినట్లగపడెను. లేనిచో నాతీవ్ర
తయేమి? అమూల్యములగు జీవములందా నిర్లక్ష్యభావమేమి?
ఆ మహాభీలములగు తాకిడులేమి? ఆయావేశాతిశయమేమి?

ఇప్పుడు బ్రహ్మరుద్రయ్య గెలుపొందునట్లున్నాఁడు.

జనుల హృదయములు తట తటఁ గొట్టుకొనుట వినఁబడు
చున్నది. కాటమరాజు భటులకు మేనులు పులకలెత్తుచున్నవి.
తిక్కనపనియైపోయినది. కాదు. కాదు. తిక్కన పరాక్రమించి
నాఁడు. ఒక్కమారుగ నాతనికి వేయిగజముల బలమువచ్చి
నట్లున్నది. ఆతని ధాటికి బ్రహ్మరుద్రయ్య నిరుగక నిలుచునా?
మేలు! తిక్కనా! మేలు! ఒక్కదారుణ ప్రహారణముచే రణ
తిక్కన విరోధిని విగతాశ్వు నొనర్చెను. నేల వ్రాలుచున్న
యశ్వమునుండి బ్రహ్మరుద్రయ్య లాఘవముతోఁ గ్రిందికి
లంఘించెను. ఆతనితల తిరుగుచున్నట్లుండెను. మఱియొక
క్షణము-బ్రహ్మరుద్రుఁడు చెలరేగినాఁడు. ఖడ్గమెత్తినాఁడు.
తిక్కనమీఁదికి ఝరీవేగతుల్యముస నురికినాఁడు ఈ మారు
తిక్కన లేఁడు!

చూపరద్భుతపడునట్లు తిక్కన యా వ్రేటు దైవికము
గాఁదప్పించుకొనెను. కాని యశ్వమునుగోలుపోయి నేల
కురుకవలసివచ్చెను. ఇప్పుడు పదాతులైనవారి సంగ్రామము
మఱింతతీక్ష్ణమైనది. వారిశరీరములు జల్లెడలైనవి. రక్తము
గొట్టములనుండి చిమ్మినట్లు వర్షించుచున్నది. ఆవేశమున
దేహములుమఱచినారు. బ్రహ్మాస్త్రములవలె నొకరినొకరు డీ
కొని యన్యోన్యనాశనము గావించుకొనుచున్నారు. ఇరు
వురునుమిక్కిలి డస్సియున్నారు. ఇఁక కొలఁది సేపటిలో
నెవ్వరోయొకరు లోఁగును-మరణించును- ఒకవేళనిరువురుఁ
గూలుదురేమో! ఎవ్వడు మున్ముందు సమయును? దీనిపర్య
వసానమేమి? జయమెవ్వరిది!

END OF
TITLE